www.manatelangana.news
Mana Telangana
మన తెలంగాణ
హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 64 | బుధవారం | 23 ఆగస్టు, 2017
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

తలాక్ తగదు

రాజ్యాంగ విరుద్ధం : సుప్రీంకోర్టు మెజారిటీ తీర్పు

- ఆరు మాసాల పాటు నిషేధం
- ఆలోగా తగిన చట్టం తేవాలని కేంద్రానికి ఆదేశం
- శాసన రూపకల్పనలో ముస్లిం సంఘాలను, షరియా చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సలహా



ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులు



ఖేహార్ | అబ్దుల్ నజీర్ | యుయు లలిత్ | కురియన్ జోసెఫ్ | ఆర్ఎఫ్ నారిమన్



తలాక్‌కు వ్యతిరేకంగా ముగ్గురు, అనుకూలంగా ఇద్దరు న్యాయమూర్తుల తీర్పులు

స్వాగతించిన రెండు ముస్లిం సంస్థలు, కొత్త చట్టం అవసరం లేదు : కేంద్రం

న్యూఢిల్లీ: ఇస్లాం మతంలో విడాకులకు అనుసరిస్తున్న 'ట్రిపుల్ తలాక్' ఆచారంపై సుప్రీంకోర్టు మంగళవారం సంచలన తీర్పును వెలువరించింది. ఆ ఆచారం రాజ్యాంగ విరుద్ధమని, అది చెల్లదని స్పష్టం చేసింది. చట్టపరంగానూ అది విరుద్ధమైనదేనని కోర్టు తేల్చిచెప్పింది. ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహార్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 మెజార్టీతో ఈ మేరకు 395 పేజీల తీర్పును వెలువరిచింది. బెంచ్‌లోని ఐదుగురు న్యాయమూర్తులు ఖేహార్ (సిక్కు), జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ (ముస్లిం), కురియన్ జోసెఫ్ (క్రైస్తవ), ఆర్ఎఫ్ నారిమన్ (పార్శీ), యుయు లలిత్ (హిందూ) ఐదు విభిన్న మతాలకు చెందిన వారు కావడం గమనార్హం. ప్రధాన న్యాయమూర్తి ఖేహార్, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ మాత్రం ఈ ఆచారాన్ని ఆరు నెలల పాటు నిషేధించాలని, ఆ లోగా కేంద్ర ప్రభుత్వం దీనిపై ఒక చట్టాన్ని రూపొందించాలని ఆదేశించారు. చట్టం రూపొందించే విషయంలో అన్ని రాజకీయ పార్టీలు అభిప్రాయభేదాలను పక్కనపెట్టి ప్రభుత్వానికి సహకరించాలని వారు కోరారు. ఒకవేళ ఆరు నెలల్లోగా చట్టాన్ని తీసుకురాకుంటే ఈ ఆచారంపై విధించిన నిషేధం కొనసాగుతుందని వారు తమ మైనార్టీ తీర్పులో స్పష్టం చేశారు. చట్టాన్ని రూపొందించే విషయంలో కేంద్రం ముస్లిం సంఘాల ఆందోళనలను, షరియా చట్టాన్ని పరిగణనలోకి తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తమ తీర్పును సవాలు చేస్తూ దాఖలయ్యే పిటిషన్లను అప్పటివరకు స్వీకరించబోమని వారు స్పష్టం చేశారు. తలాక్ అంశాన్ని పార్లమెంటుకే వదిలేస్తున్నట్లు వారు చెప్పారు. అది దశాబ్దాల నాటి ఆచారమని, దానిపై న్యాయస్థానం జోక్యం చేసుకోదని ఖేహార్ స్పష్టం చేశారు. కాగా, ట్రిపుల్ తలాక్ ఆచారం చెల్లుబాటు కానిదని, రాజ్యాంగ విరుద్ధమైనదని సుప్రీంకోర్టు తీర్పునిస్తే, ముస్లిం మతంలో వివాహాలు, విడాకుల కోసం ఒక సమర్థవంతమైన చట్టాన్ని తీసుకువస్తామని కేంద్ర ప్రభుత్వం గతంలో పేర్కొన్న సంగతి తెలిసిందే. మరోవైపు ధర్మాసనంలోని మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులు కురియన్ జోసెఫ్, ఆర్ఎఫ్ నారిమన్, యుయు లలిత్ ఈ ఆచారం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. తలాక్ సహా ఖురాన్ నియమాలకు విరుద్ధంగా ఉండే ఏ ఆచారమూ ఆమోదయోగ్యం కాదని వారు తేల్చిచెప్పారు. తలాక్ ద్వారా విడాకులు పొందే ఆచారం స్పష్టమైన రీతిలో నిరంకుశమైనదిగానూ, రాజ్యాంగ తరువాయి 6లో



ఎగువ రాష్ట్రాల ఇష్టారాజ్యం పోవాలి

కృష్ణాబోర్డు తీర్మానం

మన తెలంగాణ/ హైదరాబాద్: దిగువన ఎండుతూ ఉంటే ఎగువ రాష్ట్రాల్లో నీటిని ఇష్టారాజ్యంగా వినియోగించుకోవడంపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కృష్ణా బోర్డు తీర్మానించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టం లేక వెలవెలపోతుంటే, ఎగువన కర్ణాటకలో ఇప్పటికే సాగు, మంచినీరు, విద్యుత్ అవసరాలకు 400 టిఎంసిలకు పైగా నీటిని వినియోగించడంపై బోర్డు సమావేశంలో చర్చించారు. విజయవాడలో మంగళవారం కృష్ణాబోర్డు సమావేశం జరిగింది. బోర్డు చైర్మన్ శ్రీవాస్తవ, సభ్య కార్యదర్శి సమీర్ తరువాయి 6లో



6

ట్రిపుల్ తలాక్ రద్దు తీర్పు చరిత్రాత్మకం

- ముస్లిం మహిళలకు సమానత్వాన్ని, సాధికారతను ఇస్తుంది : ప్రధాని



ముస్లిం మహిళలకు నవశకం : షా 10



సరైన న్యాయం జరిగింది : రాహుల్ 10

గౌరవిస్తున్నాం 10

- తీర్పు అమలు సులభం కాదు
- సామాజిక అంశాల్లో సంస్కరణే శరణ్యం: అసదుద్దీన్



పేదల బాంధవుడు, 150 ఏళ్ల నాటి విద్యాకుసుమం

రాజా బహదూర్ వెంకటరామారెడ్డి

- బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ సముదాయానికి శంకుస్థాపన చేస్తూ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు నివాళి
- సమైక్య రాష్ట్రంలో తెలంగాణ మహానుభావులను తలుచుకోలేదని ఆవేదన 6 లో



19 మంది ఎంఎల్‌ఎలతో

గవర్నర్‌ను కలిసిన దినకరన్

- పళని స్వామి ప్రభుత్వానికి విశ్వాస పరీక్ష నిర్వహించాలని డిమాండ్
- సర్కార్ మైనార్టీలో పడింది : విద్యాసాగర్‌రావుకు స్టాలిన్ లేఖ 10 లో

జాతర నుంచి మృత్యు ఒడికి

- ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో ఆటోను ఢీకొన్న టిప్పర్
- ఐదుగురు దుర్మరణం



మన తెలంగాణ/ ఆసిఫాబాద్/వాంకిడి: భవానీ జాతరకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటన మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో చోటు చేసుకుంది. కెరమెరి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది మిత్రులు వాంకిడి మండలం సరండి గ్రామంలో జరిగే భవానీ జాతరకు (టిఎస్ 01 యుబి 5055) ఆటోలో వచ్చి మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తిరిగి వెళ్తుండగా బెండార గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఓ టిప్పర్ ఆటోను ఢీ కొట్టింది. ఘటన తరువాయి 6లో

బ్యాంకుల సిబ్బంది సమ్మె విజయవంతం


9
- ప్రైవేటీకరణ మానుకోవాలని యూనియన్ల ఉమ్మడి వేదిక డిమాండ్

హామీలు గాలికి.. ప్రజాహక్కులపై దాడి

- తెలంగాణలో మూడేళ్ల పాలనపై ఢిల్లీ సెమినార్‌లో సురవరం 11

షేక్‌లకు త్వరలో షాక్

ముస్లిం బాలికల వివాహాలకు అడ్డుకట్ట వేస్తూ ఆర్డినెన్స్ తేవాలని మైనార్టీల సంక్షేమశాఖ ప్రతిపాదన




మన తెలంగాణ/ హైదరాబాద్ : ఇస్లాంకు, భారతదేశ రాజ్యాంగానికి విరుద్ధంగా విదేశీ వృద్ధులతో పేద ముస్లిం బాలికలకు జరుగుతున్న వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ నిర్ణయించింది. వివాహం, విడాకులు ఒకేసారి ముందస్తుగానే ఒప్పందం చేసుకొని జరుగుతున్న ఈ వివాహాలు ఇస్లాంను పరిహాసంగా మారుస్తున్నాయని, తక్షణం వీటిని ఆపాల్సిన అవసరముందని ఆ శాఖ అభిప్రాయపడింది. ఈ మేరకు సిఎంకు పలు సూచనలతో ప్రతిపాదన సమర్పించినట్లు తెలిసింది. గల్ఫ్ దేశాలకు చెందిన 60, 70 సంవత్సరాల వృద్ధులు రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ పాతనగరంలో పేదరికం, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలను వారం, రెండు వారాల గడువుతో వివాహాలు చేసుకుంటున్నారు. ఇలాంటి పెళ్లిళ్లలో టీనేజ్ అమ్మాయిలే ఉంటున్నారు. రోజులు, వారాల ఒప్పందంతో జరిగే వివాహాలు అన్ని మతాలు, లౌకిక తరువాయి 6లో

నల్లగొండ జిల్లా కనగల్‌లో జంటహత్యలు 6

కుంచెపోటు



అమ్మకోసం విడిపోయాం, అమ్మకోసం తిట్టుకున్నాం, అమ్మకోసం మళ్లీ కలిశాం, అమ్మకోసం ఎంతకాలం కలిసుంటామో!?





సంస్కారహీనులతో చర్చించం



మన తెలంగాణ/హైదరాబాద్: అబద్దాలతో, అసభ్య పదజాలంతో దూషిస్తున్న కాంగ్రెస్ ఎంఎల్ఎ వంశీచంద్‌రెడ్డి వంటి సంస్కారహీనులతో ప్రాజెక్ట్ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా లేమని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వచ్చే నెలలో జరగనున్న శాసనసభ సమావేశాల్లో ఏ ప్రాజెక్ట్‌పైన ఏం అడిగినా వాటికి సంబంధించిన సందేహాలను మంత్రి హరీష్‌రావు నివృత్తి చేస్తారని స్పష్టం చేశారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో మంగళవారం ఎంఎల్ఎ ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రతి ఎకరానికి సాగునీళ్లు రావడం ఖాయమైతే కాంగ్రెస్ కనుమరుగు అవుతుందనే భయంతోనే ప్రాజెక్టులను అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కల్వకుర్తికి సాగునీళ్లు వస్తుంటే ఎంఎల్ఎ వంశీచంద్ రెడ్డి కండ్లలో నీళ్లు వస్తున్నాయన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో మంత్రులుగా పనిచేసిన పొన్నాల లక్ష్మయ్య, సుదర్శన్ రెడ్డిని తీసుకుని వస్తే ఏ విధంగా అవినీతి జరిగిందో చర్చిద్దామని నారాయణరెడ్డి సవాల్ విసిరారు. ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఐదు సార్లు ఎంఎల్ఎగా గెలిచిన జూపల్లి కృష్ణారావు లాంటి వారిపై మొదటి సారి ఎంఎల్ఎగా గెలిచిన వంశీ నోరుపారేసుకోవడం దారుణమన్నారు.

రైతన్నకు శనగ‘పోటు’

- ప్రభుత్వ విత్తనాలకే అధిక ధర
- సబ్సిడీ విత్తన ధరలు ఖరారు



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేట్ ధీటుగా రాష్ట్ర ప్రభుత్వం రైతన్నపై విత్తన భారం మోపుతోంది. వచ్చే యాసంగికి సబ్సిడీపై పంపిణీ చేసేందుకు నిర్ణయించి శనగ, వేరుశనగ విత్తన ధరలే ఇందుకు ఉదాహరణ. యాసంగికి సబ్సిడీపై పంపిణీ చేయనున్న శనగ, వేరుశనగ విత్తనాలు క్వింటాలు ధరలను మంగళవారం ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో శనగ క్వింటాలుకు రూ.8680, వేరుశనగ రూ. 7600గా ఉంది. అయితే ఇతర రాష్ట్రాలలో, బహిరంగ మార్కెట్‌లో శనగకు ధరలకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రం పొంతన కుదరడం లేదు. ఇతర రాష్ట్రాలలో శనగకు మార్కెట్‌లో సాధారణ ధర క్వింటలునకు రూ. 4400 నుంచి రూ. 5700 వరకే ఉంది. మన రాష్ట్రంలో ఈ ఏడాది మార్చిలో క్వింటాలు శనగ ధర కేవలం రూ. 4900 మాత్రమే. ఇప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో ఇంతకు రెట్టింపుగా చెల్లించాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడింది. సర్కార్ సబ్సిడీ విత్తనాలే ఈ ధరకు విక్రయిస్తే విత్తన ధరల మార్కెట్ తీవ్రంగా ప్రభావితం అయ్యే ప్రమాదం ఉందని, ఇది అన్నదాతలకు తీవ్ర నష్టం చేకూరుస్తుందని రైతు సంఘాలు చెబుతున్నాయి. గతంలో టిఎస్ సీడ్స్, హాకాలు క్వింటాకు రూ. 7373 వరకు చెల్లించి విత్తన పంటను నేరుగా కొన్నాయి. గత ఏడాది యాసంగిలో వీటి ధర రూ. 9500గా నిర్ణయించి పంపిణీ చేసింది. అయితే అధిక వర్షాలతో యాసంగిలో వరి, శనగ పంటల దిగుబడి పెరిగి ధరలు కొంత తగ్గాయి.

ఇవే పరిస్థితులు దేశవ్యాప్తంగా ఉండటంతో శనగ పంట ధరలు పతనమవుతున్నాయి. ఎక్కువ ధరకు కొనుగోలు చేశాము గనుకనే అధిక ధరకు ఖరారు చేసి విక్రయించాల్సి వస్తోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనాల్లో సగానికిపైగా టెండర్ల నిర్వహణ ద్వారా కాంట్రాక్టర్ల నుంచి సేకరిస్తున్నవే ఉంటాయి. కాంట్రాక్టర్ల లాభం, నిర్వహణ ఖర్చులూ కలుపుకొని బహిరంగ మార్కెట్‌లో విత్తన ధరల కన్నా ఎక్కువ ధరలనే ప్రభుత్వం ఖరారు చేస్తోంది. ఈ విషయంలో కాంట్రాక్టర్ల ఒత్తిడి కూడా పనిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలాగైతే రైతుకు పెట్టుబడి భారం పెరుగుతందని, ప్రభుత్వం సబ్సిడీ శాతాన్ని పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

శనగ, వేరుశనగ విత్తనాల ధరలు ఖరారు

యాసంగి పంటల విత్తన సరఫరాకై రాష్ట్ర వ్యవసాయ శాఖ ధరలను ఖరారు చేసింది. హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే యాసంగిలో మొత్తం 5.82 లక్షల క్వింటాళ్ళ విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందులో శనగ, వేరుశనగ తప్ప మిగతా పంటల విత్తనాల ధరలలో మార్పు లేదు. శనగకు సంబందించి మొత్తం 1.33 లక్షల క్వింటాళ్ళను సరఫరా చేయనలి నిర్ణయించారు. దీనికి క్వింటాలు ధర రూ.8680 కాగా, ఇందులో 33 శాతం సబ్సిడి (రూ. 2865) ప్రభుత్వం ఇవ్వనుంది. మిగతా మొత్తం రూ. 5815 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. వేరుశనగకు 1.64 లక్షల క్వింటాళ్ళు సరఫరా చేయాలని నిర్ణయించగా, క్వింటాలు ధర రూ. 7600 , ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3040 పోను మిగతా మొత్తం రూ. 4560 రైతు చెల్లించాలి.

నంద్యాలలోనే తిష్ట వేసిన నాయకులు

- ఎన్నికల సంఘానికి వైఎస్ఆర్‌సిపి వినతి

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎన్నికల సంఘం జోక్యం చేసుకొని నంద్యాలలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వైఎస్ఆర్‌పిసి నాయకులు డిమాండ్ చేశారు. గడువు ముగిసినా మంత్రులు, టిడిపి నాయకులు ఉప ఎన్నిక జరిగే నంద్యాలలోనే ఉన్నారని వారు మంగళవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సచివాలయంలో ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌ను కలిసి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, కె.శివకుమార్, చల్లా మధుసూదన్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రజ్యోతి ఎబిఎన్ ఛానల్‌పైన ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేతలు నిర్వహించే విలేకరుల సమావేశాలపైనా కూడా దృష్టి సారించాలని కోరారు. అనం తరం శ్రీకాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రచార గడువు ముగిసినా మంత్రులు, స్థానికేతర టిడిపి నాయకులు ఇంకా నంద్యాల లోనే తిష్ట వేశారని ఆరోపించారు. స్థానికేతర నేతలను వెంటనే వెనక్కి పంపించాలని ఆయన డిమాండ్ చేశారు. ముక్కుపడకలు, చీరలు, మద్యం కూడా విచ్చలవిడిగా పంచుతున్నారన్నారన్నారు. ఈసి ఆదేశాలను పట్టించుకోకుండా సర్వే వివరాలు ప్రసారం చేసిన ఆంధ్రజ్యోతి ఎబిఎన్ ఛానల్ పైన చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బులు పంచుతూ దొరికిన టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలన్నారు.

తలాక్‌పై సుప్రీం తీర్పు హర్షణీయం

మన తెలంగాణ/హైదరాబాద్ : ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మానవ హక్కులకు, మహిళా స్వేచ్ఛకు పెద్ద విజయమని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు. గుడ్డి విశ్వాసాలు, మూర్ఖపు ఆచారాలపై మానవ హక్కులే గెలిచాయని మంగళవారం ట్విటర్‌లో పేర్కొన్నారు. హిందూయిజంలోని కులం, ఇస్లాంలోని మహిళలకు విడాకులిచ్చే తలాక్ వంటి అమానుష విశ్వాసాలు ఆమోదయోగ్యం కావన్నారు. ఎడారుల్లంటి ఆచారాల్లో చిక్కుకుని ప్రజల హేతుబద్ధ ఆలోచనాశక్తి దారి తప్పకూడదన్నారు.

కాటన్, జిన్నింగ్ మిల్లులకు రక్షణ

- ప్రభుత్వానికి అసోసియేషన్ విజ్ఞప్తి

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణలో సంక్షో భంలో ఉన్న కాటన్, జిన్నింగ్ మిల్లులు అలాగే ప్రెస్సింగ్ పరిశ్రమలకు విద్యుత్ ఛార్జీలు, ఇతర రాయితీల రూపంలో ఇవ్వాల్సిన రూ. 650 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించి ఈ పరిశ్రమలు సజావుగా నడిచేలా చూడాలని తెలంగాణ కాటన్ మిల్లర్స్, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం ఏటా 55 లక్షల బేళ్ల పత్తిని సాగు చేస్తోందని, పత్తి సాగులో తెలంగాణ దేశంలోనే మూడవ స్థానంలో ఉందని అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళ వారం అసోసియేషన్ ప్రతినిధులు కక్కిరాల రమేష్, ఎల్. నందకిషోర్‌లతో కలిసి ఆయన మీడియా సమా వేశంలో మాట్లాడారు. పత్తి పంట ఆధారిత జిన్నింగ్, కాటన్ మిల్లు పరిశ్రమలపై లక్షలాది మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. టెక్స్‌టైల్ ఆధారిత పరిశ్రమలైన జిన్నింగ్, ప్రెస్సింగ్ తదితర పరిశ్రమలకు అందాల్సిన రాయితీలు, ఇతర సౌకర్యాలు కల్పించి ఉన్న పరిశ్రమలను నడిపించుకునేలా తమకు సహకారం అందించాలని అసోసియేషన్ ప్రభుతాన్ని డిమాండ్ చేసింది.

భూమిని తిరిగి తీసుకోవడంతో మనస్థాపం చెంది ఒకరు ఆత్మహత్య

మన తెలంగాణ/సంగారెడ్డి ప్రతినిధి/సంగారెడ్డి క్రైం : ప్రభుత్వం ఇచ్చిన భూమి తిరిగి లాక్కుందనే మనస్థాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆందోళనకు దిగిన ఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మంగళ వారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే సంగారెడ్డి పట్టణానికి చెందిన వెంకట గోపాల్‌రావుకు గత 2008 సంవత్సరంలో సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని సర్వే నంబరు 599లో ఐదు ఎకరాల అసైన్డ్ భూమిని జిల్లా యంత్రాంగం ఇచ్చింది. కాగా అప్పటి నుంచి ఆ భూమిని లబ్ధిదారుడు సాగు చేయకపోవడంతో 2012 సంవత్సరంలో ప్రభుత్వం తీసుకుంది. ఈ స్థలంలో పంచాయతీ వనరుల కేంద్రం భవనం నిర్మాణానికి ఇటీవల మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. గతంలో ప్రభుత్వం తన తండ్రి గోపాల్‌రావు పేర ఇచ్చిన ఈ స్థలాన్ని తిరిగి ఇవ్వాలని కోరుతూ చలపతిరావు ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించాడు. తాజాగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. తనకు న్యాయం జరగడం లేదని మనస్థాపం చెందిన చలపతిరావు(35) సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతునికి భార్య స్వాతి, కూతూరు కాత్యాయినితో పాటు కుటుంబీకులు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తతగా మారడంతో సంగారెడ్డి డిఎస్పీ తిరుపతన్న, పట్టణ సిఐ రామకృష్ణారెడ్డిలతో పాటు పోలీసులు చేరుకున్నారు. సంగారెడ్డి ఆర్‌డిఒ శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి మూడు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

తలాక్ తీర్పు పౌర హక్కులకు రక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్: త్రిపుల్ తలాక్‌పై సుప్రీం కోర్టు తీర్పు పౌరుల హక్కులను కాపాడే విధంగా ఉన్నదని, దీనిని అందరూ శిరసావహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సుప్రీం తీర్పును రాష్ట్ర బిజెపి స్వాగతిస్తోందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తలాక్‌పై తీర్పు ఒకరి విజయం, మరొకరి అపజయం కాదని, ఇది ముస్లిం మహిళల ఆత్మగౌరవం, స్వాలంబనకు సంబంధించిందని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవ బాంబుదాడి విషయంలో ఎంపి అసదుద్దీన్ ఒవైసి మాటలు బాధ్యతారాహితంగా ఉన్నాయని, టాస్క్‌ఫోర్స్ కేసులో ఒకలాగ, మాలేగావ్ కేసులో మరోలా మాట్లాడడం అసద్ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. ఇస్లాం దేశాల్లో కూడా ట్రిపుల్ తలాక్ అమలులో లేదని, అసదుద్దీన్ ఒవైసి మాత్రం తలాక్‌కు మద్దతు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ట్రిపుల్ తలాక్ తీర్పుతో బాధిత మహిళలకు పెద్ద ఊరట లభించిదన్నా రు. ఇప్పటికైనా సంస్థలు, పార్టీలు పేద ముస్లిం మహిళలకు అండగా ఉండాలని అన్నారు. త్రిబుల్ తలాక్ తీర్పును ప్రచారం చేయాలని సూచించారు. త్రిపుల్ తలాక్‌పై అనే సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నారన్నారు. మోడి ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడినందుకు లక్ష్మణ్ ధన్యవాదలు తెలిపారు.

జనాభా ప్రాతిపదికన
నిధుల కేటాయింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : బిసి జాబితాలోని 112 కులాలకు వారి వారి జనాభా ప్రాతిపదికన స్థలాలు, నిధులు కేటాయించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిసి కార్పొరేషన్‌కు, 11 బిసి కులాల ఫెడరేషన్లకు గతంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిధులు విడుదల చేయాలని సచివాలయంలో మంగళవారం ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి కోరారు. అనంతరం సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, కార్యదర్శి రమేశ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. బ్రాహ్మణ, రెడ్డి కులాలకు స్థలం, నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా బిసిల్లో కులాలకు జనాభా ప్రాతిపదికన ఒక ఎకరం నుండి 20 ఎకరాల వరకు, రూ.5 కోట్ల నుండి రూ.20 కోట్ల వరకు నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. బిసి కార్పొరేషన్‌కు గత ప్రభుత్వ హయంలో కేటాయించిన రూ.400 కోట్లు, మూడేళ్లలో ప్రభుత్వం కేటాయించిన రూ.1200 కోట్లను విడుదల చేయాలన్నారు.15 రోజుల్లో 11 ఫెడరేషన్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పి 3 నెలలు గడుస్తున్న విడుదల చేయలేదన్నారు. ఆర్థిక మంత్రి హామి 8 రోజుల్లో నిధులను విడుదల చేస్తామని హామి ఇచ్చారన్నారు. హామి మేరకు నిధులు విడుదల కాకపోతే బిసిలు ఉద్యమిస్తారని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ నూతన విధానంపై
దక్షిణాది రాష్ట్రాల ఏకాభిప్రాయం



మన తెలంగాణ/: దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ ఇచ్చిపుచ్చుకునేందుకు సరికొత్త విధానం అనుసరించే విషయంలో భాగస్వామ్య రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. దక్షిణ భారత దేశంలో ఏ రాష్ట్రానికి విద్యుత్ అవసరం ఉన్నా, వెంటనే పక్క రాష్ట్రాల నుంచి పొందేలా కొత్త విధానానికి రూపకల్పన చేశారు. ఈ విధానం అమల్లోకి వస్తే పవర్ ఎక్స్చేంజి జోక్యం లేకుండా, ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా ఇరుగు, పొరుగు రాష్ట్రాలు విద్యుత్ ఇచ్చిపుచ్చుకునే వెసులుబాటు కలుగుతుంది. త్వరలోనే దీనికి సంబంధించిన విద్యుత్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకోనున్నారు. దక్షిణ భారతదేశ రాష్ట్రాల విద్యుత్ కమిటీ (ఎస్‌ఆర్‌పిసి) అధ్యక్షులు, తెలంగాణ ట్రాన్స్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు అధ్యక్షతన కేరళ రాజధాని తిరువనంతపురంలో కమిటీ సమావేశం సోమ, మంగళవారాల్లో జరిగింది. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో దక్షిణ రాష్ట్రాల మధ్య సరళమైన విద్యుత్ విధానానికి సంబంధించి ప్రాథమిక చర్చలు జరిగాయి. ఈ సమావేశంలోనే సభ్య కార్యదర్శి ఎస్‌ఆర్ భట్ నేతృత్వంలోని కమిటీని నియమించారు. కొత్త విధానానికి సంబంధించిన ముసాయిదాను తయారు చేసి తిరువనంతపురం సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనిపై రెండు రోజుల చర్చ జరిగింది. ఈ సమావేశంలో కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు సిఎండి డాక్టర్ కె. ఎలంగోవన్, కర్ణాటక ట్రాన్స్‌కో ఎండి జావేద్ అక్తర్, ఎపి ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్, తమిళనాడు ట్రాన్స్‌కో ఎండి ఎస్.షణ్ముగం,టిఎస్ ఎన్‌పిడిసిఎల్ సిఎండి గోపాలరావు, డైరెక్టర్లు నర్సింగరావు, జగత్‌రెడ్డి, జెన్‌కో డైరెక్టర్ సచ్చిదానందం పాల్గొన్నారు.

ముసాయిదా వివరాలు

దక్షిణ భారతదేశ పరిధిలో పొరుగు రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ లోటుపాట్లు ఉన్నా, మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రం నుంచి పొందాలని ముసాయిదా రూపొందించారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా విషయాల్లో పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుంది. పవర్ ఎక్స్చేంజీల ద్వారా ఒక రోజు ముందుగానే కొనుగోళ్లు జరపాల్సి ఉంటుంది.

కానీ ఈ పరిస్థితిని నివారించడానికి ఒక గంటలోనే కొనుగోళ్లు పూర్తవుతాయి. క్రయ, విక్రయాలకు సంబంధించి, ప్రతిసారి ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరం లేకుం డా, ఒకే మారు ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించారు. సదరన్ లోడ్ డిస్పాచ్ సెంటర్ మధ్యవర్తిత్వంతో పారదర్శకంగా కొనుగోళ్లు జరుపుతూ అవసరాలు తీర్చుకునే అంశంపై ఏకాభిప్రాయం కుదిరింది. ఈ విధానం అమలు కోసం విధివిధానాలు రూపొందించి, ఒప్పందం చేసుకుంటారు.

ఈసారి పెరగనున్న పత్తి దిగుబడి!



మన తెలంగాణ/హైదరాబాద్ : ఈసారి పత్తి దిగుబడి పెరిగే అంచనాలు ఉన్నందున వాటి కొనుగోలుకు సంబంధించినకేంద్రాలు, మార్కెటింగ్ యంత్రాంగం, సిద్ధంగా ఉండాలని మార్కెటింగ్ శాఖ మంత్రి టి.హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న పత్తి సాగు నేపథ్యంలో వానకాలంలో రానున్న దిగుబడి సేకరణ పై తీసుకోవలసిన చర్యలతో పాటు మార్కెటింగ్ శాఖ పనితీరును హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో మంగళ వారం మంత్రి సమీక్షించారు. కోహెడ, పటాన్‌చెరు లలో తలపెట్టిన మార్కెట్ లను అత్యంత ఆధునికంగా జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని మార్కెటింగ్ మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు.గడ్డి అన్నారం మార్కెట్ ను కోహెడ కు,మలక్‌పేట్ మార్కెట్ ను పటన్‌చెరు కు తరలిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రెండు మార్కెట్ ల నిర్మాణంపై సమగ్ర నివేదికను 15 రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగులో ఉన్న నిమ్మ, దొండ, బత్తాయి మార్కెట్ ల నిర్మాణాన్ని 45 రోజులలో పూర్తి చేయాలన్నారు. ఈ డెడ్ లైను లోపు పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రంలో 44 వ్యవసాయ మార్కెట్ లలో ఇనామ్ విజయవంతంగా అమలవుతున్నదని అయితే సాఫ్ట్ వేర్ సమస్యలు తరుచూ తలెత్తుతున్నందున ఆయా సమస్యలను వెంటనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. నాబార్డు నిధులు సమీకరించి 9 కోల్ స్టోరేజ్ ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ మార్కెట్ లలో దడవాయిల లైసెన్సు బదిలీలో ఉన్న నిబంధనలలో కొన్ని సడలింపు లను ఇస్తూ పెండింగులో ఉన్న లైసెన్సు బదిలీ దరఖాస్తులను 15 రోజుల్లో క్లియర్ చేయాలని మంత్రి ఆదేశించారు. మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయితో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా సకల జనుల సమ్మె కాలం

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఆర్‌టిసి కార్మికుల సకల జనుల సమ్మె కాలాన్ని స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా పరిగణించాలని టిఎస్‌ఆర్‌టిసి ఎన్‌ఎంయు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సకల జనుల సమ్మెలో పాల్గొన్న ఎన్‌జిఓలు, సింగరేణి కార్మికులకు సమ్మె కాలాన్ని స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా మంజూరు చేసిన ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులకు మంజూరు చేయకపోవడం భాధాకరమని ఎన్‌ఎంయు పేర్కొంది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్‌టిసి కార్మికుల పట్ల ప్రభుత్వం ఎందుకు వివక్షత చూపుతుందని ఎన్‌ఎంయు ఛైర్మన్ ఎం.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మౌలానా, అదనపు ప్రధాన కార్యదర్శి కె.రఘురామ్ ప్రశ్నించారు.

సర్కార్ దవాఖానాకు రోగుల క్యూ

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలే కారణం
- సిరిసిల్ల సభలో మంత్రులు కెటిఆర్, లక్ష్మారెడ్డి



మన తెలంగాణ / సిరిసిల్ల : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాల వల్ల రోగులు ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్నందున ప్రైవేట్ ఆసుపత్రులు మూతపడుతున్నాయని, ఈ విషయాన్ని స్వయంగా ప్రైవేట్ ప్రాక్టీస్ చేసే వైద్యులే ప్రకటిస్తున్నారని ఐటి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు వెల్లడించారు. మంగళవారం సిరిసిల్లలో ఆయన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. లక్ష్మారెడ్డితో కలిసి జిల్లా వైద్యశాలలో ఐసియు, బ్లడ్‌బ్యాంక్, లేబర్‌రూం, డయాలసిస్ సెంటర్ లను ప్రారంభించి, నర్సింగ్ కళాశాల, మాతా శిశు సంరక్షణ కేంద్రాల నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం నిర్వహించిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. గత మూడేళ్లలో గత 70 సంవత్సరాలలో జరగనంత అభివృద్ధిని వైద్య రంగంలో చేపట్టామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ఒకే రోజు 40 ఐసియు సెంటర్లను ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. జిల్లాలోని 5 లక్షల మంది ప్రజలకు డిజిటల్ హెల్త్ కార్డులను తయారు చేయించే ప్రక్రియలను మొదలు పెట్టించాలని ఆరోగ్యమంత్రిని కోరారు. అదే విధంగా నిర్మాణమై ఉన్న పిహెచ్‌సిలలోకి సిబ్బందిని కేటాయించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు విశ్వాసం పెరగాలంటే వైద్యులు విధులు నిర్వహించాలని, వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉన్నదీ, లేనిదీ గమనించేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసి కలెక్టరేట్ నుండి వాటిని అనుసంధానం చేయాలన్నారు. అప్పుడే పేదలందరూ ఆసుపత్రులకు క్యూ కడతారన్నారు. సిరిసిల్లలో రెఫరింగ్ కేసులు తగ్గాలని అందుకోసం సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు అవసరమన్నారు. సిరిసిల్లలో డిప్లమో, పిజి సెంటర్‌ను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. సమావేశంలో ఆరోగ్య శాఖ మంత్రి సి లక్ష్మారెడ్డి, టెస్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎంఎస్‌ఐడిసి ఛైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సామల పావని, సెస్ ఛైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, కలెక్టర్ కృష్ణ భాస్కర్, డిఎంహెచ్‌వో డా. రమేశ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఆర్ తిరుపతి పాల్గొన్నారు.

గంగపుత్రుల ఆర్థిక అభివృద్ధికి కృషి



మన తెలంగాణ/హైదరాబాద్ : గంగపుత్రుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానని ఎంబిసి ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. గంగపుత్రుల కోసం సిఎం కెసిఆర్ ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని, వారు ఆర్థికంగా బల పడేందుకు కోట్లాది చేపపిల్లలను చెరువులో వదులుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర (బెస్త) గంగపుత్ర సంఘం కమిటీ ప్రతినిధులు సంక్షేమ భవన్‌లో మంగళ వారం తాడూరి శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రాన్ని అంద జేశారు. చేపలను తాము పట్టిన తర్వాతనే ఇతరులకు అవకాశం కల్పిం చాలని, చెరువులపై తమకు ప్రత్యేక హక్కును కల్పించాలని, తమ కులాన్ని బిసి నుంచి ఎస్‌టి జాబితాలో చేర్చాలని, మహిళా మత్స్యకారులకు ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టాలని వారు కోరారు. సిఎం కెసిఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు దక్కినందుకు, ఎంబిసి ఛైర్మన్‌గా తాడూరి శ్రీనివాస్‌ను నియమించినందుకు గాను త్వరలోనే రవీంద్రభారతిలో అభినందన సభ నిర్వహించనున్నట్లు సంఘం ముఖ్యఅధ్యక్షులు ఆర్.కె.ప్రసాద్, యువజన అధ్యక్షులు గడ్డం సాయికిరణ్ తెలిపారు.

దేశంలోనే ‘ఉత్తమ’ ఇంటర్ బోర్డు!

- ప్రపంచ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో బోర్డుకు అవార్డు
- ఉపముఖ్యమంత్రి కడియం



మన తెలంగాణ/హైదరాబాద్ : ఇంటర్మీడియట్ బోర్డును దేశంలోనే ఉత్తమ బోర్డుగా తయారు చేస్తామని ఉపముఖ్య మంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ఇప్పటికే దేశంలో ఉత్తమ డిజిటలైజ్డ్ బోర్డుగా ప్రపంచ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో తెలంగాణ ఇంటర్ బోర్డుకు అవార్డు లభించిందన్నారు. ఇందుకు కృషి చేసిన ఇంటర్ బోర్డు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. మంగళవారం ఇంటర్మీడియట్ బోర్డు 2వ సమావేశంలో ఆయన పాల్గొని బోర్డు ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇంటర్ బోర్డు సభ్య సమావేశం ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరగాల్సి ఉండగా రాష్ట్ర విభజన, బోర్డు పదో షెడ్యూల్‌లో ఉన్నందున నిర్ణీత సమయంలో సమావేశం నిర్వహించలేకపోయామన్నారు. ఇక నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి బోర్డు సమావేశాలు జరుగుతాయన్నారు. అదే విధంగా బోర్డు సభ్యులను కూడా ప్రస్తుత అవసరాల మేరకు మారుస్తామన్నారు. వృత్తి విద్యా కోర్సులను మరింత పటిష్టం చేస్తామన్నారు. ఇందుకోసం జెఎన్‌టియు, వైద్య, ఆరోగ్య శాఖ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే రెండు నెలల్లో ఈ కమిటీ తన నివేదికను ఇవ్వాలని, దానికి అనుగుణంగా కోర్సులు రూపొందించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకొస్తామ న్నారు. అదే సమయంలో ఆదరణ లేని వృత్తి విద్యా కోర్సులను తొలగిస్తామ న్నారు. బోర్డు పరిధిలో 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయని, వీటన్నింటిలో ఉన్న వసతులు, అధ్యాపకులు, సిబ్బంది వివరాలతో ఒక్కో కాలేజీకి ఒక్కో ప్రొఫైల్ తయారు చేయిస్తామన్నారు. వాటిని ఇంటర్‌నెట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రైవేటు కాలేజీల అనుమతుల్లో బోర్డు కఠినంగా ఉంటుందన్నారు. 22 రకాల సేవలను ఆన్‌లైన్ చేశామని, త్వరలో మరిన్ని సేవలను ఆన్‌లైన్ చేస్తామన్నారు. విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్య డైరెక్టర్ కిషన్, విసిలు, పాల్గొన్నారు.

సెప్టెంబర్ 29 వరకు అఫిలియేషన్

తగిన పత్రాలను సమర్పించడంలో ఆలస్యం కారణంగా అఫిలియేషన్ మంజూరు కాని కళాశాలలు తగిన పత్రాలను సెప్టెంబర్ 21వ తేదీ వరకు సమర్పించేందుకు అనుమతిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

గురుకుల మెయిన్ పిడి పరీక్ష రద్దు

మన తెలంగాణ/హైదరాబాద్ : గురుకుల మెయిన్ పిడి పరీక్షను టిఎస్‌పిఎస్‌సి రద్దు చేసింది. పరీక్షను తిరిగి సెప్టెంబర్ 7న పరీక్ష నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మరిన్ని వివరాలను టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్షను జులై 18న నిర్వహించారు. ప్రశ్నాపత్రంలో ఒక పేజీ లేకుండానే పరీక్ష పూర్తి చేసిన కమిషన్ ఎట్టకేలకు తేరుకుంది. దీనితో మరోసారి టిఎస్‌పిఎస్‌సి డొల్లతనం బయటపడింది. ఫలితాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థు లకు కమిషన్ నిర్ణయం ఒక్కసారిగా ఆందోళనకు గురి చేసింది. ఒక సిరీస్ ప్రశ్నాపత్రంలో ఒక పేజీ లేకుండా పరీక్షలు జరిపినట్లు గుర్తిం చింది. పరీక్ష రాసి రిలాక్స్‌గా ఉన్న అభ్యర్థులు మళ్లీ పుస్తకాలు పట్టాలని లబోదిబోమంటున్నారు. గురుకులాల నోటిఫికేషన్ వెలువడిన నాట నుండి నిరుద్యోగులతో టిఎస్‌పిఎస్‌సి అనేక రకాలుగా చెలగాటమాడిందని నిరుద్యోగ జెఎసి మండపడింది.అయితే వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ఎఇఇ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో పెట్టినట్లు టిఎస్‌పిఎస్‌సి ఒక ప్రకటనలో తెలిపింది. రాత పరీక్షలను ఆగస్టు 27న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కార్యదర్శి ఎ.వాణి ప్రసాద్ తెలిపారు.

ఉపరాష్ట్రపతి వెంకయ్య ఢిల్లీ పయనం

మన తెలంగాణ/హైదరాబాద్: ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తన ఒక రోజు పర్యటనను ముగించుకుని మంగళవారం బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయల్దేరారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడుకు గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్, శాసనమండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్, ఉప ముఖ్యమంత్రులు మహ్మద్ మహమూద్ అలీ, కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, నాయినినర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, డిజిపి అనురాగ్‌శర్మ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేందర్ రెడ్డితో పాటు అధికారులు వీడ్కోలు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన పౌరసన్మాన కార్యక్రమ నిమిత్తం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్న విషయం తెలిసిందే.

మెదడు కణితుల చికిత్సకు సమగ్ర సంరక్షణ కేంద్రం



మన తెలంగాణ/హైదరాబాద్ : క్యాన్సర్ సహిత, క్యాన్సర్ రహిత మెదడు కణితులకు చికిత్స అందించేందుకు అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ సమగ్ర సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించింది. నగరంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, కన్సల్టెంట్ రేడియేషన్ అంకాలజీ డాక్టర్ ఎం.బాబయ్య, సర్జికల్ అంకాలజీ (హెడ్ అండ్ నెక్) అధిపతి డాక్టర్ శశికాంత్ జొన్నలగడ్డ, నైఫ్ సర్జరీ, మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీలో శిక్షణ పొందిన డాక్టర్ ఎ.అజయ్ రెడ్డిలు మాట్లాడారు. ఈ కేంద్రంలో తల, మెడ నిపుణుడు న్యూరో సర్జన్లతో కూడిన వైద్య బృందం కణితులకు చికిత్స చేస్తారన్నారు. దేశంలో ప్రతి ఏటా 11 లక్షల కొత్త కేసులు నమోదు అవుతుండగా, అందులో 70 శాతం వరకు వ్యాధి ముదిరాక నమోదు కావడం వల్ల చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

పోస్టల్ సమ్మెతో ఇబ్బందులు

మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగ సంఘానికి చెందిన ఒక వర్గం నిరవధిక సమ్మెలో పాల్గొనడంతో ప్రజలకు, వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా తపాల శాఖ తగు చర్యలు మొదలు పెట్టింది. బ్రాంచ్ పోస్టుమాస్టర్లు ఎక్కువ మంది పని చేయకపోవడం వల్ల ఎక్కువ సంఖ్యలో ఉత్తరాలు వచ్చే వినియోగదారులు సంబంధిత ఉప తపాలా కార్యాలయాల ద్వారా ఉత్తరాల బట్వాడా తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడమైంది. రిజిస్టర్ లెటర్స్, స్పీడ్ పోస్ట్, పార్శిలు సంబంధిత సేవల కోసం ఉప తపాలా కార్యాలయంలో వినియోగదారులు ఏదైనా గుర్తింపు కార్డు చూపించి బట్వాడా పొందవచ్చుని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సీనియర్ సూరింటెండెంట్ చంద్రశేఖర్ ఆచార్ పేర్కొన్నారు. సంబంధిత ఉప తపాలా కార్యాలయం నుంచి ఈఎంఒ (మనీ ఆర్డర్లు) చెల్లింపుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు వినియోగదారులు తమ దగ్గరలోని సబ్ పోస్టు మాస్టర్ /పోస్టు మాస్టర్/సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసును సంప్రదించాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే 040 23463526, 04023463522, 04023463528 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రతి జిల్లాకు రూ.75 లక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్: జిల్లా కలెక్టర్లకు క్రూషియల్ బ్యాలెన్సింగ్ ఫండ్ (సిబిఎఫ్) నుంచి రూ.23.75 కోట్లు విడుదల చేస్తూ ప్రణాళిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి జిల్లాకు రూ.75 లక్షల చొప్పున రెండో త్రైమాసిక బడ్జెట్ కింద ఈ మొత్తాన్ని మంజూరు చేశారు. ఈ నిధులను జిల్లా కలెక్టర్లు అసంపూర్తిగా ఆగిన అభివృద్ధి పనులకు వినియోగించనున్నారు.

పది రోజుల పాటు జానపద జాతర

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పది రోజుల పాటు జానపద జాతర నిర్వహించనున్నారు. 2015 సంవత్సరంలో మొదలైన జానపద జాతర గత రెండు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం పది రోజుల పాటు జరుగుతన్నాయి. ఈ క్రమంలో జానపద జాతర 2017ను కూడా పది రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. మంగళవారం నిజామాబాద్, జోగులాంబ, గద్వాల్, వరంగల్ రూరల్, ఆదిలాబాద్ జిల్లాల్లో జాతర ప్రారంభ వేడుకలు జరిగాయి. ఆగస్టు 23న నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, రాజన్న సిరిసిల్ల, 24న జనగాం, కరీంనగర్, మహబూబాబాద్, 25న జగిత్యాల, వరంగల్ అర్బన్, మెదక్, యాదాద్రి భువనగిరి, 26న ఖమ్మం, జయశంకర్ భూపాల్‌పల్లి, మంచిర్యాల, 27న సూర్యాపేట, వనపర్తి, పెద్దపల్లి, 28న మహబూబ్‌నగర్, కామారెడ్డి, సంగారెడ్డి, 29న సిద్ధిపేట, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నాగర్ కర్నూల్ జాతర వేడుకలు జరుగుతాయి. ముగింపు వేడుకలు ఆగస్టు 31న రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, హైదరాబాద్, రవీంద్ర భారతిలలో జరుగనున్నాయి.

31 శాతం మందికి ఎంఆర్ వ్యాక్సిన్

మన తెలంగాణ/హైదరాబాద్ : గత నాలుగు రోజుల్లో 31 శాతం మందికి ఎంఆర్ (మీజిల్స్, రూబెల్లా) వ్యాక్సిన్‌ను వేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. సెప్టెంబర్ 25వ తేదీ వరకు వేయ తలపెట్టిన వాక్సినేషన్ కార్యక్రమంలో రాష్ట్రంలో 90,01,117 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత 4 రోజుల్లో 27,71,731 మందికి వేశారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే నాలుగు రోజుల్లో 63 శాతం మందికి వ్యాక్సినేషన్ వేసి మహబూబాబాద్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా, 52 శాతంతో ద్వితీయ స్థానంలో రాజన్న సిరిసిల్ల, 48 శాతం చొప్పున వేసిన భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాలు మూడవ స్థానంలో ఉన్నాయి. కేవలం 14 శాతం మందికి వ్యాక్సినేషన్ చేసి మేడ్చల్ జిల్లా చివరి స్థానంలో ఉండగా, దాని కన్నా కొంత మెరుగ్గా 19 శాతం వ్యాక్సినేషన్‌తో హైదరాబాద్, 20 శాతంతో మహబూబ్‌నగర్ జిల్లాలున్నాయి.

వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : భద్రతకు సంబంధించి ఎదురౌతున్న ఇబ్బందుల విషయంలో అధికారులు క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను అవగతం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అన్నారు. వివిధ విభాగాధిపతులతో మంగళవారం ఆయన ప్రత్యేక భద్రత సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, అన్ని స్థాయిల్లో పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు. నిరంతర భద్రత పర్యవేక్షణకు ఉపయోగపడేలా భద్రతపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో భద్రతకు అవసరమైన సమన్వయం, అమలు పరిచే వ్యవస్థ తదితర విషయాలను చర్చించారు.

అంతుచిక్కని పక్కా లెక్కలు

- రైతు సర్వేకు, రెవెన్యూ రికార్డులకు కుదరని పొంతన
- భూ సర్వే తర్వాతే రైతు సర్వేపై స్పష్టత
- నేడు అధికారులతో సిఎం సమీక్ష



మన తెలంగాణ/హైదరాబాద్

వచ్చే ఏడాది వానకాలం నుంచి అమలు చేయనున్న ఎకరాకు రూ. 4 వేల పెట్టుబడి పథకంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇందుకు రాష్ట్రం లోని భూములు, ఏ రైతు పేరు మీద ఎంత భూమి వంటి వివరాలను ఎటువంటి సమస్యలు లేకుండా పక్కాగా చేసే ప్రయత్నం చేస్తోంది. దీనికోసం ఇప్పటికే వ్యవసాయ శాఖ సమగ్ర రైతు సర్వే చేపట్టి దాదాపు పూర్తి చేసింది. ఇప్పుడు సమగ్ర భూసర్వే కూడా చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని భూములు, రైతుల వివరాలపై ఒక స్పష్టతకు వచ్చేందుకు చేయాల్సిన కార్యాచరణపై సిఎం కె. చంద్రశేఖర్‌రావు వ్యవసాయ, రెవిన్యూ అధికారులతో బుధవారం భేటీ కానున్నట్లు తెలిసింది. రైతు సమగ్ర సర్వేలో సిఎం కెసిఆర్ సూచించిన నమూనా ప్రకారం దాదాపు రెండు నెలలు ఎఇఒలు రైతులు, భూముల వివరాలు సేకరించారు. అయితే ఈ సర్వేలో కేవలం రైతు చెప్పిన, చూపిన పత్రాల ఆధారంగానే వివరాలు నమోదు చేశారు. అయితే రైతులు చూపిన పత్రాల్లో కొనుగోలు, అమ్మకాలు చేసిన భూముల వివరాలు ఆధునీకరించినవి లేవు. కొన్ని కోర్టు కేసుల్లో ఉండగా, మరికొన్నింటికి సేల్ డీడ్ కూడా రాసుకోలేదు. అలాగే కొంత మంది ఎఇఒలు 1బి లేదా పట్టా పాసు పుస్తకాలేమీ చూడకుండానే వివరాలు నమోదు చేశారు. దీంతో భూములు కొనుగోలు చేసిన వారు తమ వద్ద ఉన్న సమాచారంతో, వాటిని అమ్మిన వారు తమ వద్ద పత్రాల ఆధారంగా సర్వేలో నమోదు చేసుకోవడం వల్ల ఒకే భూమికి రెండేసి దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో భూములు విక్రయించిన, కొనుగోలు చేసిన వారి వివరాలను రెండు, మూడు సార్లు నమోదైనట్లు తెలిసింది. వీటిని సరి చూసుకునే వ్యవస్థ వ్యవసాయశాఖ వద్ద లేకపోవడం వల్ల సమగ్ర రైతు సర్వేపై అస్పష్టత నెలకొంది. ప్రతి జిల్లాకు ఒక పర్యవేక్షణ అధికారిని నియమించినా పక్కా లెక్కలుగా చూపేందుకు సర్వేలో శాస్త్రీయత లోపించింది. ఇప్పటివరకు వ్యవసాయ శాఖ ప్రణాళిక ప్రకారం రాష్ట్రంలో రైతుల వద్ద ఉన్న భూమి 1.54 కోట్ల ఎకరాలుగా ఉంది. తాజాగా రైతు సమగ్ర సర్వేలో తేలిన లెక్కల ప్రకారం ఇది 1.23 కోట్ల ఎకరాలు మాత్రమే. అలాగే 1బి ప్రకారం రాష్ట్రంలో రైతుల సంఖ్య 54.71 లక్షలుకాగా.. సర్వేలో ప్రకారం ఆ సంఖ్య 44.98 లక్షలు మాత్రమే నమోదయ్యారు. ఒకవేళ ఒకే భూమికి రెండేసి దరఖాస్తులు వచ్చినా రెవిన్యూ రికార్డులను మించి భూమి, రైతుల సంఖ్య పెరగాల్సి ఉంది. కాని ఇక్కడ అలా జరగలేదు. దీంతో ఈ సర్వే వివరాల ఆధారంగా పెట్టుబడి సొమ్ము జమ చేస్తే పథకం స్ఫూర్తి దెబ్బతినడంతో పాటు భూమి కలిగిన అసలైన రైతులకు నష్టం కలుగుతుందని సిఎం భావిస్తున్నారు. ఇందుకు రెవిన్యూ శాఖ ద్వారా భూరికార్డుల ప్రక్షాళన చేపట్టాలని, అస్పష్టత ఉన్న అన్ని భూములు, వివాదాలకు చెక్ పెట్టాలనియోచిస్తున్నారు. ఇందుకోసం రెవిన్యూ రికార్డులు సరిదిద్దాలని నిర్ణయించారు. ఆ తరువాత వ్యవసాయ శాఖ చేపట్టిన సమగ్ర రైతు సర్వేలోని వివరాలను సరి చేయనున్నట్లు తెలిసింది. అవసరమైతే రిజిస్ట్రేషన్ శాఖను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలనుకుంటోంది. తద్వారా వచ్చే ఏడాది వానకాలం నుంచి ఇవ్వనున్నట వ్యవసాయ పెట్టుబడి పక్కదారి పట్టదని సిఎం భావిస్తున్నట్లు తెలిసింది.

శాటిలైట్ ఇమాజినరీకే మొగ్గు

శాటిలైట్ ఇమాజినరీ విధానంతో భూముల సమగ్ర సర్వే చేయాలనే ఏకాభిప్రాయానికి ప్రభుత్వం నియమించిన కమిటీ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.రఘునందన్ రావు అధ్యక్షతన సిఎం కెసిఆర్ కమిటీ నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీ వారం రోజులుగా సమగ్ర భూ సర్వేపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించింది. ఈ నివేదికను బుధవారం సిఎం కెసిఆర్‌కు అందచేయనున్నది. ఒడిషా రాష్ట్రంలో ఇమాజినరీ విధానంతో భూముల సర్వే నిర్వహించారు. స్వల్ప ఖర్చుతో ఈ సర్వే పూర్తవుతుంది. ప్రపంచ బ్యాంకు అంచనాలు, సిఎం ప్రకటించిన ప్రకారం ఇమాజినరీ సర్వే ఏమాత్రం సరిపోదు. ఇస్రో రూపొందించిన శాటిలైట్ చిత్రపటాల ప్రకారం రికార్డులు రూపొందిస్తారు. శాటిలైట్ చిత్రాలు తీసుకోవడానికి ప్రస్తుత వాతావరణం ఏమాత్రం అనుకూలంగా లేనందున ఇంతకు ముందు తీసిన చిత్రాలను వినియోగించుకోవాల్సి ఉంటుంది. అంతే కాకుండా ఒక ఎకరా భూమి విస్తీర్ణంపై తక్కువ లేదా ఎక్కువ కొలతలు చూపించడం మూలంగా గందగోళం తలెత్తే ప్రమాదముందని సర్వే అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇయు నిరాహార దీక్షలు



మన తెలంగాణ /హైదరాబాద్ : టిఎస్‌ఆర్‌టిసిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల ముందు సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించింది. ఇప్పటికైనా యాజమాన్యం నిర్లక్ష్య దోరణి విడనాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనట్లయితే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని దీక్షల్లో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర నాయకులు నాయకులు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ డిపో వద్ద జరిగిన దీక్షల్లో అధ్యక్షులు ఎస్.బాబు, దిల్‌సుక్‌నగర్ డిపో వద్ద జరిగిన దీక్షల్లో ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి పాల్గొన్నారు. ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన వేతన స్కేళ్లను వెంటనే అమలు చేయాలని, ఖాళీ ఉద్యోగాలను రెగ్యులర్ ప్రాతిపాదికన భర్తీ చేసి కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని, ఆర్‌టిసి అనుబంధ విభాగాల మూసివేతను ఆపాలని వారు ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కె.రాజిరెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం టిఎంయు కార్మికుల హక్కులను, ప్రయోజనాలను యాజమాన్యానికి తాకట్టు పెడుతుందని, సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న సకల జనుల సమ్మె కాలానికి వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని, డ్యూటీ చార్టులను అమలు చేయాలని, రూట్ సర్వే చేసి రన్నింగ్ టైమ్ ఇవ్వాలని ఆయన కోరారు. ఎస్.బాబు మాట్లాడుతూ ఆర్‌టిసికి వేల కోట్ల ఆర్థిక సహాయం చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం ఆచరణలో చేస్తున్నదేమీ లేదని విమర్శించారు. కనీసం సకల జనుల సమ్మె కాలాన్ని వేతనంతో కూడిన సెలవుగా పరిగణించడం లేదన్నారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, అద్దె బస్సులను రద్దు చేసి సంస్థ కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, కాలం చెల్లిన పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం కార్మికులకు పని వేళలను అమలు చేయాలని కోరారు.

ఒక్కసారి సమావేశమైతే ఒట్టు

ఐఎఎస్ అధికారిపై తీవ్రమైన ఆరోపణలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఐఎఎస్ అధికారుల సర్వీసు రికార్డుల సమీక్ష కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీ వేసింది. కమిటీ వేసి ఏడాది పూర్తయినా ఇంతవరకు ఒక్కసారి భేటీ కాలేదు. 15 సంవత్సరాలు, పాతిక సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన ఐఎఎస్ అధికారుల పనితీరు, ఆరోపణలపై కమిటీ సమావేశమై సమీక్షించాలి. నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఒక ఐఎఎస్ అధికారిపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై అభియోగాలు నమోదు చేసి విచారణ జరపాలని కోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశం ప్రకారం సాధారణ పరిపాలనా విభాగం (జిఎడి) ఐఎఎస్ అధికారుల సర్వీసు రికార్డుల సమీక్ష కోసం కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు (జిఓఆర్‌టి నెంబర్ 1342, తేదీ 13.06.17) జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా నలుగురిని నియమించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (సీనియర్), ఎపి రాష్ట్రానికి చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న ఎస్‌సి లేదా ఎస్‌టి వర్గానికి చెందిన ముఖ్య కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వ జిఎడి ముఖ్య కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించ బడిన ఐఎఎస్ అధికారుల సర్వీసు రికార్డులను సమీక్షించేందుకు కమిటీ ఇంత వరకు ఒక్కసారి కూడా సమావేశం కాలేదు, కనీసం సమీక్ష కూడా చేయలేదు. గతంలో పనిచేసిన ప్రధాన కార్యదర్శి ఇప్పుడు అప్పుడు అంటూ కాలం వెల్లబుచ్చినట్లు సమాచారం. 15, 25 సంవత్సరాలు పూర్తయిన అధికారుల రికార్డులన్నింటిని పరిశీలించి, అవినీతి ఆరోపణలు, శాఖాపరమైన చర్యలు ఏమైనా ఉన్నాయా అనేది పరిశీలించి నివేదిక రూపొందించాలి. రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి.

ఒక్కరిపై కూడా ఫిర్యాదులు లేవు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఒక్క అఖిల భారత సర్వీసు (ఎఐఎస్) అధికారిపై కూడా ఆధారాలతో ఫిర్యాదు అందలేదు. ఆకాశ రామన్న పేరుతో కొందరు, ఆరోపణలతో మరికొందరు ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఫిర్యాదులను పరిశీలించి చెత్తబుట్టలో పడేస్తున్నారు. ఊరు, పేరు, ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం పరిశీలించి చర్యలకు సిఫారసు చేసే అవకాశం ఉంటుంది.



పత్తి కొనుగోలుకు 130 సిసిఐ కేంద్రాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : పత్తి కొనుగోలు కోసం దాదాపు 130 కొనుగోలు(సిసిఐ) కేంద్రాలు వచ్చే సూచనలు ఉన్నాయని వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారధి అన్నారు. రాష్ట్రంలోనే కాకుండా, దేశం మొత్తంగానే ఈసారి పత్తి విస్తీర్ణం పెరిగిందన్నారు. అలాగే పంటల విస్తీర్ణం ఉత్పత్తి, ఉత్పాదకతలు పెరుగుతున్నాయని, ముందుగానే వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు సమన్వయంతో, తగిన ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. సచివాలయంలో మంగళవారం పార్థసారధి, వ్యవసాయ కమిషనర్ ఎం. జగన్‌మోహన్, జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తగిన సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఖరీఫ్ పంటలు పుంజుకున్నాయని, పత్తి రికార్డు స్థాయిలో సాగవుతోందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, మార్కెటింగ్ శాఖ సంయుక్తంగా పత్తి కనీస మద్దతు ధర స్థిరీకరణకు నిర్వహిస్తున్న ప్రాజెక్టు అంచనాలను, సూచనలు సెప్టెంబర్ నెలాఖరుకల్లా వచ్చే అవకాశం ఉదని తెలిపారు. పత్తి రైతులకు బార్ కోడెడ్ ఐడి కార్డులు అందజేయాలని నిర్ణయించామని చెప్పారు.2016లో పత్తి రైతులకు 25 లక్షల కార్డులు అందజేసినట్లుగానే ఇప్పుడు పెరిగిన పత్తి రైతుల వివరాలు రైతు సమగ్ర సర్వే వివరాల ఆధారంగా నమోదు చేయాలన్నారు. ఈ సమాచారంతో పత్తి కనీస మద్దతు ధర సిసిఐ సెంటర్ల అంచనాకు, ఈనామ్ అమలుకు వీలవుతుందని మార్కెటింగ్ శాఖ సంచాలకురాలు లక్ష్మీ బాయి అన్నారు. జిల్లాలలో ఉన్న జిన్నింగ్ మిల్లులు వాటి లైసెన్స్ వివరాలను మార్కెటింగ్ శాఖకు ఇవ్వమని కోరారు. జగన్ మోహన్ మాట్లాడుతూ రైతు సమగ్ర సర్వే డాటా పొందుపరచడం ఆగస్టు 31 కల్లా పూర్తిచేయాలన్నారు.మండల స్థాయిలో రైతు సమావేశ వేదికలు నిర్మించడానికి సంబంధించిన ప్రతిపాదనలను సెప్టెంబర్ 10వ తేదీ లోపు పంపాలని అధికారులను ఆదేశించారు. శాస్త్రవేత్తల నుంచి అందుతున్న సమాచారం మేరకు గులాబి రంగు పురుగు యాజమాన్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాయిద్య కళాకారులపై వేధింపులను ఆపాలి



మన తెలంగాణ/ హైదరాబాద్: శబ్ద కాలుష్యం పేరుతో బ్యాండ్ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వాయిద్య కళాకారులను పోలీసులు వేధింపులకు గురి చేయడం, అరెస్టులు చేయడం ఆపాలని, ప్రభుత్వమే వారికి రక్షణ కల్పించాలని ఎస్‌వికె ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ అన్నారు. వినోదం కోసం వాయిద్య కళాకారులను ఉపయోగించుకుంటున్నారే తప్ప వారి సమస్యలను పట్టించుకోవడంలేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం సమావేశం మంగళవారం ఎస్‌వికెలో జరిగింది. సమావేశంలో వినయ్‌కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ బ్యాండ్ కళాకారుల దుస్తులు మాత్రమే రాజరికమని, వారి జీవితాలు పేదరికంలో ఉన్నాయని, వారిని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం నుంచి వాయిద్య కళాకారులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. సంఘం జాతీయ నాయకులు ఎల్.వి.చెన్నారావు మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు తెలంగాణ గడ్డ అని గొప్పగా ప్రభుత్వం ప్రకటనలు చేస్తుందని, వాయిద్య కళాకారులు మాత్రం కన్నీటి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్క హైదరాబాద్ నగరంలోనే దాదాపు 8 లక్షల మంది వాయిద్య కళాకారులు వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నారని, ఈ వృత్తి సంవత్సరం 6 నెలలు మాత్రమే ఉంటుందని, ఈ వృత్తిని కాపాడాల్సిన బాధ్యత సర్కారుపై ఉందన్నారు.

ఏపి కార్యాలయాల్లో సినిమా షూటింగ్‌లు!

మన తెలంగాణ/ హైదరాబాద్: అమరావతి కొత్త రాజధాని నగరానికి ఆ రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలను తరలించడంతో ఇప్పటి దాకా తెలంగాణలో ఉన్న ఆ కార్యాలయాలు ఇప్పుడు సినిమా పరిశ్రమకు ఉపకరిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక షూటింగ్‌తో సందడి చేసే చిత్ర పరిశ్రమ తాజాగా ఖాళీ అయిన ఆయా కార్యాలయాల్లో సినిమా షూటింగ్‌లను నిర్వహించుకుంటోంది. లఘు చిత్రాలు మొదలుకొని భారీ తెరపై చిత్రంచే సినిమాలు సైతం చిత్రీకరణ జాబితాలో చేరుతున్నాయి. తాజాగా ఎర్రమంజిల్‌లోని రోడ్లు భవనాలశాఖ ఈఎన్‌సి కార్యాలయంలో గత రెండు రోజులుగా సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ''సప్తగిరి ఎల్ఎల్‌బి'' చిత్రానికి సంబంధించి ఇక్కడ షూటింగ్ జరుగనుందని, ఇందుకు గాను సెట్‌ను రూపుదాలుతున్నామని కార్మికులు మన తెలంగాణకు తెలిపాయి. తెలంగాణ ఆర్ అండ్ బి ఇఎన్‌సి కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ క్వార్టర్‌ను కోర్టు హాలుగా చిత్రీకరించేందుకు కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. గోడలకు రంగులు వెలిసిన చోట కొత్త రంగులు వేస్తూ కార్మికులు మంగళవారం నాడు బిజి బిజీగా కనిపించారు. చిత్ర యూనిట్ అంతా గత రెండు రోజులుగా ఇక్కడే మకాం వేసి షూటింగ్ సిన్నివేశాలకు తగ్గట్లు పరిసరాలను సెట్ చేసుకుంటోంది.



మహబూబాబాద్‌లో ముస్లిం దంపతుల వినూత్న ప్రదర్శన

నేను సైతం

మట్టి ప్రతిమలనే పూజించాలని కోరుతూ 'నేనుసైతం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ సుభాని శరీరంపై మట్టి పూసుకుని, మట్టి విఘ్నేశ్వరుని తల ఆకారం పెట్టుకుని తోపుడు బండిపై కూర్చుని భార్య సలీమా సహాయంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. రసాయనాలతో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలు వాడడం వల్ల నీరు కలుషితం కావడమే కాకుండా వాటిలో ఉండే జలచరాలు చని పోతాయని ఈ సందర్భంగా సుభాని ప్రచారం నిర్వహించారు. మట్టివినాయకుడి విగ్రహాలను పూజించండి అంటూ జిల్లా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

మన తెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి

“ మరిన్ని బరువు, బాధ్యతలు మీకు పెరుగుతున్నాయంటే, మీరు మరింత రాణిస్తున్నారని అర్థం. – డా॥ బి.ఆర్.అంబేద్కర్ ”



సంపాదకీయం

ముస్లిం మహిళలకు చట్టరక్షణ

ముస్లిం పురుషులు విడాకులకోసం ఉపయోగిస్తున్న 'వరుసగా ముమ్మారు తలాఖ్' (ట్రిపుల్ తలాఖ్) చెప్పే ఆచరణ పవిత్ర ఖురాన్ ప్రాథమిక సూత్రాలకు, ఇస్లామిక్ చట్టం షరియత్‌కు వ్యతిరేకం; భారత రాజ్యాంగం అధికరణ 14(సమానత్వ హక్కు)లో పొందుపరిచిన ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నది అని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం 3–2 మెజారిటీతో మంగళవారం నాడు చరిత్రాత్మక తీర్పు చెప్పింది. ఈ తలాఖ్ పద్ధతిని సున్నీ ముస్లింలు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. 1980ల్లో షా బానో కేసు నాటి నుండి వివాదంగా కొనసాగుతున్న ఈ అంశానికి ఇప్పుడు అంతిమంగా తెరబడింది. విడాకులకు గురైన ముస్లిం మహిళలకు భర్త భరణం చెల్లించేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఆ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పగా, అది తమ వ్యక్తిగత చట్టం (పర్సనల్ లా)లో జోక్యంగా ముస్లిం సంస్థలు పెద్ద ఎత్తున నిరసనకు దిగటంతో, వాటి ఒత్తిడికి తలొగ్గిన రాజీవ్ గాంధి ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేస్తూ చట్టం తెచ్చింది. ఉమ్మడి పౌరస్మృతి (అన్ని మతాలకు ఒకే వివాహ, విడాకులు, ఆస్తి, వారసత్వం హక్కులు వగైరా) కోసం ప్రచారం చేస్తున్న బిజెపి, రాజీవ్ ప్రభుత్వ చర్యను ముస్లింలకు లొంగుబాటుగా, బుజ్జగింపుగా ఎదురుదాడి చేసి హిందూ మనోభావాలను ఆకర్షించేందుకు ప్రయత్నించింది. అటు తర్వాత లతీఫి కేసులో విడాకులకు గురైన ముస్లిం మహిళకు పునర్వివాహం చేసుకునేవరకు భరణం ఇవ్వాలన్న తీర్పు వచ్చింది.

మత విశ్వాసాలు, ఆచారాలు బలీయమైనవి. ఏ దురాచారాన్ని తొలగించాలన్నా ఆ చైతన్యం, ఆందోళన సంబంధిత మతం లోపల నుంచి వచ్చినపుడే అది వివాద రహితమవుతుంది. ఉమ్మడి పౌరస్మృతి నినాదంతో హిందూత్వశక్తులు తమ మత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారన్న భయం ముస్లింలు మరింత మితవాదులుగా మారేటట్లు చేసింది. దాదాపు మూడున్నర దశాబ్దాల కాలం గడిచిపోయింది. ముస్లిం మహిళల్లో సైతం విద్య, చైతన్యం పెరిగింది. పితృస్వామిక వ్యవస్థ విధించిన వివక్షలకు వ్యతిరేకంగా, పురుషులతో చట్ట సమానత్వం, హక్కుల కొరకు పోరాటం చేయాలన్న భావన బలపడింది. సంఘటితమవుతున్నారు. పురుషులందరూ విడాకులిస్తున్నారని కాదు, అటువంటి చర్యకు బాధితులవుతున్న మహిళలకు రక్షణ ఏమిటన్నది మానవత్వాన్ని చలింపచేసే అంశం కాగా, ఏ చట్టమైనా, ఆచారమైనా, మరేదైనా రాజ్యాంగం అమలులోకి వచ్చాక ఆర్టికల్ 13కు లోబడి ఉండాలన్న నిర్దేశన న్యాయశాస్త్ర పరిధిలోని అంశం. ఏ మతంలోనైనా సామాజిక మార్పు సామరస్య పూరితంగా ఉండటమన్నది సామాజిక హితానికి సంబంధించిన అంశం.

'సమానత్వం కొరకు ముస్లిం మహిళల తపన' పేరుతో దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించాక, మరో ఐదుగురు బాధిత ముస్లిం మహిళలు నేరుగా కోర్టును ఆశ్రయించారు. ట్రిపుల్ తలాఖ్, బహుభార్యాత్వం, విడాకులిచ్చిన భార్యను తిరిగి వివాహం చేసుకునే పద్ధతి మహిళల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నందున రాజ్యాంగ పరిధిలో న్యాయం కావాలని పిటిషనర్లు కోరారు. కాగా, సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాఖ్ అంశాన్నే విచారణకు చేబట్టింది. ట్రిపుల్ తలాఖ్‌ను 2016 సెప్టెంబర్‌లో గట్టిగా సమర్థించిన అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్, అట్టి తలాఖ్‌ను నిరోధిస్తూ నిఖానామాలో చేరుస్తామని కోర్టుకు చెప్పటం, విచారణ చివరి రోజున, ఒకేసారి మూడు సార్లు తలాఖ్ చెప్పేవారిని సాంఘికంగా బహిష్కరిస్తామని కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయటం ఆ సంస్థ వైఖరిలో వచ్చిన మార్పును సూచిస్తున్నది. కాగా ప్రభుత్వం, పిటిషనర్ల వాదనను సమర్థిస్తూ, కోర్టు గనుక ట్రిపుల్ తలాఖ్‌ను రాజ్యాంగ విరుద్ధంగా కొట్టివేస్తే మహిళల హక్కుల రక్షణకు చట్టం తీసుకువస్తామని కోర్టుకు చెప్పింది. వ్యక్తిగత చట్టాలన్నీ రాజ్యాంగానికి అనుగుణంగా ఉండాలని వాదించింది. ఇప్పుడు బంతి ప్రభుత్వం కోర్టులోకి వచ్చింది. ఆరు మాసాల్లో చట్టాన్ని తేవలసి ఉంది. సంబంధీకులందర్నీ సంప్రదించి ఆమోదయోగ్యమైన బిల్లు రూపొందిస్తుందని ఆశిస్తాం. సుప్రీంకోర్టు తీర్పు ముస్లిం మహిళలకు సిద్ధించిన విజయం. అయితే అంతిమంగా బిల్లు ఏ రూపంలో పార్లమెంటు ఆమోదం పొందుతుందో వేచిచూడాలి!

యుద్ధమొస్తే రెడీయేనా?


చూపు

పాకిస్థాన్‌నుంచి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల చొరబాట్లకు ప్రతిరాత్రి ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. తరచుగా అక్కడ కవ్వింపు కాల్పులు కూడా జరుగుతున్నాయి. గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా అక్కడ చొరబాట్లు, కాల్పుల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గడచిన వేసవిలో కశ్మీర్‌లో ఉగ్రదాడుల సంఖ్య కూడా పెరిగింది. సిక్కిం సెక్టార్‌లోని డోక్లాం వద్ద చైనా సైన్యం తో ఘర్షణ వాతావరణం గత రెండు నెలలుగా సాగుతోంది.

చైనా ప్రభుత్వ అధీనంలోని ప్రచార సాధనాలు భారత్‌పై నిప్పులు చెరుగుతూనే ఉన్నాయి. చైనా–పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సిపిఇసి) ఆ రెండు దేశాల సైనిక పరమైన సఖ్యతను ముందు ముందు మరింతగా పెంచవచ్చు. రెండు వైపుల నుంచి ఘర్షణలు ఎదురయ్యే ప్రమాదం పొంచి వుంది. ఇదే సమయంలో భారతదేశ భద్రతా వాతావరణం దిగజారుతోంది.

చైనా, భారత్ మధ్య గత నెలలో యుద్ధ ప్రకటనలు సాగుతున్న తరుణంలో భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) మన మందు గుండు సామాగ్రి కొరతపై నివేదికను విడుదల చేశారు. ఇతర రకాల సైనిక పరికరాల కొరత కూడా తీవ్రంగానే ఉన్నట్లు ఆ నివేదిక తెలిపింది. అందువల్ల దేశరక్షణ సన్నద్ధత ప్రస్తుతం బాగా కుంటుపడి ఉన్నట్లు అర్థమవుతోంది. సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ వి.కె. సింగ్ దీనిని 'కీలక లోపం'గా పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు.

కొంత కాలంపాటు యుద్ధం జరిగితే మందుగుండు సామాగ్రి కొరత విరుద్ధ ప్రభావం చూపిందని కాగ్ తెలిపింది. 2013 మార్చిలో కాగ్ నివేదిక చెప్పిన ప్రకారం టాంకులు, శతఘ్ని తుపాకులు సహా వివిధ రకాల ఆయుధాల కొరత మనకు తీవ్రంగా ఉంది. యుద్ధం తల ఎత్తితే 10రోజుల పాటు కూడా సరిపోవని కాగ్ తెలిపింది. కాగ్ అలా హెచ్చరించిన తరువాత పరిస్థితిలో కొంత మెరుగుదల చోటు చేసుకొన్నప్పటికీ ఇంకా సైన్యంలో 40 శాతం ఆయుధాలకు కొరత ఉంది. అందువల్ల ఇప్పటికీ 10 రోజులకు మించి పోరాటం చేసే సామర్థ్యం మన సైన్యానికి లేదు.



కార్గిల్‌లో ఎదురైన కష్టం

1999లో కార్గిల్ యుద్ధం 50 రోజులపాటు సాగింది. అప్పట్లో 155 ఎంఎం తుపాకీ గుళ్ల 50,000 రౌండ్లు దక్షిణాఫ్రికా నుంచి దిగుమతి చేసుకున్నాము. అటువంటి సంక్లిష్ట పరిస్థితి భవిష్యత్తులో ఏర్పడకుండా ఉండాలంటే ఆయుధ నిల్వలు పెంచడంపై దృష్టి పెట్టాలి. ఎప్పటికప్పుడు సరఫరాలు సాగేలా జాగ్రత్తగా చూడాలి. సైన్యానికి సంబంధించిన ఇతర అనుబంధ సేవలు కూడా చెప్పుకోదగ్గ విధంగా లేవు. మన నౌకాదళం సముద్రాలలోకి చొచ్చుకు పోయే సమర్థతను అంతగా పెంపొందించుకోలేదు. కానీ చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పిఎల్ఎ) వారి నౌకాదళం హిందూ మహాసముద్రంలోకి దూసుకురావడానికి సిద్ధంగా ఉంది.

అత్యంత వేగంగా అది స్థావరాలను నెలకొల్పుతూ, రేవు సౌకర్యాలను పెంచుకొంటోంది. గత ఐదేళ్లలో మన నౌకాదళంలో ప్రమాదాలు తరచూ చోటు చేసుకున్నాయి. ఐఎన్ఎస్ సింధు రక్షక్, ఐఎన్ఎస్ సింధురత్న జలాంతర్గామి ప్రమాదాలు భారీ ఎత్తున జరిగాయి. ఎప్పుడో మార్చవలసిన జలాంతర్గామి బ్యాటరీలు ఇప్పటికీ వాడుతున్నారు. ఆరు స్కార్పీన్ జలాంతర్గాములను దేశీయంగా ఉత్పత్తి చేసే కార్యక్రమంలో ఇప్పటికే ఐదేళ్ల ఆలస్యం జరిగింది.

వైమానిక దళ బలహీనత తీవ్రం

ఇక మన వైమానిక దళం పోరాట శక్తి 32–33 స్క్వాడ్రన్లకు పడిపోయింది. దశాబ్దం క్రితం ఇది 39 స్క్వాడ్రన్లుగా వుండేది. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కొడానికి 42–45 స్క్వాడ్రన్లు అవసరం. మిగ్ 21, మిగ్ 27 వంటి కాలం చెల్లిన యుద్ధ విమానాలు, పాతపడిపోయిన హెలికాప్టర్లు ఇప్పటికీ సేవలు అందిస్తున్నాయి.

వైమానిక దళ రక్షణ కార్యకలాపాలు నౌక నుండి గురిపెట్టే క్షిపణి వ్యవస్థలు చాలా తక్కువ ఉన్నాయి. దేశీయంగా పరిశోధన, అభివృద్ధి పథకాలు కూడా తగినంతగా లేవు. కాలహరణం, వ్యయ భారం ఈ పథకాలను కుంగదీస్తున్నాయి. ఉగ్రవాదుల దాడిని తిప్పికొట్టడానికి వైమానిక స్థావరాలను పటిష్ట పరిచే పని ఇంకా పూర్తి కాలేదు. పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై గత ఏడాది జనవరిలో జరిగిన దాడి తర్వాత ఇప్పటికీ ఆ పని పూర్తి కాకపోవడం శోచనీయం.

సైన్యంలో కూడా అదే పరిస్థితి

సైన్యంలో శతఘ్నుల ఆధునీకరణ కార్యక్రమం స్తంభించింది. తక్షణమే 155 ఎంఎం /52 కాలిబర్ తుపాకులు 3000 దాకా అవసరం. పాతబడిన హోవిట్జర్ల స్థానే ఆ తుపాకులను సైన్యానికి అందించాలి. ప్రస్తుతం ఎం 777 155 ఎంఎం / 45– కాలిబర్ హోవిట్జర్లను అమెరికా నుంచి 145 దాకా కొనడానికి ఒప్పందం కుదిరింది. మరో 114 తుపాకులను (155 ఎంఎం /45– కాలిబర్ ధనుష్ హోవిట్జర్లు) దేశీయంగా ఉత్పత్తి చేసే ప్రతిపాదన ఉంది. వాటిని బోఫోర్స్ తుపాకుల డిజైన్ ఆధారంగా రూపొందిస్తారు.

వైమానిక రక్షణ, సైనిక వైమానిక కేంద్రాలకు కూడా పాతపడిపోయిన పరికరాలు ఉన్నాయి. వాటి పోరాట సామర్థ్యం చాలా వరకు పడిపోయింది. ఆధునిక యుద్ధాలను రాత్రిపూటే సాగించడం ఆనవాయితీ. అయితే మన సైన్యం ఆయుధ వాహనాలు రాత్రి పూట యుద్ధానికి పనికి రాకుండా ఉన్నాయి.

రష్యా నుంచి అందిన టి–90 ఎస్ టాంకులు 650 మాత్రమే రాత్రిపూట పోరాట సామర్థ్యం కలిగి ఉన్నాయి. ప్రస్తుతం ఎన్‌డిఎ ప్రభుత్వం ఆమోదించిన రూ. 1,50,000 కోట్ల ఆయుధ సేకరణ పథకం పూర్తికి 5 ఏళ్లు పడుతుంది. సరిహద్దు ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో మనం పోరాట సామర్థ్యాన్ని పెంచుకోవలసిన తక్షణ అవసరం ఎంతైనా ఉందని రక్షణ నిపుణులు సూచిస్తున్నారు.

*** గుర్‌మీత్ కాన్వాల్**

గుజరాత్‌లో మరో ఉనా

చనిపోయిన ఆవు చర్మం ఒలిచినందుకు గుజరాత్‌లోని ఉనాలో నలుగురు హరిజన యువకులను దారుణంగా కొట్టిన ఉదంతాన్ని గుర్తుకు తెచ్చే తాజా ఘటన మరొకటి ఆ రాష్ట్రంలోనే మరో గ్రామంలో జరిగింది. ఆనంద్ జిల్లాలోని సోజిత్ర తాలూకా కాసోర్ గ్రామంలో ఒక దళిత యువకుని, అతని తల్లిని అగ్రకులాలకు చెందిన 100 మంది బృందం ఈ నెల 12న తీవ్రంగా కొట్టింది. శైలేష్ భాయ్ మణి భాయ్ రోహిత్ అనే యువకుడిని, అతని తల్లి మణి బెన్ రోహిత్ ను వారి ఇంట్లోనే దాడిచేసి కొట్టారు. చనిపోయిన ఒక ఆవు చర్మం ఒలిచిన నేరానికి వారిపై దర్బార్ క్షత్రియ కులం వారు ఈ దాడి జరిపారు. అదే రోజు రాత్రి ఆ ఘటనకు సంబంధించి ఏడుగురు నిందితులపై భారతీయ శిక్షాస్మృతి, ఎస్‌సి/ఎస్‌టిలపై అత్యాచారాల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ దాఖలయింది. ఆ తర్వాత మరి 12మందిని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు చేర్చారు.

అంతకు ముందురోజు (ఈ నెల 11న) శైలేష్‌ను ఆ గ్రామానికి చెందిన అగ్ర కులస్థుడు గౌతాభాయ్ భగత్ పిలిపించి తమ ఆవు చనిపోయిందని, దానిని అక్కడి నుంచి తీసుకుపోవాలని పురమాయించినట్లు తెలుస్తోంది.

'చనిపోయిన పశు కళేబరాలను తొలగించడం, వాటి చర్మం ఒలవడం వంటి వృత్తి పనులను మా కుటుంబం చాలా కాలం నుంచి మానివేసింది. కానీ మేము దళితులం కాబట్టి అగ్ర కులస్థులయిన గ్రామస్థులు కొందరు అటువంటి పనులు పురమాయిస్తూ ఉంటారు. వారిలో కొందరికి మా కుటుంబంతో మంచి సంబంధాలు చాలా కాలం నుంచి ఉన్నాయి. అందుచేత వారి విజ్ఞప్తి మేరకు చనిపోయిన పశువులను తీసుకుపోతుంటాము' అని శైలేష్ అన్న ప్రకాశ్ భాయ్ మణిబాయ్ రోహిత్ చెప్పాడు.

తన తల్లిని, తమ్ముణ్ణి అగ్ర వర్ణస్థులు కొట్టిన రోజున తాను ఇంట్లో లేనని అతడు తెలియచేశాడు. వారిద్దరూ తన ఏడాది బిడ్డను చూసుకోడానికి ఇంటి వద్ద ఉండగా ఈ దుర్ఘటన జరిగినట్లు వివరించాడు. ముందుగా తన తమ్ముడు 21 ఏళ్ల శైలేష్‌ను ఆ సమూహం కొట్టడంతో అతడి అరుపులు విని రక్షించడానికి వచ్చిన తన 50 ఏళ్ల తల్లిని వారు మరింత తీవ్రంగా గాయపరిచారని అతడు చెప్పాడు. ఐదుగురు కలిసి శైలేష్‌ను నేల మీద అదిమిపట్టి ఉంచగా, మరి ఐదుగురు అతణ్ణి కొట్టారని, పీక పిసికి చంపడానికి కూడా ప్రయత్నించారని, అంతలో ఇరుగుపొరుగు జనం వచ్చి కొట్టడం ఆపాలని ఆ సమూహాన్ని ప్రార్థించడంతో వారు వెళ్లిపోయారని శైలేష్ అన్న తెలిపాడు. వారు వెళ్లిపోతూ తన తమ్ముణ్ణి, తల్లిని కులం పేరుతో దూషించారని, తీవ్రంగా బెదిరించారని కూడా అతడు చెప్పాడు. తన ఏడాది పసి బిడ్డను సజీవంగా దహనం చేస్తామని కూడా వారు బెదిరించారని వాపోయాడు. గాయాలవల్ల అతని తల్లి మూత్రపిండం వాచినట్లు ఆసుపత్రి వైద్యులు చెప్పారు. 'మేము వారి కుళ్లని శుభ్రం చేస్తాం. కాని వారు మమ్మల్ని కొట్టి బెదిరిస్తారు' అని ప్రభాష్ భాయ్ కన్నీళ్లు పెట్టుకొన్నాడు. ఆ గ్రామ సర్పంచ్ కాంతి భాయ్ పూలాభాయ్ పార్మర్ కుమారుడు కూడా ఆ దళితులను కొట్టినవారిలో ఉన్నట్లు తెలిసింది. అతడు అరెస్టయ్యాడు కూడా. ఆ గ్రామ శ్మశానం వద్ద వాడుకలో లేని ప్రభుత్వ భూమి వద్దకు ఆ ఆవు కళేబరాన్ని శైలేష్ తీసుకుపోయాడు.

> ఏడాది క్రితం ఉనా ఘటన తర్వాత దళితులు పశు కళేబరాల అంతిమ విధులు నిర్వర్తించబోమని 'ఉనా దళిత అస్మిత యాత్ర'లో ప్రతిన బూనారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ పని ఏదీ లేకపోవడంతో అదే వృత్తిలో కొనసాగుతున్నారు. అయితే చుట్టుపక్కల కొన్ని గ్రామాల దళితులు ఆ పని మానివేసి ప్రత్యామ్నాయం వెదుక్కోగలిగారు. దానితో దళితులకు వారి వృత్తి నిమిత్తం అంతకు ముందు ప్రభుత్వం ఇచ్చిన చిన్న స్థలం పనికి రాకుండా పడిఉంది. ఆ భూమి ఆక్రమణకు అగ్ర కులాలు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వాల అలసత్వంవల్ల ఉనా ఘటనలు ఇలా ఎక్కడో అక్కడ తరచూ జరుగుతూనే ఉన్నాయి.

వివాదానికి కీలకం శ్మశాన భూమి

'చనిపోయిన ఆవును తొలగించాలని భగత్ నన్ను పిలిపించి చెప్పాక ఒక ట్రాక్టర్‌ను తెప్పించాను. మామూలుగా పశు కళేబరాలకు దళితులు అంతిమ విధులు జరిపే చోట ఇటీవలి వరదల వల్ల బురదగా ఉండడంతో అంతవరకూ వాడకంలో లేని ఆ సమీపంలోని ప్రభుత్వ స్థలం వద్ద ఆ పని చేయడానికి నిర్ణయించుకొన్నాను. మధ్యాహ్నం 12 గంటలకు నేను అక్కడకు చేరగానే సర్పంచ్ నలుగురు గ్రామస్థులతో అక్కడ ఉన్నాడు. ఆ కళేబరాన్ని అక్కడకు తెచ్చినందుకు దర్బార్లు కోపంతో ఉన్నారు. 40మంది సమూహం నిన్ను కొట్టడానికి వస్తుంది. శ్మశాన స్థలం ఖరాబు కావడం వాళ్లకు ఇష్టం లేదు' అని సర్పంచ్ తనను హెచ్చరించినట్లు శైలేష్ తెలిపాడు.

'అందువల్ల ఆ కళేబరాన్ని తక్షణమే అక్కడ నుంచి తీసుకుపోడానికి సిద్ధమయ్యాను. సాధారణంగా దళితులు పశు కళేబరాలకు ఆఖరి విధులు జరిపే చోటు మునిగి ఉన్నా అక్కడే ఆ పని కానిచ్చాను. అక్కడితో ఆ వ్యవహారం ముగిసింది అనుకొన్నాను' అని శైలేష్ వివరించాడు. ఆ మరునాడు ఉదయం 8.30 గంటల సమయంలో దర్బార్ల సమూహం శైలేష్ ఇంటిపై దాడిచేసి అతడిని, అతడి తల్లిని తీవ్రంగా కొట్టి, కులం పేరుతో దుర్భాషలాడి, తీవ్రంగా హెచ్చరించారు. శైలేష్ అన్న ఏడాది బిడ్డను సజీవ దహనం చేస్తామని బెదిరించారని, ఆ ఊరిలోని దళితులందరి ఇళ్లను (40 గుడిసెలు) తగలబెడతామని కూడా హెచ్చరించారని శైలేష్ తెలిపాడు. పోతూ పోతూ అదే గ్రామంలో ఉంటే చంపుతామని కూడా వారు తనను గట్టిగా అరుస్తూ బెదిరించారని, కేసు పెడతామని ఇరుగుపొరుగు వారు చెప్పినప్పుడు తమను వెక్కిరించారని కూడా చెప్పాడు. అత్యాచారాల చట్టం పనికిరానిదని, ఆ చట్టం కింద కేసు పెట్టినా తమకేమీ కాదని కూడా వారు అన్నారని శైలేష్ తెలిపాడు.

తెమలని పాత అత్యాచారం కేసు

కాసోర్ గ్రామంలో 13,000 మంది నివసిస్తున్నారు. వారిలో 12,000మంది దర్బార్ లేదా ఠాకూర్ కులస్థులు. కేవలం 250 మందితో కూడిన 40 కుటుంబాలవారే దళితులు. అక్కడ కుల వివక్ష ఉదంతాలు కొత్త కాదు. ఆలయాల్లోకి దళితులను రానివ్వరు. సమీపంలోని కంబాట్, ఉమ్రేద్ గ్రామాల ఆలయాల్లో కూడా అదే వెలి అమలులో ఉంది. 2012 లో కాసోర్ గ్రామానికి చెందిన ఒక దళితుని కొట్టిన ఘటనపై ఇప్పటికీ దర్యాప్తు పూర్తి కాలేదు. పోలీసులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్ల వల్ల ఆ దర్యాప్తు ఆలస్యం అవుతోంది. ఆ కుటుంబం ఇంకా భయం భయంగా గడుపుతోంది. ఆ ప్రాంతంలో 'రాష్ట్రీయ దళిత అధికార్ మంచ్' అనే సంస్థ జిగ్నేశ్ మివానీ సారథ్యంలో దళిత ప్రజల రక్షణకు కృషి చేస్తోంది. ఏడాది క్రితం ఉనా ఘటన తర్వాత దళితులు పశు కళేబరాల అంతిమ విధులు నిర్వర్తించబోమని 'ఉనా దళిత అస్మిత యాత్ర'లో ప్రతిన బూనారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ పని ఏదీ లేకపోవడంతో అదే వృత్తిలో కొనసాగుతున్నారు. అయితే చుట్టుపక్కల కొన్ని గ్రామాల దళితులు ఆ పని మానివేసి ప్రత్యామ్నాయం వెదుక్కోగలిగారు. దానితో దళితులకు వారి వృత్తి నిమిత్తం అంతకు ముందు ప్రభుత్వం ఇచ్చిన చిన్న స్థలం పనికి రాకుండా పడిఉంది. ఆ భూమి ఆక్రమణకు అగ్ర కులాలు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వాల అలసత్వంవల్ల ఉనా ఘటనలు ఇలా ఎక్కడో అక్కడ తరచూ జరుగుతూనే ఉన్నాయి.

*** దమయంతీ ధర్**

పాస్–ఫెయిల్ విధానం అవసరం లేదు



ఏశాల శ్రీనివాస్
9603402858

మన దేశంలో జ్ఞానాన్ని (అప్పటికి సమాజం దేన్నైతే జ్ఞానం అని భావించిందో) నేర్చుకోవడం నేరంగా పరిగణించిన సమాజం మనది. శంభూకుడు తపస్సు చేసినందుకు చంపివేసింది, విలువిద్య నేర్చుకున్నందుకు ఏకలవ్యుడి బొటనవేలు తీసుకున్న సమాజం ఇది, ఈ రోజు ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. మనం ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నాం, పరిపాలనా సౌలభ్యం కోసం ఒక రాజ్యాంగాన్ని రాసుకొన్నాం. ఇప్పుడున్న పెట్టుబడిదారీ సమాజంలో వ్యక్తి భాగస్వామ్యం (వస్తు ప్రపంచంలో) కావాలంటే కనీస విద్య అవసరం. ఇప్పుడు విద్య పెట్టుబడిదారీ వ్యవస్థకు చాలా అవసరమైంది. కాబట్టే ప్రతి ఒక్కరు బడిలో వుండాలి అంటుంది. అది ఎలాంటి చదువు, మనిషి జీవితానికి ఈ చదువుకు ఏమైన సంబంధం వుందా అనేది దానికి అనవసరం.

ఇలాంటి దేశంలో ఈ రోజు డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టి 5, 8వ తరగతులకు పరీక్షలు పెట్టి ఫెయిల్ అయితే మళ్ళీ అదే తరగతి చదివేలా చట్టంలో మార్పు తేవాలని ప్రభుత్వం అనుకుంటున్నది. ఇది రాజ్యాంగ వ్యతిరేకం, దాన్ని సమర్థించటం ఇంకా తప్పు.

విద్యను పూర్తిగా వ్యాపార సరుకుగా చూడటం సరికాదు, అందుకే ఈ విద్యా హక్కు చట్టంలో 12(1)సి ప్రకారం 25 శాతం అన్ని విద్యా సంస్థల్లో సీట్లను బలహీన వర్గాలకు కేటాయించాలని వుంది. ఇది అమలు కావట్లేదు. ప్రయివేట్ కాలేజీల యాజమాన్యాలు కోర్టుకు వెళ్ళాయి. ఈ చట్టం ప్రకారం కనీసం ఇరవై సంవత్సరాలు పూర్తి స్థాయిలో అమలు జరిపిన తర్వాత ఆలోచిద్దాం.

1992లో మండల్ కమీషన్‌ను సమర్థిస్తూ బాలగోపాల్ మాట్లాడుతూ ''పుస్తకాలలో వుండే విజ్ఞానం అనేది బ్రాహ్మణీయ సంస్కృతి, ముందు పాఠ్యపుస్తకాలు మార్చండి, తిక్కన పద్యాలు, పోతన భాగవత పద్యాలు తీసేయండి, వ్యవసాయం ఎట్లా చేయాలి, కుండలు ఎట్లా చేయాలి, బట్టలు ఎట్లా నేయాలో పాఠ్యాంశాలుగా చేర్చండి'' అని అన్నారు. ముందు ప్రజాస్వామ్యం మీద గౌరవం వుంటే బ్రాహ్మణీయ సంస్కృతి ఆధిపత్యాన్ని వ్యతిరేకించాలంటే ముందుగా పాఠ్యాంశాలు మార్చాలని డిమాండ్ చేయాలి. ఈ విషయంలో గాంధీ కూడా అనియత విద్యావిధానం వుండాలి అన్నాడు.

ఈ దేశంలోని ఎనభై ఐదు శాతం జనాభా జీవన విధానాలకు దగ్గరగా వుండే విద్యావిధానం ప్రవేశపెట్టిన ఒక తరం తర్వాత, మీరు చెప్పే డిటెన్షన్ విధానాన్ని తప్పకుండా పాటిద్దాం. ఈ బహుజనుల ఇంట్లో దేవుడికి ప్రత్యేకమైన స్థలం వుంటుంది. కాని, ఇంట్లో చదువుకోవటానికి ప్రత్యేక స్థలం వుండదు, కారణాలు ఏమైనా చదువు అనేది తమ సంస్కృతిలో, జీవితంలో భాగంగా అయినప్పుడు పోటీ విధానంలో నిలబడగలుగుతారు.

రాజ్యాంగ రచనల సమయంలోనే డా.అంబేద్కర్ నిర్బంధ ఉచిత విద్యావిధానం వుండాలని కోరాడు. కాని, ఆ రోజులలో ఎక్కువ మంది ఎంపిలు భూస్వాములు కాబట్టే వ్యతిరేకించారు, తమ భూములు పడావు పడతాయిని, దేశానికి ప్రధాన ఆదాయం వ్యవసాయ రంగం నుండి వస్తుంది కాబట్టి ఇప్పుడు అవసరం లేదు అని వ్యతిరేకించారు. ఈ మధ్యకాలంలో డిటెన్షన్ విధానాన్ని సమర్థిస్తూ కొందరు నూతన 'ప్రతిభ' వాదనతో కింది కులాలకే మేలు, ప్రభుత్వ స్కూళ్లల్లో పోటీతత్వం వుంటేనే మేలు అని చెపుతున్నది తప్పు. వారి అవగాహనను మార్చుకొని విద్యాహక్కు చట్టంలోని 25 శాతం సీట్లను బలహీన వర్గాలకు కేటాయించడం కోసం పోరాడితే బాగుంటుంది. పాఠ్యాంశాల మార్పు గురించి మాట్లాడితే బాగుంటుంది.

ఎడిటర్‌కు లేఖ

మారని క్రైస్తవులు, దళిత క్రైస్తవుల స్థితిగతులు

అనేక ఏండ్లుగా క్రైస్తవులు, దళిత క్రైస్తవులు అన్ని విధాలుగా వెనుకబడిపోతూనే ఉన్నారు. అణచివేతకు, వివక్షతకు గురవుతూనే ఉన్నారు. దళితులు ఏ మతం స్వీకరించినా వారి స్థితిగతులు మారడం లేదు. సామాజిక స్థాయి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 65 ఏండ్లు గడిచిపోతున్నా దళిత క్రైస్తవుల పరిస్థితి ఏ మాత్రం మారకపోగా సామాజికంగా ఇంకా వెనుకబాటుతనాన్నే అనుభవించడం దురదృష్టకరం. ప్రజాస్వామ్య వ్యవస్థలో క్రైస్తవుల పట్ల అణచివేత, వివక్ష కొనసాగుతుండటం, వీటిని రూపుమాపి క్రైస్తవుల స్థితిగతులను మార్చేందుకు పాలకులు ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడం జరుగుతోంది. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి క్రైస్తవ మతసంఘాలు, సంస్థలు కుల, మత, పేద, ధనిక తేడా లేకుండా అనేక రకాలుగా నిస్వార్థంగా వైద్య, విద్య, సామాజిక రంగాలలో సేవలందించడం జరుగుతుంది. అనేక రంగాలలో ప్రభుత్వంతో సమానంగా సేవలు చేస్తూనే ఉంది. ఈ రోజుకీ కూడా క్రైస్తవ సమాజం బాధ్యతాయుతమైన సేవలను అందిస్తూనే ఉంది. అయినప్పటికీ భారత సమాజంలో క్రైస్తవులు మత పరమైన వివక్షను, దాడులను, అణచివేతను ఎదుర్కొంటున్నారు. కేవలం క్రైస్తవ మతం స్వీకరించిన కారణంగా హక్కులను కోల్పోవడం జరుగుతుందంటే భారత రాజ్యాంగానికి మాయని మచ్చ. మతం మారినా కూడా క్రైస్తవుల స్థితిగతులు మారలేదని 1955 నుంచి 2007 వరకు నియమించబడిన అనేక కమిషన్స్ ధృవీకరించబడుతున్నాయి. క్రైస్తవ మతం స్వీకరించి దళితుల స్థితిగతులు మార్పు చెందేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా కొన్ని హక్కులు, భద్రత కల్పించబడినా వాటిని అమలు చేయడంలో మన పాలకులు ఏమాత్రం దృష్టిసారించడం లేదు.

ఈ స్థితి దళిత క్రైస్తవుల పైనా, క్రైస్తవులపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. మత పరమైన వివక్ష, దాడులు, అణచివేత కొనసాగినా మన పాలకులు పట్టించుకోకపోగా వాటిని సమర్థించే విధంగా వ్యవహరించడం క్రైస్తవ మతంపై పాలకులే వివక్ష చూపుతున్నారనడానికి నిదర్శంగా నిలుస్తోంది. దేశంలో అనేక ప్రాంతాల్లో క్రైస్తవులపై వివిధ కారణాలతో ఇప్పటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి స్థితిలో ప్రభుత్వాలు క్రైస్తవుల పట్ల, దళిత క్రైస్తవు పట్ల నిర్లక్ష్యం వీడాలి. అన్ని రకాలుగా భరోసానివ్వాలి. 1956లోనూ దేశంలో సిక్కు మతం స్వీకరించిన దళితుల కొరకు, బౌద్ధం, క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన దళితుల కోసం 1990లో కూడా ప్రెసిడెన్షియల్(ఎస్‌సి)ఆర్డర్ 1950 సవరించబడింది. ఈ ఆర్డర్‌ను అనుసరించి హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు స్వీకరించిన దళితులకున్న హక్కులు, భద్రతను దళిత క్రిస్టియన్లకు, క్రిస్టియన్లకు, దళిత ముస్లింలకు కూడా హక్కులు, భద్రత కల్పించబడే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన దళితులను ఎస్‌సిలుగానే గుర్తించి అన్ని రకాలుగా ఆదుకోవాలి. అందుకోసం కేంద్రప్రభుత్వం 1950 నాటి ప్రెసిడెన్సియల్(ఎస్సి)ఆర్డర్‌ను సవరించాలి. దళిత క్రిస్టియన్లకు, క్రిస్టియన్లకు తగు న్యాయం చేయాలి.

– **బండారి బాబు**, 9490099197

పల్స్

అర్ధరాత్రి తిండి ఆరోగ్యానికి గండి

చిరుతిళ్ళు, స్పైసీఫుడ్, జంక్‌ఫుడ్, కేన్డ్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, సీసాలకెత్తిన కూల్ డ్రింకులు ఇవి లేకుండా ఇవాళ రేపు ఏ పార్టీ జరగడంలేదు. ఇవి తినడానికి రుచిగా కరకరలాడుతూ ఫ్రెష్ ఫీల్ ఇస్తూ ఉంటాయి. పిల్లలు, పెద్దలు అంతా ఎగబడి వీటిని తినడానికి, తాగడానికి మొగ్గు చూపుతుంటారు. విందును గ్రాండ్‌గా మార్చడానికి, హైఫై లక్షణాలు ఇవ్వడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి. అందుకని గ్రాండ్ స్కేల్‌లో పార్టీ చేయాలనుకునే వారు వీటిని తమ మెనూలో తప్పనిసరి చేస్తున్నారు. ఇవిలేకపోతే పల్లెటూరితనంగా ఉంటుందనే ఆత్మన్యూనతాభావంతో వీటికి టాప్ ప్రయార్టీ ఇచ్చి ఏర్పాటుచేస్తున్నారు. వీటి వల్ల కలిగే రుచికన్నా, గ్రాండియర్‌కన్నా వచ్చిపడే ఆరోగ్యసమస్యలే కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ఆ సమస్యలేమిటో అవి రాకుండా ఎలా జాగ్రత్తపడాలో తెలియజేస్తున్నారు అమెరికాలోని సౌత్ డకోటా స్టేట్‌లో ఉన్న ఇండో అమెరికా ఆస్పత్రి (ఐఎహచ్) ఛైర్మన్ డాక్టర్ అంజలీ మాథుర్.

- ఇటీవల కాలంలో ఎప్పీఫిజ్ లాంటి డ్రింకులు పార్టీలలో విరివిగా వాడుతున్నారు. వీటిలో క్యాన్సర్ కలిగించే ఎలిమెంట్లు ఉంటాయి. వాటికి దూరంగా ఉండడం శ్రేయస్కరం.
- పిల్లా, పెద్దా తేడా లేకుండా అంతా ఈ మధ్య కుర్కురేలు తింటున్నారు. వీటిలో పెద్దమొతాదులో ప్లాస్టిక్ ఉంటుంది. ఒక కుర్కురే ముక్కను తీసుకుని అంటించి చూడండి. మీ కళ్ళ ముందే ప్లాస్టిక్ కవర్‌లాగా కరిగిపోతుంది. ప్లాస్టిక్ ముక్కను తినడం ఎవరికైనా మంచిదేనా? వీటి విషయంలో జాగ్రత్తపడండి.
- డికోల్డ్, విక్స్ యాక్షన్500, యాక్టిఫెడ్, కోల్డారిన్, కాస్మో, నైస్, నిములిడ్, సెట్రిజెట్‌డి వంటి మందులు వాడడం మంచిదికాదు. వీటి వల్ల గుండెపోటు రావడానికి ఆస్కారం ఉంది. వీటి వాడకాన్ని అమెరికా నిషేధించింది.
- క్యాన్సర్ పేషెంట్లను జాగ్రత్తగా అధ్యయనం చేస్తే చాలా మందిలో సిల్వర్ నైట్రో ఆక్సయిడ్ కనిపించింది. సెల్‌ఫోన్‌ల కోసం రీచార్జి కార్డులు కొని కోడ్ తెలుసుకునేందుకు దాని మీద కోట్‌ను చేత్తో గీకుతుంటారు. అలా చేయకండి. ఆ కోడ్ నెంబర్‌మీద పూసిన కోట్‌లో నైట్రోఆక్సయిడ్ ఉంటుంది. అలా చేయడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.
- మీ మొబైల్‌కు ఫోన్‌కాల్ వస్తే ఎడమచేత్తో ఎత్తి ఎడమచెవికి ఆనించి మాట్లాడండి.
- ఏ మందు వేసుకోవాల్సి వచ్చినా చల్లని నీటితో వేసుకోకండి.
- సాయంత్రం 5గంటలు దాటిని తర్వాత హెవీగా తినకండి.
- చాలా మంది నీళ్ళు ఎక్కువగా తాగుతుంటారు. ఈ అలవాటు మంచిదేకానీ దానికి కూడా ఒక పద్ధతి ఉంది. పగటిపూట ఎక్కువ నీళ్ళు తాగండి. రాత్రిపూట తాగడం బాగా తగ్గించండి.
- ఎవరికైనా బాగా నిద్రపట్టే సమయం రాత్రి 10 నుంచి ఉదయం 4గంటల వరకు కనుక ఆ సమయంలో నిద్రపోయే అలవాటు చేసుకోండి. అందువల్ల నిద్రలేమితో బాధపడడం తప్పుతుంది.
- పగలైనా, రాత్రయినా తిన్న వెంటనే పడుకోకూడదు. పగటి నిద్ర వీలైనంత వరకు తగ్గించండి.
- పగలైనా, రాత్రయినా మందులు వేసుకున్నవేసుకున్న వెంటనే నిద్రపోకండి.



- ఫోన్‌లో చార్జి అయిపోతున్నప్పుడు జాగ్రత్తపడండి. ఆఖరి గీత వరకు మాట్లాడకండి. ఆ సమయంలో ఫోన్‌లో రేడియేషన్ వెయ్యిరెట్లు ఎక్కువగా ఉంటుంది.
- ఇటీవల కాలంలో ప్లాస్టిక్ కప్పులలో చాయ్ తాగడం బాగా అలవాటైపోతోంది. ఇది మంచిది కాదు. అలా తాగడం వల్ల ప్లాస్టిక్ రియాక్ట్ అయి 52 రకాల క్యాన్సర్‌లకు కారణమవుతుంది.
- ప్లాస్టిక్ ప్లేట్లలో వేడివేడి ఆహారం తినకండి. ఇలా చేయడం వల్ల ప్లాస్టిక్ కరిగి కడుపులోకి చేరుతుంది. అందువల్ల క్యాన్సర్ రావడానికి ఆస్కారం చాలా ఎక్కువగా ఉంది.
- వేడినీళ్ళలో 23 చుక్కల నిమ్మకాయ రసం పిండుకుని తాగితే క్యాన్సర్ దూరమవుతుంది. చల్లటి నీళ్ళ కన్నా వేడినీళ్ళే మంచివి కనుక వేడినీటినే వాడండి. ఈ మిశ్రమంలో చక్కెర కలపకండి.
- చిలకడదుంపలో క్యాన్సర్‌ను నిరోధించే లక్షణాలున్నాయి. కనుక వాటిని బాగా వాడుకోవచ్చు.
- తరుచూ అర్ధరాత్రి అపరాత్రి ఆహారాలే అయితే ఉదరకోశ క్యాన్సర్ రావడానికి ఆస్కారం ఉంది.
- వారంలో 4కు మించి గుడ్లు తీసుకున్నా, అతిగా కోడి మాంసం తిన్నా ఉదరకోశ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.
- అన్నం తిన్నాక పండ్లు తినడం చాలా మందికి అలవాటు. అది మంచిపద్ధతి కాదు. పండ్లు తినదలచుకుంటే అన్నం తినడానికి ముందే తినాలి.
- మహిళలు నెలసరి వచ్చినపుడు టీ/కాఫీలు తాగకుండా ఉంటే మంచిది
- అతిగా సోయామిల్క్ తాగకండి. మితంగా తాగడంవల్లనే మంచి ఫలితాలు ఉంటాయి.
- సోయామిల్క్‌లో చక్కరకానీ, గుడ్డుకాని కలపకండి.
- పరగడపునే టమాటాలు తినడం మంచిదికాదు. పచ్చిటమాటాల కన్నా ఉడికించిన టమాటాలలోనే పుండ్లను మాన్చే శక్తి అధికంగా ఉంటుంది.
- ప్రతీరోజూ తప్పనిసరిగా 10 గ్లాసుల నీళ్ళు తాగండి. అలా చేయడం వల్ల బ్లాడర్ క్యాన్సర్ రాకుండా ఉంటుంది.
- పొద్దుటపూట అన్నం తినేముందు ఒక గ్లాసు మంచినీళ్ళు తాగండి. అందువల్ల ఊపిరితిత్తులలో రాళ్ళు ఏర్పడకుండా ఉంటుంది.
- లిక్కర్ తాగే అలవాటుంటే మానుకోండి. ఆగలేకపోతే చాలా తక్కువమోతాదులో తీసుకోండి. లిక్కర్‌లో బలమిచ్చే పదార్థాలేవీలేవు. లేకపోగా అది ఆపకుండా తాగడం వల్ల బిపి, షుగర్ వంటి జబ్బులు పట్టుకుంటాయి. మరీ ఎక్కువైతే లివర్ డామేజ్ అయ్యే ప్రమాదం ఉంది.
- ఓవెన్‌లోనో, టోస్టర్‌లోనో కాల్చిన బ్రెడ్‌ను వేడి వేడిగా ఉన్నాయి కదా అని వెంటనే తినకండి.
- నిద్రపోయేటప్పుడు హ్యాండ్ ఫోన్‌ను కానీ, మొబైల్‌ఫోన్‌కానీ మీ పక్కన ఉంచుకోకండి.
- నిద్రపోవడానికి మూడు గంటల ముందు ఎలాంటి ఆహారం తీసుకోకండి.
- రోజుకు 2 కప్పులకు మించి కాఫీ తాగకండి. అతిగా తాగితే గ్యాస్‌బాధ పట్టుకుంటుంది.
- వీలైనంత వరకు ఆయిల్ లేని ఆహారం తీసుకోండి. అలా సాధ్యపడని పక్షంలో అతితక్కువగా ఆయిల్ తీసుకోండి. ఆయిల్‌తో చేసిన ఆహారం అరగడానికి కనీసం 57 గంటల సమయం పడుతుంది. అందువల్ల కడుపు ఉబ్బరంగా ఉండి ఆయాసంగా, అలసటగా, మబ్బుగా అనిపిస్తుంది. హుషారుగా ఉండలేరు.
- మనిషికి కనీసం 8 గంటల నిద్ర కావాలి. నిద్రతక్కువైతే మెదడు పనితనం మందగిస్తుంది. మధ్యాహ్నం అదవి నిద్దురపోవడం మంచిదికాదు. అరగంట పడుకుండే ఆరోగ్యం బాగుంటుంది. వయసు పెరిగినా కుర్రకారుతనంగా ఉండగలుగుతారు.

– డా. అంజలీ మాథుర్, సౌత్ డకోటా, అమెరికా

జ్ఞాపకశక్తి లోపించకుండా ఉండాలంటే...?

జ్ఞాపకశక్తి అనేది మన నిత్య జీవితంలో అవసరం. ఇది లోపిస్తే ప్రతి పనికి అంతరాయం. ఏదైనా విషయం గుర్తుంచుకున్నప్పుడు వెంటనే గుర్తుకు రాక పోవడాన్ని జ్ఞాపకశక్తి లోపంగా వ్యవహరిస్తారు. మనం పుట్టినప్పటినుంచి చనిపోయేంత వరకు జరిగే సంఘటనలు మెదడులోని న్యూరాన్లలో నిక్షిప్తమై ఉంటాయి. అవసరమైతే ఆ విషయాన్ని బైటకు వెంటనే తేవడమే జ్ఞాపకశక్తి.

కారణాలు: సరియైన పోషక ఆహారం తీసుకోకపోవటం, మెదడులో కణుతులు ఏర్పడటం వల్ల మెదడుకు సోకే ఇన్‌ఫెక్షన్స్ వల్ల, థయామిన్ లోపం వల్ల, మెదడుకు ఆక్సిజన్, గ్లూకోజ్ సరిగా అందని పరిస్థితుల్లో, తలకు బలమైన గాయాలు తాకడం వల్ల, కొన్ని రకాల మత్తు మత్తుపదార్థాలను అధికంగా వాడటం వల్ల (ఆల్కహాలు వంటివి), థైరాయిడ్ లోపం, మానసిక ఒత్తిడికి అధికంగా గురికావడం.

లక్షణాలు:

- సరియైన సమయంలో చదివింది గుర్తుకురాకపోవటం,
- వస్తువులు ఎక్కడ పెట్టామో గుర్తుకు రాకపోవటం.
- కొన్ని విషయాలను ఒకట్రెండు రోజులు తర్వాతనే మరచి పోవడం.
- కొంత మంది గృహిణులు బజారుకు వెళ్లిన తర్వాత ఇంటికి తాళం వేసామో లేదో గ్యాస్ ఆఫ్ చేసామో లేదో అని ఆందోళన పడటం వంటి లక్షణాలు ఉంటాయి.



ఇటువంటి లక్షణాలు ఉన్నప్పుడు తమకు జ్ఞాపకశక్తి లోపించిందేమో అని ఆందోళన చెందడం సహజం, అలా కాకుండా చేసే పని మీద దృష్టి సారించి ఏకాగ్రతతో చేయుట భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవటం వలన మానసిక ఒత్తిడి లేకుండా జీవనాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తే 'జ్ఞాపకశక్తి' మెరుగు పడుతుంది.

చికిత్స: హోమియోలో జ్ఞాపకశక్తి లోపాన్ని నివారించడానికి అద్భుతమైన మందులు ఉన్నాయి. ఈ మందులను ఎన్నుకునే ముందు వ్యక్తి మానసిక, శారీరక అలవాట్లను పరిగణలోకి తీసుకోవాలి. అలాగే జ్ఞాపకశక్తి లోపానికి గల కారణాలైన భయం, మానసిక ఒత్తిడి, నెగటివ్ ఆలోచనలు ఉంటే వాటి నుండి బయట పడేందుకు కౌన్సెలింగ్ ఇప్పించాలి.

మందుల రకాలు

ఎనకార్డియం: జ్ఞాపకశక్తి లోపానికి ఈ మందు బాగా పని చేయును. పిల్లలు చదివింది పరీక్షలకు ముందు గుర్తుకు రాక బాధపడుతుంటారు. ఇటువంటి వారికి ఈ మందు తప్పక వాడవచ్చును.

బెరైటాకార్బ్: ముసలివారు, ఎక్కువ బలహీనంగా ఉన్న వారు మతిమరుపుతో బాధపడుతుంటారు, వీరికి మానసిక వికాసం తక్కువ. అలాగే జ్ఞాపకశక్తి లోపంతో పాటు పిల్లలలో ఎదుగుదల లోపించి మరుగుజ్జుగా ఉన్నట్లయితే ఈ మందును వాడుకొని ప్రయోజనం పొందవచ్చును.

సల్ఫర్ : వీరు పేర్లను మరిచిపోతారు. వీరికి మానసిక శక్తి తక్కువ, బద్ధకస్తులు. వీరు మతిమరుపుతో పాటు, చర్మ వ్యాధి, మలబద్ధకంతో బాధపడుతుంటారు. వీరికి పరిశుభ్రతపై పట్టింపు ఉండదు, అపరిశుభ్రంగా ఉంటారు. వీరు చూడటానికి సన్నగా ఉంటారు. కుదురుగా ఒక చోట నిలబడలేరు, వంగి నడుస్తుంటారు. ఇటువంటి లక్షణాలున్న వారికి ఈ మందు తప్పక ఆలోచించదగినది.

ఎకోనైట్ : వీరు తేదీలను మరిచిపోతారు. మానసిక ఒత్తిడి వల్ల, టెన్షన్స్ వల్ల జ్ఞాపకశక్తి తగ్గినట్లు అయితే ఆరంభ దశలో ఈ మందు బాగా పనిచేయును. అలాగే వీరు చల్ల గాలిలో తిరుగడం వలన ముక్కు బిగుసుకొనిపొయి, తుమ్ములు , గొంతు నొప్పి వెంటనే ప్రారంభమవుతుంది. వీరికి ఆందోళన, దాహం విపరీతంగా ఉంటుంది. ఇలాంటి లక్షణాలు ఉండి జ్ఞాపకశక్తి లోపంతో బాధపడే వారికి ఈ మందును వాడవచ్చును.

సిక్యుట విరోస: వీరు మందమతులు వీరి పేరును సైతం మరిచిపోతారు, చివరకు తమ ఇంటి నంబరును, ఫోన్ నంబరును మరిచిపోతారు. ఇలాంటి వారికి ఈ మందు బాగా పని చేయును.



డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
హోమియోఫిజీషియన్
హన్మకొండ, వరంగల్ జిల్లా

జర్నలిస్ట్ హత్య కేసులో మాజీ ఎంపి షాహబుద్దీన్‌పై చార్జిషీట్

జఫర్‌పూర్: గత ఏడాది మే నెలలో జర్నలిస్ట్ రాజ్‌దేవ్ రంజన్ హత్య కేసులో ఆర్‌జెడి మాజీ ఎంపి షాహబుద్దీన్‌పై మంగళవారం ప్రత్యేక కోర్టులో సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ప్రత్యేక విచారణ అధికారి సునిల్ సింగ్ రావత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీప్ నారాయణలు, షహబుద్దీన్ సహా మరో ఆరుగురిపై నమోదు చేసిన చార్జిషీట్‌ను సిబిఐ ప్రత్యేక జడ్జి అనుపమ్ కుమారి ఎదుట ప్రవేశపెట్టారు. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న షాహబుద్దీన్‌పై నేరపూరిత కుట్ర, హత్య, ఆయుధ చట్టం ఉల్లంఘటనకు పాల్పడినట్లు చార్జిషీట్ నమోదు చేసినట్లు సిబిఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయనపై ఐపిసి సెక్షన్ 120బి (నేరపూరిత కుట్ర, సెక్షన్ 302(హత్య), సెక్షన్ 27 కింద చార్జిషీట్ నమోదు చేసింది. ప్రముఖ హిందీ దినపత్రిక బ్యూరో బ్యూరో చీఫ్ రాజ్‌దేవ్ రంజన్‌ను గత ఏడాది మే 13న హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసులో షాహబుద్దీన్ నిందితుడుగా మే 26న సిబిఐ ప్రత్యేక కోర్టు గుర్తించింది. బీహార్‌లోని సివాన్ లోక్ సభ నుంచి నాలుగు పర్యాయాలుగా ఎంపిగా పని చేసిన షహబుద్దీన్ 45కు పైగా క్రిమినల్ కేసులలో విచారణను ఎదుర్కొంటున్నారు. చంద్రశేఖర్ అనే వ్యక్తి ముగ్గురు కుమారులు రెండు వేర్వేరు ఘటనల్లో మృతి చెందిన కేసులో సుప్రీంకోర్టు ఆదేశం మేరకు ఫిబ్రవరిలో షాబుద్దీన్‌ను తీహార్ జైలుకు పంపారు.





గీతంకు జాతీయస్థాయి గుర్తింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : గీతం విశ్వవిద్యాలయానికి చెందిన దూర విద్యా కేంద్రం (సిడిఎల్) జాతీయ స్థాయిలోని తొలి 12 సంస్థలలో ఒకటిగా నిలిచి, స్థాపించిన ఎనిమిదేళ్ళలోనే అత్యున్నత స్థానం దక్కించుకున్న విద్యాసంస్థగా చరిత్ర సష్టించింది. దూర విద్యార్జన కోసం విద్యార్థులు అత్య'దికంగా ఇష్టపడే విద్యాసంస్థల పేరుతో కెరీర్ కనెక్ట్ నిర్వహించిన సర్వేలో సిడిఎల్ ప్రముఖ స్థానంలో నిలిచినట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. కెరీర్ కనెక్ట్ జూలై 2017 సంచికలో సర్వే వివరాలన్నీ పొందుపరచినట్లు తెలిపారు. సర్వేలో వచ్చిన ఫలితాల ఆధారంగా ఆయా విద్యాసంస్థలకు స్టార్ రేటింగ్ ఇచ్చిందని, అందులో గీతం సిడిఎల్ 5 స్టార్లకు గాను 4.5 స్టార్లతో దక్షిణ భారతదేశంలోనే విద్యార్థులు అత్యంత ఇష్టపడే విద్యాసంస్థగా రేటింగ్ పొందినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. నిబద్ధతతో కష్టించి పనిచేస్తూ, వినూత్న ఆలోచనలతో సహచరులను ప్రోత్సహిస్తూ సిడిఎల్ అధికారులు పనిచేయడం వల్లనే జాతీయస్థాయిలో అత్యుత్తమ స్థానానికి చేరుకోగలిగారని గీతం అధ్యక్షులు డాక్టర్ ఎంవివిఎస్ మూర్తి ప్రశంసించినట్లు తెలిపారు.

జాతర నుంచి మృత్యు ఒడికి

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా పరారయ్యాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కెరమెరి మండలం లింగూడ గ్రామానికి చెందిన వెడ్మ అంబారావు (20), మోర్లె తిరుపతి (22), అదర్ వాడకు చెందిన సంతోష్ (18) అక్కడిక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలతో పడి ఉన్న ఝరి గ్రామానికి చెందిన లెండుగురె రమేష్ (14) ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన మరో యువకుడు మోర్లె జ్ఞానేశ్వర్, కెరమెరి మండలానికి చెందిన ఇగురపు నవీన్ (18) మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందారు. మరో ఆరుగురు ప్రాణాప్రాయ స్థితిలో ఉన్నారు. సంఘటనా స్థలానికి కాగజ్‌నగర్ డిఎస్‌పి హబీబ్‌ఖాన్, వాంకిడి సిఐ శ్రీనివాస్, కాగజ్‌నగర్ సిఐ ప్రసాద్‌రావు చేరుకొని రోడ్డు ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

తలాక్ తగదు

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధమైనదిగానూ ఉందని, అందువల్ల దానిని రద్దు చేయాలని వారు ఆదేశించారు. ముమ్మారు తలాక్ రాజ్యాంగ విరుద్ధమని, ఇస్లాం దేశాల్లోనే దీనిని నిషేధించినప్పుడు భారత్‌లో ఎందుకు కొనసాగించాలని వారన్నారు. ముమ్మారు తలాక్ రాజ్యాంగంలోని సమానత్వ హక్కును అతిక్రమిస్తోందని వారు అభిప్రాయపడ్డారు. కాగా, ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం ట్రిపుల్ తలాక్ ఆచారాన్ని సవాలూ చేస్తూ ముస్లిం మహిళలు దాఖలు చేసిన ఐదు వేర్వేరు పిటిషన్లు సహా మొత్తం ఏడింటిని విచారించిన సంగతి తెలిసిందే. తలాక్‌కు రాజ్యాంగ బద్ధత లేదంటూ పిటిషనర్లు పేర్కొన్నారు. భర్తలు తలాక్ పదాన్ని మూడు సార్లు ఉచ్ఛరించడమే కాక కొన్నిసార్లు ఫోన్‌లో చెప్పడం లేదా ఎస్ఎంఎస్ పంపడం ద్వారా కూడా విడాకులకు తీసుకుంటున్నారని ముస్లిం మహిళలు తమ పిటిషన్లలో ఆరోపిస్తూ వాపోయారు. విచారణ సందర్భంగా ట్రిపుల్ తలాక్ చెత్త ఆచారమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ముస్లిం మతంలోని విడాకుల ఆచారాన్ని కొందరు ఛాందసవాదులు చట్టపరమైనదిగా సమర్థిస్తున్నప్పటికీ, అది ఎంతమాత్రం వాంఛనీయమైనది కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. మరోవైపు ముస్లిం మతం అనుసరిస్తున్న తలాక్ బిద్దత్, తలాక్ హసన్, తలాక్ ఆసాన్ అనే మూడు రకాల విడాకుల పద్ధతులు ఏకపక్షమైనవని, చట్టపరిధిలో లేనివని కేంద్రం గతంలో కోర్టుకు తెలిపింది. అన్ని (మతాల) వ్యక్తిగత చట్టాలు తప్పకుండా రాజ్యాంగంలోని నిబంధనలకు లోబడే ఉండాలని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. ట్రిపుల్ తలాక్ అనేది ఇస్లాంలో అంతర్గత భాగమూ కాదు, మెజార్టీ వర్సెస్ మైనార్టీ సమస్యా కాదని పేర్కొంది. అయితే అది ముస్లిం పురుషులకు, ఆభాగ్యులైన ఆ మతంలోని మహిళలకు మధ్య నెలకొన్న ఒక మతాంతర ఘర్షణ అని అభిప్రాయపడింది. తలాక్‌తో పాటు ముస్లిం మతంలోని నిఖా హలాలా, బహుభార్యత్వం ఆచారాలను కూడా సవాలు చేస్తూ కొన్ని పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ మూడింటిలో ట్రిపుల్ తలాక్‌ను ప్రధానమైనదిగా భావించిన ధర్మాసనం తనకు తానుగా 'సమానత్వానికి ముస్లిం మహిళల తపన' పేరుతో పిటిషన్‌ను విచారించింది. ముస్లిం మహిళలు విడాకుల సమయంలో లేదా తమ భర్తలు వేరే వివాహాలు చేసుకునే సమయంలో ఏదైనా లింగ వివక్షతకు గురవుతున్నారా? అనే విషయాన్ని ధర్మాసనం స్వీయాత్మకంగా గుర్తించి ఈ మేరకు విచారణ చేపట్టడం గమనార్హం.

ఇది ముస్లిం మహిళల విజయం

తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పును పిటిషనర్ షయారా బానో సహా ఆల్ ఇండియా ముస్లిం ఉమెన్ పర్సనల్ లా బోర్డు (ఎఐఎండబ్ల్యుపిఎల్‌బి), ఆల్ ఇండియా షియా పర్సనల్ లా బోర్డు (ఎఐఎస్‌పిఎల్‌బి) మంగళవారం స్వాగతించాయి. ఇది దేశంలోని ఇస్లాం, ముస్లిం మహిళలు సాధించిన విజయంగా అభివర్ణించాయి. ఈ తీర్పు ముస్లిం మహిళల్లో కొత్త ఆశలను రేకెత్తించాయని ఎఐఎండబ్ల్యుపిఎల్‌బి అధ్యక్షురాలు షాయిస్తా అంబర్ అన్నారు. ట్రిపుల్ తలాక్‌ని శాశ్వతంగా నిషేధిస్తారని తాము భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఇస్లాంలో తలాక్‌కు సంబంధించి ఎలాంటి నిబంధన లేకపోయినా దాని వల్ల ముస్లిం మహిళలు తీవ్ర మనోవేధనను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆమె గుర్తు చేశారు.

సుప్రీం తీర్పుపై ప్రధాని హర్షం

ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు చరిత్రాత్మకమైనదని ఆయన కొనియాడారు. ఈ నిర్ణయం ముస్లిం మహిళలకు సమానత్వాన్ని తీసుకొస్తుందని, మహిళా సాధికారతకు ఇదో నిదర్శనమని ఆయన ట్వీట్ చేశారు. ప్రధానితో పాటు అనేక రాజకీయ పార్టీలు కూడా ఈ తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశాయి. బిజెపి, కాంగ్రెస్ తీర్పును స్వాగతించాయి. ఈ తీర్పు లింగ సమానత్వానికి మరో ముందడుగుగా అభివర్ణించాయి. కేంద్ర మంత్రి మేనకా గాంధీ, బిజెపి ఎంపి సుబ్రమణ్యస్వామి, బిజెపి ప్రతినిధి అమన్ సిన్హ, మధ్యప్రదేశ్ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ తదితరులు ఈ తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి, ముస్లిం మహిళల సురక్షితమైన భవితకు పునాదులు వేయాలని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ముస్లిం మత పెద్దలకు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. సుప్రీం తీర్పు చారిత్రాత్మకమని యుపి ప్రభుత్వం ఒక ప్రకటనలో కొనియాడింది.

గొప్ప విద్యల కేంద్రంగా తీర్చిదిద్దాలి

● బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ సముదాయ భవనానికి శంకుస్థాపన చేసిన సి.యం కెసిఆర్ ● మరో ఐదెకరాలు, రూ.10 కోట్లు మంజూరు ● ఒకటిన్నర శతాబ్దం క్రితం వికసించిన కుసుమం రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: ఒకటిన్నర శతాబ్దం క్రితం వికసించిన కుసుమం రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి అని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కొనియాడారు. ఎడ్యుకేషనల్ సొసైటీకి ఇప్పటికే ప్రభుత్వం కేటాయించిన పదెకరాలు, రూ.10 కోట్లకు తోడు తాజాగా మరో ఐదెకరాల స్థలం మంజూరు చేస్తున్నట్లు సిఎం ప్రకటించారు. ఆ స్థలాన్ని గొప్ప విద్యల కేంద్రంగా తీర్చిదిద్దాలని, కొత్త కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. నారాయణగూడలోని బాలికల హాస్టల్ విస్తరణ కోసం పక్కనే ఉన్న ఐపిఎం ఖాళీ స్థలాన్ని కేటాయిస్తున్నామని సిఎం చెప్పారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ సముదాయానికి కెసిఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం సిఎం కెసిఆర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఎంతో మంది మహానుభావులు ఎన్నో గొప్ప పనులు చేసినా, సమైక్య రాష్ట్రంలో వారి ప్రస్తావన ఎక్కడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రాష్ట్రం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే పోలీస్ అకాడమీకి ఆయన పేరు పెట్టినట్లు చెప్పారు. వెంకట్రామిరెడ్డి పేదలు, అవకాశాలు లేని వారి కోసం ఆలోచించారని, 14 విద్యాసంస్థలు ఏర్పాటు చేశారని కొనియాడారు. ఆయన స్థాపించిన పాఠశాలలో అందరికీ విద్యను అందించి విద్యావ్యాప్తికి దన్నుగా నిలిచారన్నారన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి ఆనాడు రాజా బహద్దూర్ గురించి పుస్తకం రాసి ఆయన గొప్పతనం గురించి భావితరాలకు తెలియజేశారన్నారు. పుట్టుకతోనే శ్రీమంతుడు అయిన రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి చిన్నప్పుడే తల్లి చనిపోయినా, కష్టపడి చదువుకున్నారన్నారు. అంతేకాకుండా నిజాం కాలంలో కొత్వాల్‌గా పనిచేస్తూనే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం ఆలోచించిన మహామనిషని, నిజాం రాజు వద్ద ఉద్యోగంలో ఉన్నా ఏ మాత్రం బెదరకుండా తెలుగు మీడియం పాఠశాలలు స్థాపించి విద్యావ్యాప్తికి కృషిచేశారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రముఖుల పేర్లు చరిత్రలో నిలిచిపోయేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ రోజు తాను చేసిన పని చంద్రునికో నూలుపోగు లాంటిదని, ఇది తెలంగాణ చారిత్రక సంపదను పునరుద్దరించే అంశమని అన్నారు. నాటి ధర్మారెడ్డి కాలనీ నేడు కెపిహెచ్‌బిగా మారిందని, దాని సృష్టికర్తను సమైక్య రాష్ట్రంలో ఏనాడూ గుర్తించలేదన్నారు. దళితుల కోసం బాగ్యరెడ్డి వర్మ ఎంతో కృషిచేశారని ప్రశంసించారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ మహానుభావుల పేర్లు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ కొత్వాల్‌గా 14 ఏళ్లు నిజాం హయాంలో పనిచేశారని, రెడ్డి హాస్టల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒకేసారి ప్రారంభించారని అన్నారు. ఒకేసారి శతాబ్ధి ఉత్సవాలు నిర్వహించుకుంటున్న సందర్భమన్నారు. 1930లో రాజాబహద్దూర్ బిరుదును నిజాం ప్రభుత్వం ఇచ్చిందని, 1931లో ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ బిరుదును లండన్ రాజు వెంకట్రామిరెడ్డికి ఇచ్చిందని వివరించారు. అన్ని వర్గాలకు విద్య అందాలని, చదువుకోడానికి వచ్చే వారికి వసతి సమస్య ఉందని గుర్తించి, హాస్టళ్లు, విద్యా సంస్థల ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వాలను స్థలం కోరినా ఎవ్వరూ స్పందించలేదని, కెసిఆర్ ఉదారంగా స్పందించారన్నారు. అలియాబాద్‌లో రెడ్డి సంఘం సమావేశం సందర్భంగా సిఎం కెసిఆర్‌తో ప్రస్తావించానని గుర్తుచేశారు. కెసిఆర్ అన్ని కులాలు, వర్గాలను కలుపుకుని పోతారని, ఎవ్వరికీ సందేహాలు వద్దని స్పష్టం చేశారు. రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎడ్ల రఘుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎంఎల్‌ఎ ప్రకాష్ గౌడ్ ప్రసంగించారు. తొలుత వెంకటరామారెడ్డి చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం కాగా, రఘుపతిరెడ్డి సొసైటీ నివేదికను చదివి వినిపించగా, ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ, మంత్రులు టి.హరీశ్‌రావు, కె.తారకరామారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి, జి.జగదీష్ రెడ్డి, ఎంపిలు జితేందర్ రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సి.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షేక్‌లకు త్వరలో షాక్

(మొదటిపేజీ తరువాయి)

చట్టాలకు వ్యతిరేకంగా జరిగే వ్యవస్థీకృతమే వ్యభిచారమే. అరబ్ గల్ఫ్ దేశాల నుండి చెందిన వారు ఇక్కడి ముస్లిం బాలికలను వివాహాలు చేసుకుంటున్న అక్కడి దేశాలు భారతీయ ముస్లిం బాలురను అక్కడి అమ్మాయిలను చేసుకునేందుకు మాత్రం అనుమతించడం లేదు. ఈ మొత్తం వ్యవహారంలో బ్రోకర్లకుక లక్షలాది రూపాయలు అప్పజెప్పి కథను ముందుకు నడుపుతున్నారు. ఇలాంటి వివాహాలకు పాతనగరంలోని పేద ముస్లిం కుటుంబాలు ఎరలో చిక్కుకుంటున్నాయి. ఇందుకోసం బ్రోకర్లు, తల్లిదండ్రులను, ఇలాంటి పనులు చేసే ఖాజీలను తమ ఉచ్చులోకి లాక్కుంటున్నారు. చాలా సందర్భాల్లో వివాహ వయస్సు రాకపోయినా అమ్మాయిల వయస్సును 18 సంవత్సరాలుగా చూపిస్తున్నారు. వ్యభిచార గృహాల్లో కాకుండా సురక్షిత గృహాల్లో నిరంతరాయ వ్యభిచారం చేసేలా బ్రోకర్లు పాతనగరంలో పని చేస్తున్నారు. నిఖా చేసుకున్న తర్వాత ఆ బాలికను పెళ్లి చేసుకున్న వృద్ధుని దేశంలోకి ప్రవేశించగానే దౌత్య కార్యాలయంలో నిఖా పత్రాలను సమర్పిస్తారు. ఆ తర్వాత అనుకున్న రోజుల తర్వాత ఆ అమ్మాయిలను ఒంటరిగా వదిలేస్తున్నారు. దీనితో ఆ అమ్మాయిలు పరాయి దేశంలో అనేక మంది చేతిలో లైంగిక బానిసలు, నీచపు పని చేసే కూలీలుగా మారుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో మానవ అక్రమ రవాణా జరుగుతుందని, మానవ హక్కులు ఉల్లంఘించబడుతున్నాయి. యువతుల జీవితాలను ధ్వంసం చేస్తున్న ఈ విధానానికి ఇస్లాంలోనూ, లౌకిక చట్టాల్లోనూ కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. ఐపిసి 196, సంబంధిత నిబంధనల్లో తప్పుడు సాక్ష్యాలు సమర్పించినందుకు ఏడేళ్ల శిక్ష విధించే అవకాశముంది. ఇలాంటి వివాహాల్లో చాలా సందర్భాల్లో ఖాజీలు అంతా తెలిసి ఉద్దేశపూర్వకంగా చేస్తుంటారు. సాధారణంగా ఇలాంటి వివాహాలు చేసుకునేందుకు వచ్చే వారు పర్యాటక వీసా లేదా బంధువులను కలుసుకునేందుకు వచ్చే వీసా పేరుతో వస్తున్నారు. కేవలం వ్యభిచార కాంక్షతోనే మన దేశంలోకి వస్తున్న వీరికి అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాల్సిన అవసరముంది. ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్న ఖాజీలను తక్షణమే అనర్హులుగా ప్రకటించాలి. వీటికి అడ్డుకట్ట పడేందుకు తక్షణం ఒక చట్టం చేయాలని మైనారిటీ శాఖ సూచించింది. అది ఆలస్యమయ్యే అవకాశమున్నందున అప్పటి వరకు వర్తించేలా ఆర్డినెన్స్ తీసుకురావాలని సూచించింది.

ఇలాంటి వివాహాలు చేసుకునేందుకు మన దేశానికి వస్తున్న వారిలో ఏ ఒక్కరు కూడా తమ వీసాలో వివాహం నిమిత్తం వస్తున్నట్లు పేర్కొనడం లేదు. వివాహం చేసుకుని తిరిగి వెళుతున్నారు. తప్పనిసరిగా వీసాలో వివాహం కోసమని రాసేలా నిబంధనలు రూపొందించాల్సిన అవసరముంది. తమ దేశం నుండి మన దేశపు యువతిని వివాహం చేసుకునేందుకు నిరభ్యంతర పత్రం సమర్పించాలి. ఈ పత్రంలో వివాహం చేసుకునే అమ్మాయి వైద్య చికిత్స, ఆమె క్షేమం కోరే సహేతుక నిబంధనలు ఉండాలి. అతను అప్పటికే వివాహితుడా ? కాదా? , ఒక వేళ వివాహితుడైతే మళ్లీ వివాహం చేసుకోవడానికి కారణాలను పేర్కొనాలి.

వివాహానంతరం మొదటి సంవత్సరం ప్రతి మూడు నెలలకు ఒకసారి, తర్వాత రెండు సంవత్సరాలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి, తదుపరి పది సంవత్సరాల వరకు సంవత్సరానికి ఒకసారి ఆ అమ్మాయిని ఇండియన్ కాన్సులర్ అధికారుల ఎదుట హాజరు పరచాలి. వధువు పేరిట ఉన్న ఆస్తులను బహిర్గతం చేయాలి. వరునికి, వధువుకు మధ్య వయస్సు 10 సంవత్సరాలకు మించకూడదనే నిబంధన ఉండాలి. అమ్మాయి అనుమతి లేకుండా అతని ఆస్తులు బదిలీ చేయకూడదు. ఆమెను ఆ దేశపు వివాహిత మహిళతో సమానమైన మహిళగా గుర్తించాలి. వివాహం చేసుకునే ముందు నగర పోలీస్ కమిషనర్ లేదా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అనుమతి తీసుకోవాలి. ఎస్.ఐ స్థాయికి తగ్గని పోలీస్ అధికారి చేత దర్యాప్తు చేయించి నిర్ధారించుకున్న తర్వాత పోలీసులు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో వివాహం జరగాలి. రూ.10 లక్షలను అమ్మాయి పేరిట డిపాజిట్ చేయాలని మైనారిటీ శాఖ నివేదించింది.

పక్కాగా పన్నుల వసూలు

రెండు శతాబ్దాల కిందటి గాంధారి రాగి శాసనం లభ్యం

మంచిర్యాల దగ్గరి గాంధారి కోటలో ఉన్న శిలా శాసనాన్ని అధ్యయనం చేస్తున్న సమయంలో సీనియర్ మిత్రులు శ్రీ సిడాం అర్జుగారు గాంధారి ప్రస్తావన ఉన్న ఒక రాగి శాసనం కూడా తమ గోండు గిరిజనుల్లో ఒకరి వద్ద ఉన్నదని, వారి చేత దాని ప్రతిని నాకిప్పించారు. ఆ ప్రతి పాఠంలో నిజాం రాజుల కాలంలో ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో జీవిస్తున్న గోండ్ తదితర గిరిజన ప్రాంతాల పాలన ఉండేదో తెలిపే వివరాలున్నాయి.

– ద్యావనపల్లి సత్యనారాయణ

క్రీ.శ.1724లో తెలంగాణాలో అసఫ్‌జాహీ(నిజాం)ల పాలన ఏర్పాటైన వంద సంవత్సరాలకు...అంటే 1824లో గోదావరి ఉత్తర తీరాన ఉన్న మైదాన ప్రాంతపు వెలమ దొరలకు నిజాం సర్‌దేశ్‌ముఖ్ అనే సామంత/అధికార పదదవులనీయగా, ఆ దొరలు గిరిజన ప్రాంతాల నుంచి పన్నులు వసూలు చేయడానికి స్థానిక గోండు మొకాశీలను నియమించుకున్నారని మంచిర్యాల ప్రాంతంలో కొత్తగా లభ్యమైన రాగి సన్నదు తెలుపుతున్నది.


ఈ నేపథ్యంలో వెంకట ముత్యంరావు, వెంకట జగన్నాథరావు, వెంకట రామారావు అనే సర్‌దేశ్‌ముఖ్‌లు కోవ బాబురావు, కోవ సోముజు అనే గోండ్ మొకాశీలకు ముత్యంపల్లి నుండి క్రీ.శ.1824లో గాంధారి తాలూకా మొకాశీ బాపతు హక్కులు నిర్ణయించి ఇచ్చారు. కాని ఆ సన్నదు పోయిందని, దయతో మళ్ళీ ఇప్పించవలసిందని గోండ్ మొకాశీలు మనవి చేసుకున్నందున, వారు సర్కారు తాబెదారి బరాబరు చేస్తున్నారు. కాబట్టి క్రీ.శ.1871లో మళ్ళీ ఈ రాగి సన్నదు ఇచ్చారు. ఈ సన్నదులో గోండుల ఇళ్ళల్లో దేనికి ఎంత పన్ను/శిస్తు వసూలు చేసి సర్‌దేశ్‌ముఖ్‌లకు చెల్లించాలో కింది విధంగా స్పష్టంగా పేర్కొన్నారు.

- గోండ్ పెండ్లికి రూపాయి పావలా పైసలు
- పాటుకి (వ్యవసాయదారుకు) అర్ధబ్యాడ(62పైసలు)
- దసరా బాపతు పెద్ద ఊరికి రూపాయి, చిన్న ఊరికి 50 పై.
- రబీ పునాస ఒక అరక కలిగి ఐదు బిగాలు దున్నితే 50పైసలు.
- కట్టె ఇండ్లు –పెద్ద ఇంటికి అడ్డెడు ధాన్యం, చిన్నదైతే మానెడు.

ఈ విధంగా పన్నులు వసూలు చేస్తూ వసువసు చేయకుండా పాత విశ్వాసం నిలుపుకుంటూ పన్నులు సరిగా వసూలు చేసి సమయానికి చెల్లించాలంటూ, తద్వారా గాంధారి తాలూకా గిరిజనులు, మొకాశీలు పుత్రపౌత్రాభివృద్ధిగా బతకాలంటూ సర్‌దేశ్‌ముఖ్‌లు ఆజ్ఞలు, ఆశీస్సులు జారీ చేసినట్లు ఉంది.

ఈ సన్నదును మరోసారి సర్‌దేశ్‌ముఖ్‌ల వద్దకు తీసుకువెళ్ళి క్రీ.శ.1897 లో ఉర్దూలో ఆజ్ఞలు తీసుకున్నట్లు సన్నదు ప్రారంభ వాక్యాలు తెలుపుతున్నాయి. ఇలా ఈ సన్నదును 1824 నుంచి 1897 మధ్య గోండ్ కోవ మొకాశీలు మూడుసార్లు ఆజ్ఞలు పొందారు. ఈ సన్నదులో పేర్కొనబడిన కోవ బాబురావు మనుమడు కోవ బాబురావు (నాగ సముద్రం గ్రా॥) దగ్గరే ఇప్పటికీ ఈ సన్నదుతో పాటు ఆ కాలపు రక్షక ఆయుధాలు, కాగడాలు ఉన్నాయి.

ఈ రాగి సన్నదులో 200 ఏండ్ల కిందటి అటవీ/గిరిజన ప్రాంతాల పాలనతోపాటు, వెలమ దొరల అధికారం, ఆనాటి భాషా వైవిధ్యం(తెలుగు, ఉర్దూ, గోండ్) తదితర వివరాలు తెలుస్తాయి. కాబట్టి పలు రకాల పరిశోధకులకు ఈ సన్నదు ఒక ఆసక్తికర అంశం.



కనగల్‌లో జంట హత్యలు

భూతగాదాలే కారణం

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: కనగల్ మండలం కురంపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు హత్యకు గురయ్యారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో దాసరి అన్నమయ్య(24), దాసరి ఆంజనేయులు(22) అన్నదమ్ములిద్దరూ వ్యవసాయ బావి వద్దకు వెళ్ళగా దుండగులు గొడ్డళ్ళతో నరికి హత్య చేశారు. జంట హత్యలకు భూవివాదలే కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మృతుని తండ్రి దాసరి యాదయ్యది చండూరు మండలం నెర్మట గ్రామం. అతని భార్యకు ఆమె తల్లిదండ్రులు కనగల్ మండలం కురంపల్లిలో 2 ఎకరాల భూమి ఇవ్వగా ఆ భూమిని సాగుచేసుకునేందుకు గత ఎనిమిదేళ్ళ క్రితం దాసరి యాదయ్య తన భార్య ఇద్దరు కుమారులు అన్నమయ్య, ఆంజనేయులుతో కలిసి నెర్మట నుండి కురంపల్లికి మకాం మార్చాడు. యాదయ్య బంధువుల్లో ఒకరైన దోతి అక్కలయ్య గత కొన్నేళ్ల క్రితం మిర్యాలగూడకు చెందిన మహిళను కులాంతర వివాహం చేసుకున్నాడు. వారికి ఒక పాప పుట్టిన తరువాత కుటుంబ కలహాలతో అక్కలయ్యను విడిచి వెళ్లింది. ఇటీవల విడాకుల కోసం కోర్టు నుండి నోటీసులు పంపినట్లు తెలిసింది. అక్కలయ్య భార్య కురంపల్లిలో కొనుగోలు చేసిన రెండెకరాల భూమిని దాసరి యాదయ్య అక్కలయ్యకు తెలియకుండా కొనుగోలు చేశాడు. ఈ విషయం తెలిసిన అక్కలయ్య నా భార్య భూమిని ఎందుకు కొనుగోలు చేశారని గొడవపడ్డాడు. అయినప్పటికీ యాదయ్య కుటుంబీకులు వినలేదు. దీంతో విడాకులు తీసుకోకుండానే నా భార్యకు చెందిన భూమిని యాదయ్య కుటుంబ సభ్యులు కొనుగోలు చేయడం చెల్లదని అక్కలయ్య కోర్టును ఆశ్రయించాడు. గత రెండు మూడు నెలల క్రితం భార్య భూమిపై అక్కలయ్యకు పూర్తి హక్కులు ఉన్నాయని కోర్టు తీర్పునిచ్చింది. దీంతో భూమిని సాగుచేసుకోవడానికి వెళ్లిన అక్కలయ్యపై యాదయ్య, అతని కుమారుడు దాడి చేసి కొట్టడంతో అక్కలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు. కాగా గత నెలలో బెయిల్‌పై విడుదలై వచ్చిన యాదయ్య అతని కుమారులు తిరిగి భూమిని సాగుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన అన్నమయ్య, ఆంజనేయులు హత్యకు గురయ్యారు. అక్కలయ్య మరియు అతని కుటుంబ సభ్యులే ఈ హత్యకు పాల్పడినట్లు యాదయ్య కనగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చండూరు సిఐ రమేష్ ఆధ్వర్యంలో కనగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

మన తెలంగాణ/హైదరాబాద్/నాచారం: మల్లాపూర్‌లోని ప్రదాన రహదారిలో బైక్‌పై వెళుతున్న వారిని డిసిఎం వ్యాన్ వెనకాల నుంచి అతి వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాచారం ఎస్సై రామయ్య తెలిపిన వివరాల ప్రకారం... మల్లాపూర్ డివిజన్ లోని నాగలక్ష్మి నగర్‌లో నివాసముండే అభిషేక్ (19), గబ్బిలాల పేటకు చెందిన ఆకాశ్ (12) ఇద్దరు కలిసి మల్లాపూర్ నుంచి ఎన్ఎఫ్‌సి బ్రిడ్జి వైపుగా బైక్‌పై వెళుతున్న సమయంలో వాగ్దేవి పాఠశాల వద్ద అతి వేగంగా వచ్చిన (ఎపి36 టిఎ 4410) నెంబరు గల డిసిఎం బైక్‌ను ఢీ కొట్టడంతో ఆకాశ్, అభిషేక్‌లు తలలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాచారం పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి డిసిఎం వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు నాచారం ఎస్సై రామయ్య తెలిపారు.

ఇష్టారాజ్యం పోవాలి

(మొదటిపేజీ తరువాయి)

చటర్జీ, తెలంగాణ సాగునీటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ఇఎన్‌సి మురళీధర్, ఎపి జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్, ఇఎన్‌సి వెంకటేశ్వరరావు, ఇరు రాష్ట్రాల కృష్ణా నదీ ప్రాజెక్టులు, అంతర్రాష్ట వ్యవహారాల చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు. నీటి లోటు ఉన్న సమయంలో దామాషా పద్దతిలో నీటిని వినియోగించుకునేలా చూడాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అప్పటికప్పుడే ఒక తీర్మానం ప్రతిపాదించగా బోర్డు చైర్మన్ అంగీకరించారు. దీనిపై బోర్డు తరపున కేంద్ర జలసంఘానికి, జలవనరుల శాఖకు, కర్ణాటక ప్రభుత్వానికి లేఖ రాస్తామని చైర్మన్ స్పష్టం చేశారు. దీంతో పాటు కేంద్రం ఏర్పాటు చేసిన ఎకె బజాజ్ కమిటీకి కూడా లేఖ రాయాలని బోర్డు సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. తాగునీటి అవసరాల కోసం తక్షణమే దిగువకు నీటి విడుదల చేసేలా కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించారు. మరోవైపు 512, 299 నిష్పత్తిలో నీటిని పంచుకోవడంపై తొలుత ఆంధ్రప్రదేశ్ వ్యతిరేకించి, తర్వాత ఒప్పుకున్నట్లు సమాచారం. ఇదేవిధంగా చెరువుల్లో నీటి వినియోగంపై శాస్త్రబద్ధంగా ఒక ఫార్ములా రూపొందించి, లెక్క తేల్చాలని అంగీకారానికి వచ్చినట్లు తెలిసింది. రెండో దశ టెలీమెట్రీ పాయింట్ల ఏర్పాటులో తెలంగాణ ప్రతిపాదించిన పాయింట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకించింది. దీనిపై హైదరాబాద్‌లో 18, 19న సమావేశం నిర్వహించి, ఓ అంగీకారానికి రావాలని బోర్డు ప్రతిపాదించింది. ప్రాజెక్టుల డిపిఆర్‌లు రెండు రాష్ట్రాలు ఇవ్వాలని బోర్డు కోరింది.



ఉపాధి హామీని ఎత్తివేయడానికి ప్రభుత్వాల కుట్ర

మన తెలంగాణ/కరీంనగర్ టౌన్ : గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధీ హామీ పథకం ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎత్తివేయాలని చూస్తూ కుట్ర పన్నుతున్నాయని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి. సంజీవ రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో కళాభారతిలో ఫీల్డ్ అసిస్టెంట్స్ , సిబ్బంది, అగ్రికల్చర్ వర్కర్స్ సమస్యలపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వి. గణేశ్ బాబు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామి పథకం చట్టం తీసుకు వచ్చి 11 సంవత్సరాలు అయిందన్నారు. నాటి నుండి నేటి వరకు వారికి ఉద్యోగ భద్రత లేక పోవడం బాధాకరమన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు కనీస వేతనం 24 వేలు చెల్లించి , వారికి ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి 8 గంటల పని కల్పించాలన్నారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబర్ సలీం మాట్లాడుతూ కార్మికుల కోసం గత 60 సంవత్సరాల క్రితం ఐఎన్‌టియుసి ఆవిర్భావం జరిగిందన్నారు. సమావేశంలో ఐఎన్‌టియుసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వి. గణేశ్ బాబు, మాజీ ఎమ్మెల్యే అరవింద్ రెడ్డి, నర్సింగ్, యాదగిరి, శ్రీనివాస్, మొగిలి, లావణ్య, పవన్, చంద్రశేఖర్, రాష్ట్ర , వివిధ జిల్లాల బాధ్యులు నాయకులు పాల్గొన్నారు.

మాజీమంత్రి బొచ్చు సమ్మయ్యకు అంతిమ వీడ్కోలు



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న చల్లాధర్మారెడ్డి

మన తెలంగాణ/పరకాల : మాజీమంత్రి బొచ్చు సమ్మయ్య అంత్యక్రియలు ఆయన స్వగ్రామం పరకాలలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ అంత్యక్రియలకు హాజరైన పరకాల ఎమ్మెల్యే చల్లాధర్మారెడ్డి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ అంత్యక్రియల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య, గండ్ర వెంకట రమణారెడ్డి, ఆరెల్లి మోహన్, కొండేటి శ్రీధర్, ఇనుగాల వెంకట్రామిరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరంగి సంతోష్‌కుమార్, వరంగల్ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, పరకాల ఏసిపి సుదీంద్ర, సిఐ జానీ నర్సింహులు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, పరకాల వాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గిరిజన రైతు మృతి

మన తెలంగాణ/మంచాల : ట్రాన్స్‌ఫార్మర్ ఫీజును సరి చేయడానికి వెళ్లి ఓ గిరిజన రైతు విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందిన సంఘటన మంచాల మండల పరిధిలోని లోయపల్లిలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే లోయపల్లికి చెందిన కొర్ర ధర్మ(60) తన పొలం పక్కన ఉన్న మరో రైతుకు చెందిన వ్యవసాయ మోటర్ పని చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫీజు పోయిందని వెళ్లి అక్కడ వైరు తెగిపడి ఉండడంతో దానిని గమనించకుండా వెళ్లి సరి చేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. కాగా, రైతు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు కుటుంబాన్ని ఆయనతోపాటు టిడిపి జిల్లా నాయకులు చీరాల రమేష్‌తో పాటు బద్రీనాథ్,ఐలేష్ పరామర్శించి సంతాపాన్ని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/కారేపల్లి : చేసిన అప్పులు తీర్చలేక వ్యవసాయ బావిలోపడి ఓ రైతన్న ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గిద్దవారిగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. డేగల బాబయ్య (65) తనకున్న నాలుగెకరాలలో గతేడాది మిర్చిసాగు చేశాడు. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలేక రూ. నాలుగు లక్షలు అప్పు చేశాడు. నెలనెలా వడ్డీ కట్టలేక చావే మార్గం అనుకొని తన వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పంటకోసం తీసుకొచ్చిన అప్పుతో పాటు బ్యాంకులలో ఎనభైవేల రూపాయులు అప్పు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని సిపిఐ జిల్లా, మండల కార్యదర్శి వెల్పుల ధన్‌రాజ్, తాత వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బోరు బావిలో నీరు రాలేదని..

మన తెలంగాణ/డిచ్‌పల్లి (నిజామాబాద్ జిల్లా): దూస్‌గాం గ్రామంలో రాయ నడ్పిగంగారాం(50) మంగళవారం సాయంత్రం మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కట్ట నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం తెలిపిన వివరాల ప్రకారం... రైతు నడ్పిగంగారాం తన పోలంలో ఇప్పటి వరకు మూడు బోరుబావులు తవ్వించగా, ఒక్క బోరుబావిలో చుక్క నీరు రాకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సాయవ్వ, ఇద్దరు కుమారులు , కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుళికలు చల్లుతూ మూర్ఛతో..

మన తెలంగాణ/ బయ్యారం : వరంగల్ జిల్లా బయ్యారం మండలకేంద్రంలోని రైతు విషపు గుళికలు, యూరియా తమ పొలంలో చల్లడానికి వెళ్లి తమ పొలంలోనే మృత్యువాత పడ్డాడు. మంగళవారం కొత్త బిక్షమయ్య(53) తమ పొలానికి చీడ పీడ రాకుండా ముందు జా గ్రత్తగా నాటు వేసిన వరి పొలానికి మొదటి దఫా యూరియాలో 20కెజిల గుళికలు కలిపి పొలానికి చల్లే సమయంలో సగం పొలానికి మందు చల్లి మూర్ఛతో క్రిందపడి చనిపోయినట్లు వారు తెలిపారు. మృతుడు బిక్షమయ్యకు భార్యయదమ్మ కూతురు సుకన్య, కుమారుడు నరేష్ ఉన్నట్లు వారు తెలిపారు , ఎప్పుడు ఉల్లాసంగా ఉండే బిక్షమయ్య మృత్యువాత పడటంతో మండలంలోని రైతులు వారి కుటుంబాన్ని పరామర్శించారు.

తాండ్ర ఆకులు తిని 40 మేకలు మృతి

మన తెలంగాణ/సిరికొండ : ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో ఒక తాండ్రచెట్టు ఆకులు తిని 40 మేకలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం గంగుబాయి, సక్కుబాయి, భూదేవిలకు ప్రభుత్వం మూడేళ్ల క్రితం 10 చొప్పున మేకలు అందజేసింది. మృతి చెందిన వాటిలో సక్కుబాయికి చెందిన 17 మేకలు, గంగుబాయి 5, భూదేవి 5, దేవ్ రావ్ 9, మన్కు 2, తుకారంకు చెందిన 2 మేకలు ఉన్నాయి. విలువ రూ.4 లక్షలు ఉంటుందని స్థానిక ప్రజలు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

ఎంబిసి జాబితాలో సగర కులస్తులు

బిసి కమిషన్‌కు రాష్ట్ర సగర (ఉప్పర) సంఘం వినతి

మన తెలంగాణ/హైదరాబాద్: విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన సగర (ఉప్పర) కులస్తులను ఎంబిసి జాబితాలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర సగర (ఉప్పర) సంఘం బిసి కమిషన్‌ను విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో మంగళవారం నాడు కమిషన్ ఛైర్మన్ బి.ఎస్.రాములు, సభ్యులు డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డా. ఆంజనేయగౌడ్‌లను కలిసి మంగళవారం ఆ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణాలను బహుళజాతి కంపెనీలు, ఆధునిక యంత్రాలను ఉపయోగించి తమకు వృత్తిలేకుండా చేశాయని సంఘం అధ్యక్షులు బంగారు నర్సింహ సగర, ప్రధాన కార్యదర్శి ఉప్పరి శేఖర సగర ఆవేదన వ్యక్తం చేశారు సంఘం నాయకులు కుసుమ సగర, ఎం.సువర్ణ సగర, లక్ష్మి సగర, హనుమంత్ సగర, రామచంద్రయ్య సగర తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

- బస్తాలకు తూట్లు పెట్టి సబ్సిడీ బియ్యం లూటీ
- ఒక్కో బ్యాగ్‌లో నుంచి 3 కిలోల బియ్యం మాయం



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో: భారత ఆహార సంస్థ(ఎస్‌సిఐ) గోదాంలు, మండల నిల్వ కేంద్రాలు (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచి రేషన్‌షాపులకు సరఫరా అవుతున్న సబ్సిడీ బియ్యం లూటీ అవుతున్నట్లు సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు వినియోగదారులకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని డీలర్లు పక్కదారి పట్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న విషయం తెలిసిందే. కాని కాంట్రాక్టర్లు, కూలీలు, కొంతమంది పౌరసరఫరాల శాఖ అధికారులు చడీ చప్పుడు కాకుండా గోదాముల్లో నిల్వ చేసిన బియ్యం బస్తాలకు తూట్లు పొడుస్తూ అందులోని బియ్యాన్ని స్వాహా చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రేషన్‌షాపులకు సరఫరా అయ్యే 50 కిలోల బియ్యం బస్తాలకు తూట్లు పొడుస్తూ ఒక్క బస్తా నుంచి రెండు నుంచి మూడు కిలోల మేర బియ్యాన్ని లూటీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లోని 12 సర్కిళ్ల పరుధుల్లో సుమారు 13 లక్షలకు పైగా ఆహార భద్రతా కార్డులున్నాయి. ఈ కార్డుదారులకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 1545 రేషన్‌షాపుల ద్వారా బియ్యం, సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఒక్కో షాపుకి అధికారులు ప్రతినెల వంద క్వింటాళ్ల బియ్యాన్ని కేటాయిస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో దుకాణానికి 50కిలోల బ్యాగుల చొప్పున 200 బ్యాగులు సరఫరా అవుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి బ్యాగులో 50 కిలోల బియ్యం ఉండాలి. కానీ దుకాణాలకు చేరుతున్న ఒక్కోబ్యాగ్‌లో 2 కిలోల నుంచి 3 కిలోల వరకు బియ్యం తక్కువగా ఉంటున్నాయి.

గోదాముల్లోనే బియ్యం తస్కరణ

గోదాముల్లోనే బస్తాలకు రంధ్రాలు పెట్టి బియ్యం తస్కరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎఫ్‌సిఐ గోదాంల నుంచి రేషన్ బియ్యాన్ని గ్రేటర్‌లోని మండల నిల్వ కేంద్రాలు(ఎంఎల్ఎస్) పాయింట్లకు చేరుస్తారు. ఎఫ్‌సిఐ గోదాముల్లో నిల్వ ఉంచినప్పుడు రవాణా చేసే క్రమంలో కొంతమంది కూలీలు బస్తాలకు రంధ్రాలు పెట్టి కొంత బియ్యాన్ని తస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి కొంత మంది కాంట్రాక్టర్లు, అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విధంగా అక్రమం గా సేకరించిన సబ్సిడీ బియ్యా న్ని అందరు కలిసి బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నట్లు తెలిసింది. ఎంఎల్ఎస్ పాయింట్లలో సరిగ్గా తూకం వేయకుండా నేరుగా వాహనాల్లోకి లోడ్ చేస్తున్నారని పలువురు డీలర్లు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంఎంఎస్ఎల్ పాయింట్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ కాంటాలపై తూకం వేసిన తరువాతే బియ్యం బస్తాలను వాహనాల్లో ఎక్కించి రేషన్‌షాపులకు తరలించాల్సి ఉందని డీలర్లు పేర్కొంటున్నారు. కాని ఇక్కడ ఉన్న ఎలక్ట్రానిక్ కాంటాలు పాడైపోయి నిరుపయోగంగా మారినట్లు వారు ఆరోపిస్తున్నారు. బరువైన బస్తాలు తూకం వేసినప్పుడు ఎలక్ట్రానిక్ కాంటాలకు స్ప్రింగ్‌లు పోవడంతో మూలన పడ్డాయన్నారు. కాని వాటి స్థానంలో అధికారులు కొత్త కాంటాలను ఏర్పాటు చేయడం లేదన్నారు. ఇటీవల ఎస్‌సిఐ గోదాంలు, ఎంఎల్ఎస్ పాయింట్ల కేంద్రంగా జరుగుతున్న బియ్యంపై లూటీపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ దృష్టికి తీసుకుని వెళ్లినట్లు డీలర్లు గుర్తు చేశారు. ప్రతి బస్తాపై 50 కిలోలుగా ముద్రించి ఉంటుందని తీరా తూకం వేస్తే ఒక్కో బస్తాలో 2 నుంచి 3 కిలోల వరకు బియ్యం తక్కువ వస్తున్నాయని వారు వాపోతున్నారు.

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మన తెలంగాణ/తల్లాడ (ఖమ్మం జిల్లా) : అక్రమంగా 100 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్న సంఘటన తల్లాడలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం నుంచి కాకినాడకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని తల్లాడ ఎస్సై మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి లారిని స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా లారీ పట్టుబడింది. లారీ డ్రైవర్ శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న గ్రామస్తులు

మన తెలంగాణ/భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూర్ గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లనుగ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం మెట్టప్రాంతం కావడంతో రాష్ట్రం మొత్తం భారీ వర్షాలు కురిసి అతి వృష్టి సంభవించినా భీవదేవరపల్లి మండలం చుట్టు పక్కల వివిధ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో కరువు ఉంటుందని చెప్పవచ్చు. అలాంటి కరువు ప్రాంతమైన భీమదేవర పల్లి మండలంలో కొందరు దళారులు తమ స్వార్థంకోసం ఇసుక మాఫియా దందాను కొనసాగిస్తున్నారు. మంగళవారం ఉదయం మూడు ఇసుక ట్రాక్టర్లు ముల్కనూర్ లో ఇసుకను డంపుచేసేందుకు యత్నిస్తుండగా పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు

మన తెలంగాణ/హైదరాబాద్: కాంట్రాక్ట్ జూనియర్ అధ్యాపకుల జీతాలను విడుదల చేసినందుకు కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు జి.రమణారెడ్డి, కె.సురేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాపు నాలుగు వేల మంది కాంట్రాక్ట్, గెస్ట్ అధ్యాపకులకు సంబంధించి మూడు నెలల వేతనాలను విడుదల చేసినందుకు వారు సిఎం కెసిఆర్, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టల్ ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన, ధర్నా



మన తెలంగాణ/ మట్టెవాడ : అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు ఈ నెల 16 నుంచి నిరవధికంగా సమ్మెను కొనసాగిస్తున్నారు. ఉద్యోగుల తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వరంగల్ హెడ్ పోస్టాఫీసు ఎదుట అర్ధనగ్న ప్రదర్శనను నిర్వహించారు. వరంగల్ స్టేషన్ రోడ్‌లో రాస్తారోకో చేసి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ ఎఐజిడిఎస్‌యు సూచించిన సవరణలతో సహా జిడిఎస్‌లకు 8గంటల పనికల్పించి సివిల్ సర్వెంట్ హోదాను కల్పించాలని ఖాదర్ డిమాండ్‌చేశారు. ఢిల్లీ క్యాట్ ప్రిన్సిపల్‌బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ తీర్పు ప్రకారం జిడిఎస్‌లకు పెన్షన్ మంజూరు చేయాలని, టార్గెట్ల పేరుతో జిడిఎస్‌లను బలవంతం చేయడం, వేధించడం ఆపివేయాలన్నారు. తపాలాశాఖ ప్రవేశపెట్టిన అనేక స్కీంలను, పనిని వర్క్‌లోడ్‌లోకి తీసుకొని భవిష్యత్‌లో ప్రవేశపెట్టిన పేమెంట్‌బ్యాంక్, కోర్ బ్యాంకింగ్, సోల్యూషన్స్ మొదలైన టెక్నాలజీని పదృష్టిలో పెట్టుకొని అన్నింటిని పనిబారంలోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించే వరకు విధుల్లోకి వెళ్లకుండా నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని ఖాదర్ హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఎ. రవీందర్, కోశాధికారి షాబొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ

- నేడు నారాయణఖేడ్, రేపు మెదక్, శనివారం సిద్దిపేటలో

మన తెలంగాణ/సంగారెడ్డి ప్రతినిధి : తెలంగాణాలో కోటి ఎకరాలకు సాగు నీరందించాలన్న లక్ష్యంతో ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం అందులో కీలక అంశమైన ప్రజాభిప్రాయ సేకరణకు సర్వం సిద్ధం చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో బుధవారం, మెదక్ జిల్లా కేంద్రమైన మెదక్‌లో గురువారం, సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 19వ ప్యాకేజీ కింద సంగారెడ్డి జిల్లాలోని 35,772 ఎకరాలకు ప్రభుత్వం సాగు నీరందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూరు ప్రాజెక్టులోకి నీటిని మళ్లించి దిగువనే ఉన్న చెరువులు,కుంటలు నింపడంతో పాటు కాల్వల ద్వారా పంట పొలాలకు సాగు నీరందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, కల్హేర్, అందోల్, హత్నూర, మెదక్ జిల్లాలోని నర్సాపూర్ ప్రాంతాల్లోని పంట పొలాలకు నీరందించేందుకు అధికారులు కాల్వలను డిజైన్ చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి వద్ద నిర్మించనున్న మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా నీరందించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో కాల్వల నిర్మాణానికి 243 ఎకరాలు అవసరమున్నదని అధికారులు చెబుతున్నారు. 19వ ప్యాకేజీ కింద జిల్లాలోని హత్నూర, అందోల్, కల్హేర్, నారాయణఖేడ్ మండలాల్లోని 38 గ్రామాల్లోని 35,772 ఎకరాలకు సాగు నీరు 25 గ్రామాలకు తాగునీరు అందించనున్నారు. ఇందుకోసం సింగూరు ప్రాజెక్టు సమీపంలోని ముదిమాణిక్యం వద్ద 32 మీటర్ల లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని లింగాపూర్, చిక్‌మద్దూర్, పన్యాల, కొన్యాల, బడంపేట, సిర్పూర్, కాసాల, నవాబుపేట గ్రామాల్లో 12250 ఎకరాలకు, అందోల్ మండలంలోని మాసాన్‌పల్లి, రోళ్లపహాడ్, రామ్‌సాన్‌పల్లి, చింతకుంట, కిచన్నపల్లి, శేరిమల్లారెడ్డిపల్లి, ఎర్రారం, దానంపల్లి, నేరడిగుంట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని 6345 ఎకరాలకు, కల్హేర్ మండలంలోని బాచేపల్లి, రామరెడ్డిపేట, ముంగేపల్లి గ్రామాల్లోని 5218 ఎకరాలకు, నారాయణఖేడ్ మండలంలోని నిజాంపేట, ర్యాలమడుగు, నర్సాపూర్, నెమ్లిమేట్, మాద్వార్, వెంకటాపూర్, జుక్కల్, నారాయణఖేడ్, హన్మంతరావుపేట, లింగాపూర్, ఖానాపూర్, చందాపూర్, అనంతసాగర్, జగన్నాథ్‌పూర్ గ్రామాల్లో 12959 ఎకరాలకు సాగు నీరందించనున్నారు. సాగునీటితో పాటు 25 గ్రామాలకు తాగునీరు కూడా అందించే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. కాల్వల నిర్మాణం తదితర పనులపై ప్రజల నుంచి బుధవారం భిప్రాయాలు సేకరించనున్నారు.

మంచం పట్టిన మానాపురం తండా

- ప్రబలిన విష జ్వరాలు
- ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న గిరిజనులు
- పత్తా లేని ప్రభుత్వ వైద్యం





మ నతెలంగాణా/ తుంగతుర్తి : గిరిజన తండాలకు సరియైన వైద్య సౌకర్యం అందక విషజ్వరాలు సోకి మంచాన పడుతున్నారు. ఇప్పటికే సమారు ఇరవై మందికి పైగా జ్వరాల బారిన పడ్డారు. మండల పరిధిలోని మానాపురం గ్రామానికి చెందిన బాణోత్ బాలి ఇటీవలనే జ్వరం రావడంతో ఖమ్మం అసుపత్రికి తీసుకువెళ్లగా ఇది డెంగ్యూ జ్వరమని వైద్యులు నిర్ధారించడంతో తిరిగి హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించినట్లు బాలి బంధువులు తెలిపారు. ఆసుపత్రిలో సుమారు వారం రోజులుగా బాలికి వైద్యం అందుతోందని జ్వరం ఇపుడిపుడే తగ్గుముఖం పడుతున్నట్లు డాక్టర్లు చెపుతన్నారని బాలి బంధువులు తెలిపారు. ఇప్పటికే సుమారు రెండులక్షల రూ.80 వేలు ఖర్చు అయిందని తెలిపారు. అప్పులు తెచ్చి వైద్యం చేయిస్తున్నామని రెక్కాడితే కాని డొక్కాడని గిరిజనులమైన తమకు ఎక్కడా అప్పుకూడా దొరకక నానా అనవస్థలు పడుతున్నామని తెలిపారు. తండాలో ఇంకా అనేక మంది గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారని తండావాసులు అంటున్నారు. డెంగ్యూలాంటి భయంకరమై విషజ్వరం సోకి గిరిజన మహిళ ఆసుపత్రి పాలైనా నేటికి వైద్యశాఖ ఉన్నతాధికారులెవరూ ఆ తండా వైపు కన్నెత్తి కూడా చూడలేదనే మాట వినవస్తోంది. తండాలో ఇంకా జ్వర బాదితులు రోజు రోజుకూ పెరుగుతూనే వున్నా పట్టించుకొనే నాథుడే లేదని తండా గిరిజనులు అంటున్నారు. సరియైన డ్రైనేజీలు, మురుగు నీటి కాలువలు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపడం వల్లనే తండాలలో ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయని తండావాసులు చెబుతున్నారు. అపరిశుభ్రంగా వుండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయని అంటున్నారు. తండాలో బ్లీచింగ్ కాని దోమల నివారణ చర్యలుగాని చేపట్టడం లేదని తెలుస్తోంది. విష జ్వరాలతో మంచం పట్టిన గిరిజనాలకు వైద్య కరువయిందనే మాట సర్వత్రా వినవస్తోంది. వేలాది రూపాయలు ఖర్చుయ్యే డెంగ్యూలాంటి విషజ్వరాలు సోకితే తాము అంత ఖర్చు పెట్టి వైద్యం చేయించ లేమని ఉన్న ఎకరం అరెకరం అమ్ముకుంటే వైద్యానికే సరిపోతుందని తండావాసులు అంటున్నారు. వైద్యసౌకర్యం కలిపించి తండాలలో మౌళిక వసతులు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖాదికారులు స్పందించి తండాలో పరిస్థితులు పరిశీలించి గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందే లా చూడాలని పలువురు కోరుతున్నారు.

రసాభాసగా ప్రజాభిప్రాయ సేకరణ



ప్రాజెక్టు ఎత్తు పెంచొద్దని వాదనకు దిగిన మహిళలు



ముంపు గ్రామాల ప్రజలను అడ్డుకున్న పోలీసులు

మన తెలంగాణ/యాదాద్రి భువనగిరి : రైతును రాజును చేస్తానన్న తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణాలు చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు పాత డిజైన్ ప్రకారమే బస్వాపురం రిజర్వాయర్‌ను నిర్మించాలని భూ నిర్వాసితులు అభిప్రాయ సేకరణలో తమతమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వ పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల గురించి ప్రజాభిప్రాయం సేకరించి కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖకు ప్రజాభిప్రాయ సేకరణ పంపేందుకు ఈ మేరకు మండల పరిదిలోని సోమరాధా కృష్ణ ఫంక్షన్ హాలులో మంగళవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. ఈసందర్భంగా ప్రజా ప్రతినిధులకు, అధికార పార్టీ నాయకులకు, విపక్షాలకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. ప్రజాభి ప్రాయసేకరణలో పాల్గొన్న సిపిఐ, సిపి ఎం, జిల్లా కార్యదర్శులు గోద శ్రీరాము లు, యండి జహంగీర్‌లు మాట్లాడుతూ భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం 3రెట్లు ధర ఇవ్వాలని, పాత డిజైన్ ప్రకారమే బస్వాపురం ప్రాజెక్టు నిర్మించాలని, మేము ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని వారు ఉపన్యాసాలలో తెలిపారు. అదేవిధంగా ఈ ప్రజాభిప్రాయ సేకరణ విజయవంతమైనట్లుగా కలెక్టర్ అనితా రామచంద్రన్‌తో ప్రజా ప్రతినిధులు చెప్పించడం బాధాకరం. స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో ప్రజలు ప్రాజెక్టు ఎత్తు పెంచొద్దని,నోటిలో మట్టి కొట్టొద్దని వాదనకు దిగారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు బస్వాపురం పరిసర ప్రాంతాల ముంపు గ్రామాల ప్రజలు ఎంతో ఆవేదనతో హాజరైనప్పటికి ఎసిపి సాదు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రాధాకృష్ణ ఫంక్షన్ హాలులోకి పోకుండా అడ్డుకోవడం శోచనీయం.ఈ అభి ప్రాయ సేకరణలో అధికార పార్టీ నాయకుల ప్రజాభిప్రాయ సేకరణలాగా మారింది. ప్రజా ప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థలు, ముంపు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చెల్లెలి ఇంట్లోనే వినాయక చవితి వేడుకలు

బాలీవుడ్ కండల వీరుడిగా పేరొందిన సల్మాన్‌ఖాన్ ఈమధ్యన వరుస హిట్లతో దూసుకుపోతున్నాడు. సినిమాల్లో మంచి పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ స్టార్ హీరో రియల్ లైఫ్‌లో కూడా కాస్త మంచిగానే ఉంటాడు. అతను ముస్లిం అయినా గత 14 సంవత్సరాలుగా ప్రతి ఏడాది వినాయక చవితిని తన ఇంట్లో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తుండడం విశేషం. తనకు వినాయకుడు అంటే ఎంతో ఇష్టమని సల్మాన్ చాలా సార్లు చెప్పాడు. తను ఈ స్థాయిలో ఉండడానికి కారణం కూడా గణేశుడే అని భావిస్తాడు. వినాయక చవితి వచ్చిందంటే చాలు తన ఇంట్లో విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రి వేడుకలను కుటుంబ సభ్యులతో ఘనంగా నిర్వహిస్తాడు ఈ హీరో. అయితే ఈసారి సల్మాన్ నవరాత్రి వేడుకలను తను ఎంతగానో ఇష్టపడే చెల్లెలు అర్పిత ఇంట్లో నిర్వహించాలని నిర్ణయించుకున్నాడట. పైగా మేనల్లుడు కూడా చిన్నవాడు కావడంతో గణేశుడి దీవెనలు వారికి సంపూర్ణంగా ఉండాలని కుటుంబ సభ్యులతో మాట్లాడి సల్మాన్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నాడట.


సల్మాన్ ఖాన్

చిరు @ 151
'సైరా..నరసింహారెడ్డి'


సైరా... నరసింహారెడ్డి' ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమంలో వరుణ్‌తేజ్, పరుచూరి గోపాలకృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, సాయిధరమ్‌తేజ్, అల్లు అరవింద్, సురేందర్ రెడ్డి


రాజమౌళిని శాలువాకప్పి సన్మానిస్తున్న రామ్‌చరణ్

కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శ్రీమతి సురేఖ కొణిదెల సమర్పణలో మెగాస్టార్ చిరంజీవి టైటిల్ పాత్రలో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రామ్‌చరణ్ నిర్మిస్తున్న చిత్రానికి 'సైరా... నరసింహారెడ్డి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. చిరంజీవి నటిస్తున్న ఈ 151వ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. చిరంజీవి బర్త్‌డే సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాజమౌళి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితంపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, రామ్‌చరణ్, సాయిధరమ్‌తేజ్, వరుణ్‌తేజ్, సురేందర్ రెడ్డి, సుకుమార్, పరుచూరి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ''సైరా... నరసింహా రెడ్డి అనే టైటిల్ చాలా అద్భుతంగా ఉంది. బాహుబలి సినిమా అంత పెద్ద హిట్ కావడానికి టెక్నీషియన్సే ప్రధాన కారణం. ఈ సినిమాకు కూడా మంచి టెక్నికల్ టీం కుదిరింది. సినిమా మోషన్ పోస్టర్ అద్భుతంగా ఉంది. చిరంజీవి 151వ సినిమా ఇది అయినప్పటికీ ఒకటో సినిమాలాగా అంత బాగా ఫస్ట్‌లుక్‌తో సహా అన్ని ఎలిమెంట్స్ కుదిరాయి''అని అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ''రాజమౌళి చేతుల మీదుగా సైరా నరసింహారెడ్డి మోషన్ పోస్టర్‌ను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం అడగ్గానే అమితాబ్, రెహమాన్ వంటి నటీనటులు, టెక్నీషియన్స్ అందరూ వెంటనే ఒప్పుకున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఆంజనేయ స్వామి ఫొటో ఉంటుంది. ఆయన ఆశీర్వాదమో, అభిమానుల బలమో కానీ ఈ సినిమాకు అన్నీ అనుకున్నట్లుగానే కుదిరాయి. ఇక చిరంజీవి బర్త్‌డే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా 42 వేల మంది అభిమానులు రక్తదానం చేశారు. అభిమానులు ఇలా సేవ చేయడమే నాన్నగారికిచ్చే గొప్ప బర్త్‌డే గిఫ్ట్ అని భావిస్తున్నాను''అని తెలిపారు. దర్శకుడు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ''సైరా నరసింహారెడ్డి అనే టైటిల్ వినగానే నాలో వణుకు పుడుతుంది. ఈ సినిమాను చిరంజీవి కెరీర్‌లోనే ఓ స్పెషల్ మూవీగా నిలిచేవిధంగా తెరకెక్కించబోతున్నాం. అమితాబ్ , జగపతిబాబు, సుదీప్‌తో సహా మంచి ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ టీం సినిమాకు కుదిరారు. మెగాభిమానుల అండతో ముందుకు వెళ్తాం''అని చెప్పారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ ''చిరంజీవితో 37 ఏళ్లుగా మంచి అనుబంధం ఉంది. ఆయనెంతో కష్టపడి ఓ రోడ్డు వేశారు. ఆ రోడ్డుపైనే పవన్‌కళ్యాణ్ అయినా, రామ్‌చరణ్ అయినా, బన్నీ అయినా, తేజు, వరుణ్ నడుస్తున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఈ సినిమా ఉంటుంది''అని అన్నారు. అమితాబ్ బచ్చన్, జగపతిబాబు, సుదీప్, విజయ్ సేతుపతి, నయనతార, నాజర్, రవికిషన్, ముఖేష్ రుషి, రఘుబాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, సుబ్బరాజు తదితరులు ఇతర ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవివర్మన్, మ్యూజిక్: ఎ.ఆర్.రెహమాన్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, కథ: పరుచూరి బ్రదర్స్, రచనా సహకారం: సత్యానంద్, భూపతిరాజా, డి.ఎస్.కన్నన్, మధుసూదన్, వేమారెడ్డి, కాస్ట్యూమ్స్ డిజైనర్స్: అంజు మోడి, ఉత్తర మీనన్, సుస్మిత కొణిదెల.

కుటుంబమంతా చూడదగ్గ
'అర్జున్ రెడ్డి'


'అర్జున్ రెడ్డి' బిగ్ సీడీని విడుదల చేస్తున్న శర్వానంద్, ప్రణయ్ రెడ్డి, సందీప్ రెడ్డి, విజయ్ దేవరకొండ, షాలిని

విజయ్ దేవరకొండ, షాలిని హీరోహీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'అర్జున్ రెడ్డి'. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రణయ్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో బిగ్ సీడీ, ఆడియో సీడీలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నందినీ రెడ్డి, క్రాంతి మాధవ్, స్వప్న దత్, తరుణ్ భాస్కర్, శివ నిర్వాణ, విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా, ప్రణయ్ రెడ్డి వంగా, శర్వానంద్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ''సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల రోజునే సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని చెప్పాను. ఈ సినిమాపై నాకు అంత నమ్మకముంది. కథ వినగానే ఇది చిన్న పిల్లల సినిమా కాదని అనుకున్నాను. సెన్సార్ వాళ్లు మా సినిమాకు ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. వాళ్లు కొన్ని మ్యూట్స్ అడిగారు. ఏం మాట్లాడుతున్నావు రా... అనే పదాన్ని కూడా మ్యూట్ చేశారు. కాబట్టి ప్రేక్షకులే థియేటర్‌లో నాకు డబ్బింగ్ చెప్పాలి. ఇక హీరోయిన్ షాలిని అద్భుతమైన నటి. తనను ఈ క్యారెక్టర్‌లో చూసిన తర్వాత మరెవరు చేయలేరని అనిపించింది''అని అన్నారు. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ ''ఈ సినిమా మూడు గంటల ఒక నిమిషం నలభై సెకండ్ల నిడివితో ఉంటుంది. ఇది రొమాంటిక్ మూవీ. నేను ఎలాగైతే ఊహించుకున్నానో విజయ్, షాలిని అలాంటి నటననే కనబరిచారు. ఖచ్చితంగా సినిమా అందరికీ నచ్చే మూవీ అవుతుంది. కుటుంబ సభ్యులందరితో కలిసి ఈ సినిమా చూడవచ్చు''అని తెలిపారు. ప్రణయ్ రెడ్డి వంగా మాట్లాడుతూ ''సినిమాలో విజయ్, షాలిని అద్భుతంగా నటించారు. వీరిద్దరూ లేకుంటే సినిమా ఇంత బాగా వచ్చుండేది కాదు. శుక్రవారం సినిమా విడుదలవుతుంది''అని చెప్పారు.

అందాలొలికించిన తాప్సీ



బాలీవుడ్‌లో చాలా రోజుల నుండి ప్రేక్షకులను ఊరిస్తున్న సినిమా 'జుడ్వా2'. ఈ సినిమాలో వరుణ్‌ధావన్ డబుల్ యాక్షన్ చేశాడు. హీరోయిన్లు జాక్విలిన్ ఫెర్నాండెజ్, తాప్సీలు హద్దులు మీరి అందాలొలికించారు. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తోంది. ఈ సినిమాలో ఇండియాలో ఉండే ఆకతాయి లండన్ వెళ్తాడు. అక్కడ తన తమ్ముడిని కలుస్తాడు. ఈ నేపథ్యంలో హీరో, హీరోయిన్‌ల మధ్య వినోదాత్మక సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తాయని అంటున్నారు ఫిల్మ్‌మేకర్స్. ఇక ట్రైలర్‌లో తాప్సీ ఆరబోసిన గ్లామర్ యూత్‌ను మైమరపిస్తోంది. ఇందులో బికినీలో దర్శనమిచ్చిన ఈ భామ యువకులను అదరగొడుతోంది. తాప్సీ లిప్‌కిస్‌లు హైలైట్‌గా ఉన్నాయి. ఇక సినిమాలో జాక్విలిన్, తాప్సీలు పోటాపోటీగా నటించి వయ్యారాలు ఒలకబోశారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు అలరిస్తుందో చూడాలి.

'హలో' అంటున్న అఖిల్

అఖిల్ అక్కినేని హీరోగా అన్నపూర్ణ స్టూడియోస్, మనం ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో అక్కినేని నాగార్జున నిర్మిస్తున్న లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు 'హలో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను నాగార్జున ట్విట్టర్‌లో విడుదల చేశారు. దీంతో పాటు సినీ ప్రముఖులు 'హలో' అంటూ చిత్ర యూనిట్‌ను విష్ చేసిన వీడియోను కూడా విడుదల చేశారు. ఈ వీడియోలో ఎన్టీఆర్‌తో మొదలైన 'హలో' అనే పలకరింపును కాజల్, ప్రభాస్, శృతిహాసన్, రామ్‌చరణ్, నాగచైతన్య, వరుణ్‌తేజ్, సమంత, సూర్య, నాని, వెంకటేష్, రాజమౌళి, రకుల్‌ప్రీత్ సింగ్, రానా కొనసాగించగా చివరిలో అక్కినేని నాగార్జున 'ఆర్ యూ రెడీ... నాన్న మీరే చెప్పండి' అనగానే అక్కినేని నాగేశ్వరరావు కూడా 'హలో... హలో' అంటూ రావడంతో అఖిల్ కొత్త సినిమా 'హలో' ఫస్ట్‌లుక్ విడుదలైంది. ఇక నాగార్జునకు డిసెంబర్ సెంటిమెంట్‌గా బాగా కలిసొచ్చిన నెల. అందువల్ల 'హలో' చిత్రాన్ని కూడా డిసెంబర్ 22న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: పి.ఎస్.వినోద్.



మహేష్‌బాబు హీరోగా ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్. సినిమా ఎల్‌ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'స్పైడర్'. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. సెప్టెంబర్ 27న దసరా పండుగ కానుకగా తెలుగు, తమిళ్, మలయాళం, అరబిక్‌లో ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా 'స్పైడర్' గురించి దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్ చెప్పిన విశేషాలు...


ఎ.ఆర్.మురుగదాస్

మహేష్‌లాంటి సూపర్‌స్టార్‌ను ఇంతవరకు చూడలేదు

పోకిరి సమయంలో పరిచయం...

'స్టాలిన్' తర్వాత పదేళ్లకు నేను చేస్తున్న స్ట్రయిట్ తెలుగు మూవీ 'స్పైడర్'. సూపర్ స్టార్ మహేష్‌బాబు హీరోగా ఈ సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. కొన్నేళ్ల క్రితం నేను విజయవాడలో మహేష్ చిత్రం 'ఒక్కడు' చూశాను. సినిమా విడుదలై రెండు వారాలైనా థియేటర్‌లో పండుగలాగా కనిపించింది. సినిమాలో మహేష్ నటన నాకు బాగా నచ్చింది. ఆతర్వాత స్టాలిన్ సినిమా చేస్తున్నప్పుడు పక్కనే పోకిరి సినిమా సాంగ్ షూటింగ్ జరుగుతోంది. అప్పుడు పరుచూరి వెంకటేశ్వరరావు నాకు మహేష్‌ను పరిచయం చేశారు. తర్వాత కొన్ని రోజులకు మహేష్ కలిసినప్పుడు నేను మీతో సినిమా చేయాలనుకుంటున్నానండి అని అన్నాను. తను కూడా పాజిటివ్‌గానే స్పందించాడు. అయితే తర్వాత నేను గజినీతో బాలీవుడ్‌లోకి ప్రవేశించి బిజీ అయ్యాను.

ఒక పాట మినహా పూర్తి...

మహేష్‌తో తెలుగు, తమిళంలో ఓ సినిమా చేయాలనుకోగానే ఈ కథను అనుకున్నాం. కథలో హీరోయిజం ఉండాలి. ఫ్యామిలీ ఆడియన్స్, ఫ్యాన్స్, రెగ్యులర్ ఆడియన్స్‌కు సినిమా నచ్చేలా ఉండాలి. అలాగే తమిళంలో మహేష్ చేస్తున్న తొలి స్ట్రయిట్ మూవీ కాబట్టి సినిమా బ్యాలెన్సింగ్‌గా, కరెక్ట్‌గా ఉండాలి. కాబట్టి స్క్రిప్ట్ మోడ్రన్‌గా ఉండాలని నిర్ణయించుకున్నాం. అన్నీ అనుకున్నవిధంగానే సినిమా తెరకెక్కింది. తెలుగు, తమిళంలో డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఒక పాట మినహా సినిమా పూర్తయ్యింది. పదేళ్లు ఎదురు చూసినందుకు మహేష్‌తో తగిన సినిమా చేసినట్లు అనిపించింది. తప్పకుండా ఈ చిత్రం తెలుగు, తమిళ ప్రేక్షకులకు అలరిస్తుందని చెప్పగలను.

మహేష్ దర్శకుల హీరో...

దర్శకుడిగా నేను ఇప్పటివరకు చాలా మంది సూపర్‌స్టార్స్‌తో పనిచేశాను. మహేష్ వర్కింగ్ స్టైల్‌ను మరొకరితో పోల్చలేము. అందరు దర్శకులు అతనితో ఒక్క సినిమా అయినా చేయాలని కోరుకుంటారు. ఏడాదిగా మహేష్‌తో నేను ప్రయాణం చేస్తున్నాను. తనలాంటి సూపర్‌స్టార్‌ను ఇంతవరకు నేను చూడలేదు. తను పూర్తిగా దర్శకుల హీరో. స్పైడర్ సినిమాను 80 రోజుల పాటు రాత్రిపూట షూటింగ్ చేశాం. తను ఎంతో సహకరించి సినిమా చేశాడు. స్క్రిప్ట్ విన్న తర్వాత ఎక్కడా జోక్యం చేసుకోలేదు. ఇండియాలో మరే సూపర్‌స్టార్ ఇంతలా కష్టపడటం నేను చూడలేదు. స్పైడర్ సినిమాలో మహేష్ తప్ప మరో హీరోను ఊహించుకోలేనంతగా ఇమిడిపోయారు. ఇక సినిమాను రెండు భాషల్లో సమాంతరంగా షూట్ చేశాం. నేను చేసిన సినిమాల్లో తుపాకీ, గజనీ స్టైలిస్ మూవీస్ అయితే... రమణ, కత్తి ఎమోషనల్ సినిమాలు. మహేష్‌తో సినిమా అంటే మోడ్రన్‌గా ఉండాలని 'స్పైడర్' కథను సిద్ధం చేసుకున్నాను.

ఇంటెలిజెన్స్ వ్యవస్థపై...

'స్పైడర్' జేమ్స్‌బాండ్ తరహా మూవీ కాదు. ఇది స్పై మూవీ. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఇంటెలిజెన్స్ వ్యవస్థ మన దేశంలో ఎలా పనిచేస్తుంది. వారు దేశంలో మన కోసం ఏం చేస్తున్నారు అనేవి సినిమాలో చూపిస్తున్నాం. సినిమాలో ఎమోషన్స్ ఉంటాయి. సాధారణంగా నా సినిమాల్లో అంతర్లీనంగా సందేశముంటుంది. స్పైడర్‌లో కూడా మంచి సందేశముంటుంది. మనిషిలో మానవత్వం తగ్గిపోయినప్పుడు సమాజంలో ఏదైనా వైపరీత్యం సంభవిస్తుంది. ఈ సందేశాన్ని నేను ఇన్‌డైరెక్ట్‌గా సినిమాలో చూపిస్తున్నాను.

రెండు భాషల్లో క్లైమాక్స్ ఒకేలా...

ప్రారంభంలోనే సినిమాను తెలుగు, తమిళంలోనే చేయాలనుకున్నాం. హిందీలో చేయాలనుకోలేదు. తెలుగు, తమిళంలో ఏకకాలంలో షూట్ చేయడం వల్ల నేను చేసిన ప్లానింగ్‌కంటే షూటింగ్‌కు ఎక్కువ రోజుల సమయం పట్టింది. ఒకేసారి రెండు భాషల్లో సినిమా చేయడం నాకు మొదటిసారి. అయితే తెలుగు, తమిళ్‌లో సినిమా క్లైమాక్స్ ఒకేలా ఉంటుంది.

గ్రాండియర్‌గా సినిమా నిర్మాణం...

ఠాగూర్, గజనీ, కత్తి సినిమాల నుండి ఠాగూర్ మధుతో పరిచయం ఉంది. అలాగే తిరుపతి ప్రసాద్‌తో కూడా చాలా కాలంగా అనుబంధం ఉంది. ఠాగూర్ మధు, తిరుపతి ప్రసాద్‌లు ఈ చిత్రాన్ని ముందుగా అనుకున్నవిధంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. సినిమా ఎంతో గ్రాండియర్‌గా తెరకెక్కింది. గ్రాఫిక్స్‌ను కూడా లండన్, రష్యా టెక్నీషియన్‌లతో చేయిస్తున్నాం. ప్రతి విషయంలో నిర్మాతలు ఏవిధంగానూ రాజీపడకుండా సినిమాను రూపొందిస్తున్నారు.

అందుకే రకుల్‌ప్రీత్‌ను తీసుకున్నాం...

సినిమాను రెండు భాషల్లో ఏకకాలంలో తీయాలనుకున్నప్పుడు రెండు భాషలు తెలిసిన హీరోయిన్ కావాలనిపించింది. అలాంటప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ అయితే రెండు భాషలను అర్థం చేసుకుంటుందని ఆమెను హీరోయిన్‌గా తీసుకున్నాం. అదేవిధంగా మా కథకు తగినట్లుగా బుద్ధి బలం ఎక్కువగా ఉండే విలన్ కావాలి. హీరోకు కనిపించకుండా గెరిల్లా దాడిలా హీరోతో ఫైట్ చేయాలి. అందుకు ఎస్.జె.సూర్య అయితే సరిపోతాడనిపించి అతన్ని విలన్‌గా తీసుకున్నాం. నేను, సూర్య మంచి స్నేహితులం. కెరీర్ ప్రారంభంలో దర్శకత్వ శాఖలో ఇద్దరం కలిసి పనిచేశాం. భరత్ కూడా ఈ సినిమాలో విలన్‌గా నటించాడు.

తదుపరి చిత్రాలు...

నెక్స్ట్ నేను తమిళంలో ఓ సినిమా చేయబోతున్నాను. చర్చలు జరుగుతున్నాయి. అదేవిధంగా బాలీవుడ్‌లో సల్మాన్‌ఖాన్‌తో ఓ సినిమా చేయాలని ప్లాన్ చేశాను. సల్మాన్‌కు స్టోరీలైన్ వినిపించగా ఆయనకు నచ్చింది. ఈ సినిమా ఎప్పుడనేది అన్నీ ఓకే అయిన తర్వాత చెబుతాను. అలాగే రజనీకాంత్‌కు కూడా కథ చెప్పాను. ఆయనకు కూడా నచ్చింది. అయితే ఆయన 2.0, కాలా చిత్రాలతో ఆయన బిజీగా ఉన్నారు. ఆ రెండు చిత్రాలు పూర్తి కాగానే రజనీతో నా సినిమా ఉంటుంది.


రాశీఖన్నా

సరికొత్త అందాలతో అలరించనుంది

సౌత్ హీరోయిన్‌లలో బబ్లీ గర్ల్ అంటే వెంటనే గుర్తొచ్చే పేరు రాశీఖన్నా. ఊహలు గుసగుసలాడే వంటి లవ్‌స్టోరీ మూవీతో టాలీవుడ్‌లోకి ప్రవేశించిన ఈ భామ కుర్రాళ్ల మనసు దోచేసుకుంది. అందరి హీరోయిన్‌లా కాకుండా తన అందచందాల్లో ఎంతో ప్రత్యేకతను కనబరుచుకుంది. వచ్చిన కొద్ది రోజులకే గ్లామరస్ పాత్రలను ఓకే చేస్తూ స్టార్ హీరోలతోనూ సినిమాలు చేస్తోంది. అయితే ఇప్పటివరకు ఈ అమ్మడి అందంతో ఎలాంటి ఇబ్బంది రాలేదు కానీ ఇటీవల వచ్చిన కొన్ని ఆఫర్ల కోసం బరువు తగ్గేందుకు చాలా శ్రమించింది ఈ ముద్దుగుమ్మ. జిమ్‌లో వ్యాయామాలు చేసి జీరో సైజ్‌కు వచ్చిందట రాశీఖన్నా. ఇకనుంచి సరికొత్త అందాలతో అలరిస్తానంటోంది ఈ భామ. ఇక ఈ అమ్మడు చేస్తున్న చిత్రాల విషయానికి వస్తే ప్రస్తుతం ఎన్టీఆర్‌తో 'జై లవ కుశ' సినిమాతో పాటు రవితేజతో 'టచ్ చేసి చూడు' చిత్రంలో నటిస్తోంది. తాజాగా యంగ్ హీరో వరుణ్‌తేజ్ సినిమాలో కూడా నటించే ఛాన్స్ కొట్టేసినట్లు సమాచారం. అలాగే కొన్ని తమిళ్, మలయాళ సినిమాలలో కూడా నటిస్తోంది రాశీఖన్నా.

బ్యూటిఫుల్ రొమాంటిక్ థ్రిల్లర్

చంద్రకాంత్, రాధికా మెహరోత్రాలను హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ థర్డ్ ఐ క్రియేషన్స్ పతాకంపై రఘురాం రొయ్యూర్‌తో కలిసి గోవర్ధన్.జి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన రొమాంటిక్ థ్రిల్లర్ 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. ఈ చిత్రం షూటింగ్ అధిక భాగం అమెరికాలో జరిగింది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం మోషన్ పోస్టర్‌కు విశేషమైన స్పందన వస్తోంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు చంద్రకాంత్ విలేకరులతో మాట్లాడుతూ ''ఈ చిత్రం ఒక బ్యూటిఫుల్ రొమాంటిక్ థ్రిల్లర్. ఇటువంటి మంచి సినిమాతో హీరోగా పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. దర్శకుడు గోవర్ధన్ ఈ చిత్రం కోసం ప్రాణం పెట్టి జీవం పోశారు. ఈ చిత్రం నాకు మంచి బ్రేక్‌నిస్తుంది. ఇక నేను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను. ఇంజినీరింగ్ పూర్తిచేశాక యాక్టింగ్‌ను కెరీర్‌గా తీసుకోవాలని నిర్ణయించుకొని అమెరికాలో ట్రైనింగ్ తీసుకున్నాను. ఈ చిత్రంలో హీరోయిన్లుగా పరిచయమవుతున్న రాధిక, పల్లవిలు చాలా బాగా నటించారు''అని అన్నారు.


చంద్రకాంత్



దీపావళికి ఎయిర్‌టెల్ నుంచి ఉచిత ఫోన్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో ఫోన్ రానున్న నేపథ్యంలో ప్రత్యర్థి కంపెనీలు అప్రమత్తమవుతున్నాయి. ఉచిత జియో ఫోన్ నుంచి పోటీని తట్టుకునేందుకు గాను ఎయిర్‌టెల్ కూడా త్వరలో కొత్త మొబైల్‌ను తీసుకొస్తున్నట్టు ప్రకటించింది. రూ.2,500కే 4జి స్మార్ట్‌ఫోన్ తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీపావళికి ముందుగానే ఈ ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. జియోఫోన్ పేరుతో ఫీచర్ ఫోన్‌ను ఉచితంగా అందించనున్నట్లు రిలయన్స్ ఇటీవల సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రకటన తర్వాత ఐడియా కూడా తక్కువ రేటుకే ఫోన్‌ను అందిస్తామని ప్రకటించగా, ఇప్పుడో మరో సంస్థ ఈ జాబితాలో చేరింది. రూ.2500కే స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చేందుకు కొన్ని మొబైల్ తయారీ సంస్థలతో ఎయిర్‌టెల్ చర్చలు జరుపుతోంది. ఉత్తమమైన ఫీచర్లతో వినియోగదారులను ఆకర్షించేలా ఈ ఫోన్ తీసుకురావాలని ప్రయత్నిస్తోందని కంపెనీకి చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపారు. ఈ చర్చలు దాదాపు చివరిదశకు చేరాయని, సెప్టెంబర్ చివర్లో లేదా అక్టోబర్ మొదటివారంలో ఫోన్‌ను మార్కెట్లోకి విడుదల చేసే అవకాశాలున్నాయని తెలిపారు. లావా, కార్బన్ మొబైల్ సంస్థలతో ఎయిర్‌టెల్ చర్చలు జరుపుతున్నట్లుమార్కెట్ వర్గాల సమాచారం. కాగా జియో ఫోన్ పూర్తిగా ఉచితం, అయితే రిఫండ్ మనీ రూ.1500 చెల్లించాలని పేర్కొంది.

ఎయిర్‌ఏసియా రూ. 999 టికెట్ ఆఫర్

న్యూఢిల్లీ: ఎయిర్ ఏషియా ప్రయాణికులకు సరికొత్త ఆఫర్ ప్రకటించింది. పరిమిత ప్రమోషనల్ పథకం కింద వన్‌వే ఫ్లైట్స్‌కు రూ.999 టికెట్ ఆఫర్ అందిస్తోంది. '7 డేస్ మ్యాడ్ డీల్స్' పేరిట మంగళవారం ఈ ఆఫర్‌ను తమ అధికారిక వెబ్‌సైట్లో పొందుపరిచింది. ఈ ఆఫర్ కింద ప్రయాణం 2018 ఫిబ్రవరి 26 నుంచి ఆగస్టు 28 మధ్య వర్తించనుంది. ఆగస్టు 22 నుంచి 27 వరకు టికెట్లు బుక్ చేసుకోవచ్చని సంస్థ తెలిపింది. పరిమిత కాల వ్యవధిలో ఎంపిక చేసిన వన్‌వే విమానాలకు టికెట్ ధరను రూ.999గా పేర్కొంది. అంతే కాకుండా ఎయిర్ ఏషియా దేశంలో పలు ప్రాంతాలకు ప్రయాణించే వారి కోసం ఆఫర్లు ప్రకటించింది. ఎంపిక చేసిన విమానాల్లోనే ఈ స్కీమ్ వర్తిస్తోందని, సీట్లు పరిమిత సంఖ్యలో ఉన్నాయని ప్రతినిధులు తెలిపారు.

నష్టాల నుంచి కోలుకున్న సూచీలు

ముంబయి: ఎట్టకేలకు స్టాకమార్కెట్ నష్టాలను వీడి లాభాల బాటలోకి వచ్చింది. ఇన్ఫోసిస్ సిఇఒ పదవికి విశాల్ సిక్కా రాజీనామా చేయడంతో గత రెండు సెషన్లలో ఈక్విటీ మార్కెట్లు భారీగా నష్టపోగా తాజాగా కాస్త కోలుకున్నాయి. ఆరంభం లో ఉత్సాహంగా ప్రారంభమైనప్పటికీ మదుపర్ల నుంచి అమ్మకాల ఒత్తిడితో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. దీంతో స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఓ దశలో 180 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. ఆఖరి సమయంలో పుంజుకున్న సెన్సెక్స్ 33 పాయింట్లు లాభంతో 31,291 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ11 పాయింట్ల లాభంతో 9765 పాయిం ట్లు వద్ద ముగిసింది. మిడ్, స్మాల్ క్యాప్స్ ఆటో, రియల్ ఎస్టేట్ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. భారత్ ఫైనాన్షియల్స్, ఎన్‌టిపిసి, ఇండి యా బుల్స్, ఐషర్ మోటార్స్, హీరో మోటార్‌కా ర్ప్, అంబుజా,ఇండియన్ హోటల్స్, రిలయన్స్ కే పిటల్, ఎక్సైడ్, క్రాంప్టన్, సన్ టీవి, ఆల్కెమ్ లేబ్, టొరంట్ ఫార్మా, టాటా కమ్యూనికేషన్స్ వంటి షేర్లు నష్టపోయాయి. మరోవైపు సన్‌ఫార్మా 2.49 శాతం, డా.రెడ్డీస్ 2.38 శాతం, లుపిన్ 2.01 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 1.43 శాతం లాభ పడ్డాయి.

హుందయ్ నుంచి నెక్స్ జెన్ వెర్నా

న్యూఢిల్లీ: హుందయ్ మోటార్ ఇండియా మంగళవారంనాడు మిడ్ సైజ్ సెడాన్ వెర్నా కొత్త వెర్షన్ లాంఛ్ చేసింది. ఈ మోడల్ ప్రారంభ ధర రూ.7.99 లక్షలు(ఢిల్లీ ఎక్స్‌షోరూం) నిర్ణయించింది. డీజిల్ ట్రిమ్స్ ధర రూ.9.19 నుంచి రూ.12.61 లక్షల మధ్య ఉంటుంది. అయితే ఈ ధరల్లో తొలి 20వేల కస్టమర్లకు మాత్రమే కొత్త వెర్నా అందుబాటులో ఉంటుందని, ఆ తర్వాత సమీక్షించిన ధరల ప్రకారం వెర్నా రేటు పెరుగనుందని హెచ్‌ఎంఐఎల్ డైరెక్టర్(సేల్స్, మార్కెటింగ్) రాకేష్ శ్రీవాత్సవ తెలిపారు. 1.6 లీటరు పెట్రోల్, డీజిల్ మోటార్స్‌ను ఈ కొత్త వెర్నా కలిగి ఉంది.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31291.85	33.00	0.11%
నిఫ్టీ	9765.55	11.20	0.11%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27720	29647.06	0.51%
ముంబై	28480	30459.89	-0.25%
ఢిల్లీ	27900	29839.57	0%
కోల్‌కతా	28380	30352.94	- 0.35%
కేరళ	27100	28983.96	0%
బెంగళూరు	27300	29197.86	0%
హైదరాబాద్	27590	29508.02	0.22%
గల్ఫ్	1365.57	1460.50	0.02%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42300.00	0.71
ముంబై	42600.00	42300.00	0.71
ఢిల్లీ	42600.00	42300.00	0.71
కోల్‌కత్తా	42600.00	42300.00	0.71
హైదరాబాద్	42600.00	42300.00	0.71



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382

ప్రైవేటీకరణపై బ్యాంకుల సమ్మె

ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలకు తీవ్ర నష్టం : యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్ వివిఎస్ఆర్ శర్మ

మన తెలంగాణ/ హైదరాబాద్/గోషామహల్: బ్యాంకులను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కన్వీనర్ వివిఎస్ ఆర్ శర్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టాల్లో ఉన్న బ్యాంకుల మూసివేత, బ్యాంకుల విలీనం, నిరర్ధక ఆస్తుల (ఎన్‌పిఎ) రైటాఫ్‌ను వ్యతిరేకిస్తూ అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఒకరోజు సమ్మె నిర్వహించారు. మంగళవారం కోఠి బ్యాంక్ స్ట్రీట్ లోని ఎస్‌బిఐ ఉద్యోగులు విధులను బహిష్కరించి బ్యాంకు ప్రాంగణంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్ వివిఎస్ఆర్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించడంతో ప్రజలకు తీవ్ర నష్టం జరుగు తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రా ట్యుటీని రూ.20 లక్షలు చేయాలని, గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్యాంకు బోర్డుల్లో ఎంప్లాయి డైరెక్టర్లను నియ మించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న అన్ని కేటగిరీల్లో పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు ఖాతాదారులపై కొత్తగా మోపిన చార్జీలను రద్దు చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా గల 7 లక్షల కోట్ల మొండి బకాయిల వసూలుకు కఠినమైన చర్యలు చేపట్టాలని, అందుకు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు.. 7 లక్షల కోట్ల మొండి బకాయిలో 25 శాత ం మొండి బకాయిలు 12 మంది బడాబాబుల నుండి రావాల్సి ఉందని, ఈ విషయాన్ని స్వయంగా రిజర్వు బ్యాంకు అధికారులే ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా 10 లక్షలమంది బ్యాంకు ఉద్యోగుల డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతవం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎం ప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, రిజర్వు భ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు క్రాంతి, ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ ఉపాధ్యక్షులు హర్షవర్ధన్, సుబ్రమణ్యం, ఎన్‌సిబిఈ రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణలతో యూనియన్ నాయకులు శ్రీరామ్, జనార్ధనాచారి, రవీంద్రనాథ్, శ్రీనివాస్‌శర్మలతో పాటు పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఐఐఇఎ కార్యదర్శి రమేష్

ఘనంగా ఇండియన్ బ్యాంక్ 111వ ఆవిర్భావ దినోత్సవం

మన తెలంగాణ / హైదరాబాద్ : ఇండియన్ బ్యాంక్ ఇటీవలే 110 సంవత్సరాలు పూర్తి చేసుకుని 111వ ఏట అడుగిడిన సందర్భాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఘనంగా ఇండియన్ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఆ బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇండియన్ బ్యాంక్ ఎండి అండ్ సిఈవో కిశోర్ ఖరాత్ ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్, కరీంనగర్ జోన్ల బ్యాంక్ సిబ్బందికి, వినియోగదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్ ఖరాత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో బ్యాంక్ మూడు జోన్లుగా విభజింపబడిందన్నారు. వీటిలో అమరావతి, వడోదర, బార్ధమాన్‌లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం బ్యాంక్ దేశ వ్యాప్తంగా 2700 బ్యాంకు శాఖలను కల్గి ఉందని, దక్షిణ భారత దేశంలోనే 60 శాతం శాఖలు విస్తరించి ఉన్నాయన్నారు. తెలుగు రాష్ట్రాలైన ఏపి, తెలంగాణలో 300 శాఖలతో విస్తృత సేవలందిస్తోందన్నారు. సింగపూర్, కొలంబో, జపాన్‌లోనూ బ్యాంకు శాఖలు వినియోగదారులకు సేవలందిస్తున్నాయన్నారు. బ్యాంక్ మెరుగైన ఫలితాలను సాధిస్తూ నిరర్ధక ఆస్తుల శాతాన్ని 7.21 శాతం నుండి 5 శాతానికి తగ్గించుకుందన్నారు. బ్యాంకుల డిజిటైజేషన్ , కష్టమర్ సర్వీసుల విస్తరణ తదితర కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టినట్లు కిశోర్ ఖరాత్ వెల్లడించారు.



బిఎస్‌ఎన్‌ఎల్ ల్యాండ్‌లైన్ ఉచిత కాల్స్

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్ ల్యాండ్ లైన్ ఫోన్ల నుండి వినియోగదారులకు ఉచిత కాల్స్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. జనరల్ ప్లాన్ (గ్రామీణం)లో నెలవారీ ఛార్జీ రూ.160కి ఉచిత కాల్స్ 160, రూ. 180 చార్జీలకు 180, రూ. 220కి గాను 220 ఉచిత కాల్స్ చేసుకోవచ్చు. అదే జనరల్ ప్లాన్ (పట్టణం) విషయానికి వస్తే రూ.200 ఛార్జీతో 200 కాల్స్, 240 ఛార్జీతో 240 కాల్స్‌ను చేసుకోవచ్చని బిఎస్‌ఎన్‌ఎల్ తెలంగాణ సర్కిల్ సిజిఎం అనంతరామ్ ఆ ప్రకటనలో తెలిపారు. ల్యాండ్ లైన్ ఉచిత కాల్స్‌కు సంబంధించిన మరింత సమాచారం ఫోన్ 18003451500లో తెలుసుకోవచ్చన్నారు.

'కాన్వాస్ ఇన్ఫినిటీ'తో సత్తా చాటుతాం : మైక్రోమాక్స్

న్యూఢిల్లీ: దేశీయ మొబైల్ తయారీ దిగ్గజం మైక్రోమాక్స్ సరికొత్త ఫోన్‌ను మార్కెట్లోకి విడుదల చే సింది. ఈ ఫోన్‌తో తమ సంస్థ మార్కెట్లో మళ్లీ పు న ర్వైభవాన్ని పొందుతుందని కంపెనీ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. మైక్రోమ్యాక్స్ 'కాన్వాస్ ఇన్ఫినిటీ' పేరుతో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఈ స్మార్ట్‌ఫోన్ ధరను రూ.9,999గా నిర్ణయించింది. రిజిస్ట్రేషన్లను ఆగస్టు 22 నుంచే ప్రా రంభమయ్యాయి. అలాగే ఆన్‌లైన్‌లో మాత్రం అమెజాన్ వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 1నుండి అందుబాటులో ఉంటుంది. అనంతరం దేశవ్యాప్తంగా రి టైల్ స్టోర్లలో అందుబాటులోకీ తీసుకురానున్నా రు. వివో, ఒప్పో, జియోమీ వంటి చైనా ఫోన్లు ధాటికి నెమ్మదించిన ఈ సంస్థ మళ్లీ పుంజుకొనేందుకు ఈ కొత్త ఫోన్ ఉపయోగపడుతుందని మై క్రోమ్యాక్స్ సహ వ్యవస్థాపకుడు రాహుల్ శర్మ అంటున్నారు. 18.9 డిస్ప్లే తో వస్తున్న అతి చవకైన ఫోన్ ఇదే అన్నారు. సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్8 84.2 శాతం బాడీ రేషియో స్క్రీన్ అందిస్తుండగా తమ ఇన్ఫినిటీ 83 శాతం అందిస్తోందని ఆయన చెప్పారు. అలాగే ఆండ్రాయిడ్ నౌగట్ అప్‌డేటెడ్ వెర్షన్ 8.0 ఓరియో అందుబాటులోకి రాగానే ఈ ఫోన్ కూడా అప్‌డేట్ అవుతుందని వారు చెప్పారు.

స్టార్టప్‌లకు నిలయంగా తెలంగాణ



మన తెలంగాణ / హైదరాబాద్ : కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం స్టార్ట్ అప్‌లకు నిలయంగా మారుతోందని ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. విద్యావంతులైన యువత తమ ఆలోచనలకు పదును పెడుతూ నూతన ఆవిష్కరణలకు ఆలంభనగా నిలుస్తోందన్నారు. మరో వైపు ఈ రంగంలోకి కొత్తగా వచ్చే వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు టి హబ్, ఐఎస్‌బి లాంటి సంస్థలు తమ సంపూర్ణ సహకారం అందిస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం, ఐఎస్‌బి, టి హబ్, స్మార్ట్‌సెన్స్ డిజిటల్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఈ నెల 26న గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఆసియాలోనే అతిపెద్ద స్టార్టప్ ఫెస్టివల్ ఆగస్ట్ ఫెస్ట్ ఐదవ ఎడిషన్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్ విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయేష్ రంజన్, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలా గుత్తా, ఆగస్ట్ ఫెస్ట్ చీఫ్ ఆఫ్ ఇన్నోవేషన్ ఆది వేమూరు తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

ఇన్ఫోసిస్ పరిణామాలపై నిఘా

- షేరు ధరను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం
- స్టాక్‌మార్కెట్‌కు ఆధార్ కెవైసి గడువు డిసెంబర్ 31: సెబీ చైర్మన్ త్యాగి

ముంబయి: దేశీయ రెండో అతిపెద్ద ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌పై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిఘా పెట్టింది. ఇటీవల సంస్థ సిఇఒ పదవికి విశాల్ సిక్కా రాజీనామా చేసిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని సెబీ చైర్మన్ అజయ్ త్యాగి పేర్కొన్నారు. కంపెనీ షేరు విలువ భారీగా పడిపోగా, మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.34 వేల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. ఇన్ఫీ అధికారులు ఉల్లంఘనల ఆరోపణలపై అమెరికా చట్ట సంస్థలు దర్యాప్తు చేస్తున్నారనే వార్తలు, వాటాదారుల ప్రయోజనాలను కాపాడే దిశగా సెబీ చర్యలు చేపట్టింది. అదే సమయంలో దాదాపు 331 కంపెనీలను షెల్ (డొల్ల సంస్థలు) కంపెనీలను గుర్తించి, వాటిని డీలిస్ట్ చేసేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సమాయత్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో లిస్టెడ్ కంపెనీల్లో ఉల్లంఘనలకు పాల్పడకుండా గట్టి నిఘా ఉంచామని, సెక్యూరిటీస్ చట్టాలను ఉల్లంఘించి సంస్థలను పరిశీలిస్తున్నామని త్యాగి తెలిపారు. న్యూఢిల్లీలో ఎఫ్ఎస్‌డిసి(ఫైనాన్షియల్ స్టబిలిటీ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) సమావేశం అనంతరం మీడియాతో త్యాగి మాట్లాడారు. ఇన్ఫోసిస్ గురించి ప్రశ్నించగా ఆయన స్పందిస్తూ, కార్పొరేట్ పాలన దేశంలో ఇప్పటికీ పెద్ద సమస్యేనని అన్నారు. ఉత్తమ కార్పొరేట్ పాలన ప్రమాణాలను సిఫారసు చేసేందుకు జూన్‌లో కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ సెప్టెంబర్ ముగింపు నాటికి నివేదిక ఇవ్వనుందని తెలిపారు. కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎండి ఉదయ్ కోటక్ ఆధ్వర్యంలో 21 మంది సభ్యులతో ప్యానెల్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. దీనిలో కార్పొరేట్ ఇండియా, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, న్యాయ సంస్థలు, సెబీ, ప్రాక్సీ అడ్వైజరీ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఉన్నారు.

స్టాక్‌మార్కెట్‌కు ఆధార్ అనుసంధాన కెవైసి(నో యువర్ కస్టమర్) కోసం 2017 డిసెంబర్ 31 వరకు గడువుకు సెబీ కట్టుబడి ఉందని త్యాగి అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆధ్వర్యంలో ఎఫ్ఎస్‌డిఎస్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) గవర్నర్ ఉర్జిత్ పటేల్, ఆర్థిక కార్యదర్శి అశోక్ లావాస, త్యాగి, ఐఆర్‌డిఎ చైర్మన్ టిఎస్ విజయన్, పిఎఫ్ఆర్‌డిఎ చైర్మన్ హేమంత్, ఇతర సీనియర్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు హాజరయ్యారు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన భారత్ ఆర్థికరంగ అంచనా నివేదికను కౌన్సిల్ చర్చించింది. ఈ నివేదికను పరిశీలిస్తున్న కౌన్సిల్ ఈ సంవత్సరం ఆఖరు నాటికి తుది నిర్ణయం తీసుకోనుందని సమావేశం తర్వాత అధికారిక ప్రకటనలో వెల్లడించారు. సెంట్రల్ కైవైసి రిజిస్ట్రీ విధానంపైనా ఎఫ్ఎస్‌డిసి చర్చించింది.



మూర్తిపై మాజీ బోర్డు సభ్యుడు విమర్శలు

ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తిపై కంపెనీ మాజీ బోర్డు సభ్యుడు విమర్శలు గుప్పిస్తూ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖ ఇప్పుడు సంచలనంగా మారింది. ఇన్ఫోసిస్ రెండు దశాబ్దాలుగా సంస్థకు మీరందించిన సేవలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రశంసిస్తూనే మరోవైపు ఆయనపై విమర్శలు చేశారు. బోర్డులో 15 సంవత్సరాలు స్వతంత్ర డైరెక్టర్‌గా ఉన్న ఓంకార్ గోస్వామి ఈ లేఖ రాశారు. కంపెనీలో పరిస్థితి మరింత చెడకముందే, గౌరవం మరింత నాశనం కాకముందే సంస్థ నుంచి వైదలగాలని మూర్తిని ఆయన కోరారు. సిక్కా రాజీనామాపై మూర్తి అధికారికంగా స్పందించకపోవడం, తదితర పలు అంశాలపైనా విమర్శలు చేశారు. సంస్థలో జరుగుతున్న పరిణామాలపై తనతో పాటు ప్రతి మాజీ స్వతంత్ర డైరెక్లర్లు అందరమూ తీవ్రంగా కలత చెందుతున్నామని పేర్కొన్నారు. 2000 సంవత్సరం నవంబరులో ఇన్ఫోసిస్ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా చేరిన ఓంకార్ గోస్వామి 2014 డిసెంబర్ 31న రిటైర్ అయ్యారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు:బాలకృష్ణన్



నారాయణ మూర్తికి ఇన్ఫోసిస్ మాజీ సిఎఫ్ఒ వి బాలకృష్ణన్ బాసటగా నిలిచారు. సిక్కా రాజీనామా నేపథ్యంలో మూర్తిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కంపెనీ బోర్డు మూర్తిపై విమర్శలు చేస్తోందన్నారు.

నేడు ఇన్వెస్టర్లతో మూర్తి భేటీ



సిఇఒగా విశాల్ సిక్కా వైదొలిగిన తర్వాత కంపెనీలో కొం త గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి రంగంలోకి దిగారు. నేడు(బుధవారం) సాయంత్రం ఇన్వెస్టర్లతో ఆయన సమావేశం కానున్నారు. సిక్కా రాజీనామా మూ ర్తియే కారణమంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో మ దుపరులతో భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇ న్ఫోసిస్‌లో ముదురుతున్న వివాదాలను పరిష్కరించేందు కు మూర్తి కార్యాచరణకు దిగుతున్నారు. మరోవైపు తాజా పరిణామాలపై ఇన్ఫోసిస్ కో ఛైర్మన్ రవి వెంకటేశన్ కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని కలిశారు. సిక్కా ఆకస్మిక రాజీనామా చేసిన నేపథ్యంలో జైట్లీకి కంపెనీలో ఉన్న అనిశ్చితిపై సమాచారం అందించినట్టు తెలుస్తోంది. వాటాదారులను రక్షించుకునేందుకు జరుగుతున్న చర్యలపై వివరించారని సమాచారం. దీంతో టెక్నాలజీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో ఏం జరుగబోతోంది? అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మరోవైపు విశాల్ సిక్కా వారసుడి ఎంపిక ప్ర క్రియ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ మొత్తం వ్యవహారా న్ని చక్కదిద్దేందుకు మరో సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనీ రంగంలోకి దిగనున్నారని, ఈమేరకు బోర్డు కూ డా ఆయనతో సంప్రదింపులు జరుపనున్నారని సమాచా రం. ఫౌండర్ గ్రూపునకు, బోర్డు మధ్య వివాదం పరిష్కారంలో మధ్యవర్తిత్వం వహించనున్నారని తెలుస్తోంది.

సమాచారం ముందే ఇచ్చాం

తిరువనంతపురం : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతాకాన్ని ఎగురవేసే విషయంలో పాలక్కాడ్ పాఠశాలకు మార్గదర్శకాలను తెలియజెప్పడంలో ఆలస్యం చేయలేదని కేరళ ప్రభుత్వం శాసనసభలో స్పష్టం చేసింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ ఆ రోజున ఆ పాఠశాలలో జాతీయ ఎగురవేసిన ఘటన వివాదాస్పదం కావడంతో ప్రభుత్వం ఈ వివరణిచ్చింది.

నీట్‌ను అనుసరించాల్సిందే



న్యూఢిల్లీ: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకై నిర్వహించిన నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) అంశంపై తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. తమిళనాడు కూడా నీట్‌ను తప్పనిసరిగా అనుసరించాల్సిందేనని స్పష్టం చేసింది. వెంటనే కౌన్సెలింగ్ ప్రారంభించాలని, సెప్టెంబర్ 4 లోగా ప్రవేశాల ప్రక్రియ పూర్తిచేయాలని మంగళవారంనాడు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవే శాలకై కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే దీనిపై తమిళనాడు ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. నీట్ వల్ల సిబిఎస్ఇ, జాతీయ బోర్డు స్కూళ్లలో చదివిన వారికి మాత్రమే ప్రయోజనం చేకూరుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థులు అవకాశాలను కోల్పోతున్నారని ఆరోపించింది. కనీసం ఈ ఏడాదికైనా తమ రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలకు నీట్ నుంచి మినహాయింపు కల్పించాలని కోరింది.

సుప్రీం తీర్పు అభినందనీయం



న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్‌ను నిషేధిస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవడం పట్ల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. న్యాయం కోసం కోర్టుకు వెళ్లిన ముస్లిం మహిళలకు సరైన న్యాయం జరిగిందని, ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఆహ్వానించదగ్గదని ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు. తలాక్ అనేది మహిళల హక్కులను కాలరాయడమేనని, సుప్రీంకోర్టు నిర్ణయం వివక్ష నుంచి మహిళలకు విముక్తి కలిగిస్తుందని అన్నారు. తలాక్‌ను నిషేధించడం పట్ల కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా హర్షం వ్యక్తం చేశారు.

నవ శకానికి ఆరంభం : అమిత్‌షా

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్‌ను నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, ఇది ముస్లిం మహిళల్లో నవ శకానికి ఆరంభమని బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. సుప్రీం తీర్పును బిజెపి స్వాగతిస్తుందని చెప్పారు. ఈ తీర్పుతో దేశంలోని మహిళలందరికీ సమానత్వం లభించిందన్నారు. అనేక ముస్లిం దేశాల్లో కూడా ఈ తలాక్ విధానం అమలులో లేదని అన్నారు. ఇది ఒకరి విజయం, మరొకరి పరాజయం ఎంతమాత్రం కాదని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ హక్కులు, సమానత్వ హక్కుల విజయంగా ఆయన అభివర్ణించారు.

అన్ని మతాల చట్టాల సంస్కరణ



న్యూఢిల్లీ: తలాక్ ఆచారం రాజ్యాంగవిరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వామపక్ష పార్టీలు మంగళవారం స్వాగతించాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా ప్రభుత్వం రాజకీయ దక్షతను ప్రదర్శించాలని సిపిఐ కోరింది. పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ ముస్లిం మతంతో పాటు దేశంలోని అన్నిమతాల వ్యక్తిగత చట్టాలను సంస్కరించడాన్ని ప్రభుత్వం పరిశీలించాలని ఆయన కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ఒకానొక ప్రసంగంలో ట్రిపుల్ తలాక్ గురించి ప్రస్తావించారు. కానీ, మహిళల రిజర్వేషన్ బిల్లుపై మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆయన విమర్శించారు. 'పొలిట్‌బ్యూరో ట్రిపుల్ తలాక్ ఆచారం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తోంది' అని సిపిఎం ఒక ప్రకటనలో పేర్కొంది.

అమలు సులభం కాదు : అసద్

హైదరాబాద్: ట్రిపుల్ తలాక్‌పై సుప్రీం తీర్పు గౌరవిస్తున్నామని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి అన్నారు. అయితే ఈ తీర్పు క్షేత్రస్థాయిలో అమలు చేయడం అంత సులభం కాదని అభిప్రాయపడ్డారు. చట్టాలుచేయడం, తీర్పులు వెలువరించడం వల్ల ప్రయోజనం ఉండదని, ట్రిపుల్ తలాక్ అనేది ఓ సామాజిక అంశమని, సంస్కరణల ద్వారానే మార్పురావాలని అసదుద్దీన్ అభిప్రాయపడ్డారు. సామాజిక సంస్కరణలు జరిగి సమాజంలో మార్పులు రావాల్సి ఉందన్నారు. తీర్పును పూర్తిగా చదివాక మళ్లీ స్పందిస్తామన్నారు.

ప్రభుత్వ యత్నాలకు చెంపపెట్టు

ముంబై: ట్రిపుల్ తలాక్ అంశం విషయంలో న్యాయవ్యవస్థను ప్రభుత్వం కవచంలా వాడుకునేందుకు ప్రయత్నిస్తోందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) మంగళవారం ధ్వజమెత్తింది. అయితే తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు సర్కార్ ప్రయత్నాలకు ఒక చెంపపెట్టు లాంటిదని పార్టీ ప్రతినిధి నవాబ్ మాలిక్ అన్నారు. తలాక్‌పై చట్టాన్ని రూపొందించే విషయంలో రాజకీయ పార్టీల సలహాలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఒక ముసాయిదాను తయారు చేయాలన్నారు.

తీర్పు ప్రగతి శీలమైంది: సోలీ సొరాబ్జీ

న్యూఢిల్లీ: ముస్లిం సమాజంలో అమల్లో ఉన్న వివాదాస్పద 'ట్రిపుల్ తలాక్' రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల న్యాయకోవిదుడు, భారత మాజీ అటార్నీ జనరల్ సోలి సొరాబ్జీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ముస్లిం మహిళల హక్కులను పరిరక్షించే ప్రగతిశీల తీర్పు అని ఆయన ప్రశంసించారు. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని మంగళవారం సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పుపై ఆయన స్పందించారు.

తీర్పుపై తొలుత అయోమయం

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్‌పై ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు పట్ల తొలుత కాస్త అయోమయం నెలకొంది. తీర్పు ఏకగ్రీవంగా ఉందనే భావన తొలుత కల్గింది. అందుకు కారణం...తీర్పులోని కీలకమైన సారాంశాన్ని చదివాక ముగింపు సందర్భంగా సిజెఐ 'మేం..'అని సంబోధించడంతో ఈ తీర్పు న్యాయమూర్తుల సమిష్టి నిర్ణయమే భావన కలిగింది. దాంతో కోర్టుహాల్లోని పలువురు జర్నలిస్టులు తీర్పు గురించి బాహ్య ప్రపంచానికి చెప్పడానికి బయటకు వచ్చారు. కానీ, బెంచ్‌లోని మరో న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ తన తీర్పుకు సంబంధించిన ముఖ్యమైన భాగాన్ని (ఆపరేటివ్ పార్ట్) చదివి విన్పించిన తర్వాత ఈ అయోమయమంతా తొలగిపోయింది. అంతకుముందు వెల్లడించిన సిజెఐ తీర్పుతో జోసెఫ్ తీర్పు భిన్నంగా ఉండటంతో అప్పటవరకు నెలకొన్న గందరగోళం వీడిపోయింది. తలాక్‌పై సిజెఐ, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ 275 పేజీల మైనార్టీ తీర్పును వెల్లడించారు.

'బ్లూ వేల్'పై హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: ఎంతో మంది ఆత్మహత్యలకు కారణమవుతున్న 'బ్లూ వేల్ చాలెంజ్ గేమ్' లింకుల తొలగింపు విషయంలో స్పందించాల్సిందిగా ఇంటర్నెట్ దిగ్గజ సంస్థలు ఫేస్‌బుక్, గూగుల్, యాహూలను ఢిల్లీ హైకోర్టు కోరింది. ఈ ఆన్‌లైన్ గేమ్‌కు సంబంధించిన లింకులను సత్వరమే తొలగించాలని ఇంటర్నెట్ సంస్థలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులను కూడా వివరణ కోరింది. భారత్‌తో పాటు అనేక ఇతర దేశాల్లో ఆత్మహత్యలకు కారణమవుతున్న ఈ గేమ్ లింకులను తొలగించాలని గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్, యావూలకు కేంద్ర ప్రభుత్వం కోరిన విషయం విదితమే.

పద్మవిభూషణ్ పత్రాలకు చెదలు



వారణాసి: సంగీత విద్వాంసులు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పద్మ విభూషణ్ పురస్కార పత్రాలకు పాక్షికంగా చెదలు పట్టాయి. ఆదివారం ఖాన్ 11వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఓ కార్యక్రమం కోసం ఈ పత్రాలను పరిశీలించిన ఆయన కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. 1980లో అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఈ పురస్కారాన్ని ఖాన్‌కు ప్రదానం చేశారని, అప్పటి నుంచి తమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పురస్కార పత్రాలు, సంగీత పరికరాలు, అవార్డులను సంరక్షించేందుకు ఏర్పాట్లు చేయలేకపోయామని ఖాన్ మనవడు నసీర్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తమకున్న ఆర్థిక పరిమితుల నేపథ్యంలో తాము వాటిని సంరక్షించేందుకు ఎంత చేయగలమో అంత చేస్తున్నామని చెప్పారు.

ప్రమాదంలో పళని ప్రభుత్వం

- 19మంది ఎంఎల్ఎలతో గవర్నర్‌ను కలిసిన దినకరన్
- పుదుచ్చేరిలోని రిసార్ట్‌కు శాసనసభ్యుల తరలింపు



చెన్నై: తమిళనాడు రాజకీయాలు మళ్లీ రసకందాయంలో పడ్డాయి. పన్నీర్, పళని వర్గాల ఐక్యతను నిరసిస్తూ అన్నా డిఎంకెలోని దినకరన్ వర్గం ఎంఎల్ఎలు 19మంది ఆయన నాయకత్వంలో మంగళవారంనాడిక్కడ గవర్నర్ విద్యాసాగర్‌రావును కలిశారు. ముఖ్యమంత్రి పళనిస్వామిపై ఇక ఎంతమాత్రం తమకు విశ్వాసం లేదని ఫిర్యాదు చేశారు. అనంతరం దినకరన్ తన వర్గం ఎంఎల్ఎలను పుదుచ్చేరిలోని ఓ రిస్టార్ట్‌కు తరలించినట్లు సమాచారం. గవర్నర్‌తో భేటీ అనంతరం ఎంఎల్ఎ తంగ తమిళ్ సెల్వన్ మీడియాతో మాట్లాడారు. తమకు మద్దతుగా వచ్చే వారం దరితో కలిసి కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోవడానికి చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. పళని ప్రభుత్వం విశ్వాస పరీక్షను ఎదుర్కోవాలన్నదే తమ అభిమతమన్నారు. 122 మంది ఎంఎల్ఎలు అంత కలిసి చిన్నమ్మ శశికళ దయతో సిఎంగా పళని స్వామిని ఎన్నుకున్నామని, కానీ ఆయన ఇప్పుడు చేస్తున్నదేంటనీ ప్రశ్నించారు. పార్టీని క్లిష్టపరిస్థితుల్లోకి నెట్టిన పన్నీర్ సెల్వంతో పళని చేతులు కలపడమేంటని తంగ తమిళ్ దుయ్యబట్టారు. అన్నాడిఎంకెను చీల్చి ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నించిన వాళ్లకు మళ్లీ ప్రభుత్వంలో పదవులు కట్టబెట్టడాన్ని తాము తీవ్ర ంగా నిరసిస్తున్నామన్నారు. పన్నీర్ తిరుగుబాటు తర్వాత ధైర్యంగా పార్టీని తిరిగి ఏకతాటిపై నిలిపిన చిన్నమ్మను ఇప్పుడు అవమానిస్తున్నారని, ఆమెను పార్టీకి దూరం చేయడానికి కుట్రపన్నుతు న్నారని మండిపడ్డారు. అయితే గవర్నర్‌ను దినకరన్ మద్దతుదారులు ఎంత మంది కలిసింది వెల్లడించడానికి రాజ్‌భవన్ వర్గాలు నిరాకరించాయి.

పన్నీర్ సన్నిహితుడిపై దినకరన్ చర్య...



శశికళను అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి పదవి నుంచి త్వరలో దించివేస్తామని సోమవారంనాడు ప్రకటించిన రా జ్యసభ సభ్యుడు, పన్నీర్‌కు విశ్వాసపాత్రుడైన ఆర్.వైథిలింగం పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసివేస్తున్నామని దినకరన్ మంగళవారంనాడు ప్రకటించారు. ఆయన వ్యాఖ్య లు శశికళను అవమానించేవేనని చెప్పారు.

గవర్నర్‌కు విపక్ష నాయకుడు స్టాలిన్ లేఖ...



మరోవైపు రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై విపక్ష నేత, డిఎంకె కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ స్పందించారు. గవర్నర్ విద్యాసాగర్‌రావుకు ఆయన ఒక లేఖ రాశారు. '22మంది శాసనసభ్యులు ప్రభుత్వంపై తమకు విశ్వాసం లేదని చెబుతూ మిమ్మల్ని కలిశారు. దీన్ని బట్టి రాష్ట్రంలో రాజకీయ, రాజ్యాంగ సంక్షోభం ఏర్పడినట్టేనని మేం భావిస్తున్నాం' అని స్టాలిన్ అందులో పేర్కొన్నారు. అసమ్మతి ఎంఎల్ఎల ప్రకటన ద్వారా పళని స్వామి ప్రభుత్వం మైనారిటీలో పడిందని తాము భావిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రిని విశ్వాసం నిరూపించుకోవాలని ఇక ఏ మాత్రం ఆలస్యం చేసినా రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక ప్రభుత్వాన్ని కొనసాగించినట్లు అవుతందని మీడియాకు ఇచ్చిన లేఖల్లో స్టాలిన్ పేర్కొన్నారు. పిఎంకె నేగ అన్బుమణి రాందాస్ కూడా స్పందించారు. పళని స్వామి మెజారిటీ నిరూపించుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.

తలాక్‌పై కొత్త చట్టం అవసరం లేదు

కేంద్ర ప్రభుత్వం వెల్లడి


న్యూఢిల్లీ: ఇస్లాం మతంలోని ట్రిపుల్ తలాక్ ఆచారంపై కొత్తగా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరంలేదని, గృహ హింస సహా ఇప్పటికే అమల్లో ఉన్న చట్టాలే సరిపోతాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం స్పష్టం చేసింది. తలాక్ ఆచారం రాజ్యాంగవిరుద్ధమని తీర్పునిస్తూ దీనిపై ఒక చట్టాన్ని రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు ప్రకటించడం గమనార్హం. 'ట్రిపుల్ తలాక్ అంశాన్ని ప్రభుత్వం ఒక నిర్మాణాత్మక పద్ధతిలో పరిశీలిస్తుంది. సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు మూడు సార్లు తలాక్ చెప్పి విడాకులు పొందే ఆచారాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగానూ, చట్టవిరుద్ధమైనదిగానూ తేల్చిచెప్పారన్న విషయం తీర్పును చదివీచదవగానే స్పష్టమవుతోంది' అని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇక్కడ విలేకరులతో అన్నారు. ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు ఆదేశించినట్లుగా తలాక్‌పై కొత్త చట్టాన్ని తీసుకొస్తారా? అన్న ప్రశ్నకు ఆయన పై విధంగా బదులిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎవరైనా ముస్లిం భర్త విడాకుల కోసం మూడు సార్లు ఉచ్చరించే తలాక్ ఇక చెల్లుబాటు కాదు. వివాహ బంధం పట్ల ఆయనకున్న నిబద్ధత అలాగే కొనసాగుతుంది. తలాక్ తాత్కాలిక రద్దు నేపథ్యంలో భార్య తన భర్తపై పోలీసు స్టేషన్‌లో గృహ హింస నిరోధక చట్టం కింద ఫిర్యాదు చేయడానికి ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఇకపై ఉంటుందని సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు వివరించారు.

నోయిడాలో బెట్టింగ్ ముఠా అరెస్టు

నోయిడా: స్థానిక పోలీసుల సహాయంతో దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముఠాను నోయిడా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ ముఠాతో సంబంధమున్న ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేశారు. నోయిడాలోని సెక్టార్ 20లో అట్టా వద్ద ఓ ఇంట్లో ఈ రాకెట్‌ను నిర్వహిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. బెట్టింగ్ చిట్టీలు, రూ.1 లక్ష నగదును ఈ సందర్భంగా సీజ్ చేసినట్టు వెల్లడించారు. 21 మంది నిందితులను అరెస్టు చేయడంతో పాటు, ఇద్దరు పోలీసులు తక్షణమే సస్పెండ్ చేసినట్టు సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ లవ్ కుమార్ తెలిపారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో అట్టా పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ధర్మేంద్ర శర్మ, కానిస్టేబుల్ మహేంద్రలు ఉన్నారని, వీరిపై శాఖాపరమైన దర్యాప్తు ప్రారంభమైందని వివరించారు.

ఉగ్ర నిధులకు పైరసీ ఊతం : రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: పైరసీ, కాపీరైట్ ఉల్లంఘనలే ఉగ్రవాదులకు ఆర్థికసాయం, నగదు అక్రమ చెలామణీలకు మార్గాలని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అన్ని పోలీసుల శిక్షణ కళాశాలల్లో మేథో సంపత్తి హక్కుల (ఐపిఆర్)పై ప్రత్యేక కోర్సును ప్రకటించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐపిఆర్, కాపీరైట్ ఉల్లంఘనలకు సంబంధించిన నేరాల విషయంలో దర్యాప్తునకు ఈ శిక్షణ దోహదపడుతుందని, సంబంధిత చట్టాలపై అవగాహనను మరింత పెంపొందిస్తుందని చెప్పారు. ఐపిఆర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై జాతీయ వర్క్‌షాపులో ఆయన ప్రసంగించారు. పైరసీ, కాపీరైట్ ఉల్లంఘనలు ప్రజలు, దేశ భద్రతపై తీవ్ర ప్రభావాన్ని చూ పుతాయని, అందుకే వీటిని తేలికగా తీసుకోవద్దని పోలీసు, కస్టమ్స్ తదితర శాఖలకు ఆయన సూచించారు. ఐపిఆర్ సంబంధిత నేరాలను అదుపు చేయడానికి ప్రభుత్వం, హోంమంత్రిత్వశాఖలు అత్యధిక ప్రాధాన్య త ఇస్తున్నాయని, రాష్ట్రాల పోలీసు విభాగా లు కూడా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.



ట్రిపుల్ ఆనందం

విడాకుల కోసం ముస్లిం మతం అనుసరిస్తున్న ట్రిపుల్ తలాక్ ఆచారం రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం సంచలన తీర్పునిచ్చింది. మూడు సార్లు తలాక్ పదాన్ని ఉచ్చరించడం ద్వారా, ఫోన్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా, ఉత్తరాలు లేదా వాట్సయాప్ ద్వారా విడాకులిచ్చే ఆచారానికి ఈ తీర్పు గొడ్డలిపెట్టు అవుతుంది. ఇలాంటి ఆచారం రాజ్యాంగం దేశ పౌరులకు ప్రసాదించిన సమానత్వపు హక్కును ఉల్లంఘించడంతో సమానం. అయితే ఈ ఆచారం వల్ల బాధితురాలిగా మారిన షయారా బానోతో పాటు మరో నలుగురు బాధితులు వేసిన పిటిషన్లను విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఇలాంటి తీర్పు వెనుక తలాక్‌కు వ్యతిరేకంగా పోరాడిన సదరు ఐదుగురు బాధిత ముస్లిం మహిళల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం...

తలాక్‌పై పోరాడిన ఐదుగురు ముస్లిం వనితలు

గుల్షాన్ పర్వీన్ (30)

ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లాకి చెందిన గుల్షాన్ పర్వీన్ ట్రిపుల్ తలాక్‌ని రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ వేశారు. 2015లో, తన తల్లిదండ్రుల వద్ద ఉన్న సమయంలో తన భర్త ఒక పది రూపాయల స్టాంపు పేపరుపై తలాక్‌నామా రాసి తనకు పంపాడని ఆమె చెప్పారు. ఆంగ్ల సాహిత్యంలో పిజి చేసిన ఆమె అదనపు కట్నం కోసం సుమారు రెండేళ్లుగా తన భర్త తనను వేధించాడని ఆమె ఆరోపించారు. 'నా భర్త నాకు తలాక్‌నామా పంపడంతో హఠాత్తుగా నేను నా రెండున్నరేళ్ల కొడుకు రిదా న్ దిక్కులేని వాళ్లమైపోయాం' అని పర్వీన్ చెప్పినట్లు ఎన్‌డిటివి ఉటంకించింది. తలాక్‌నామా ద్వారా విడాకులు తీసుకోవడానికి తాను నిరాకరించిన నేపథ్యంలో తన భర్త వివాహ రద్దు కోసం రాం పూర్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారని ఆమె చెప్పారు. పర్వీన్ తల్లిదండ్రులకు ఆమె ఆఖరిదైన ఆరో సంతానం. ఏప్రిల్, 2013లో ఆమెకు వివాహమయింది. వరకట్న వేధింపులు, నేరపూరిత బెదిరింపుల అభియోగాల కింద ఆమె భర్తను 2015లో పోలీసులు అరెస్టు చేశారు.



షయారా బానో (36)

ఉత్తరాఖండ్‌లోని హేమపూర్ దయాకి చెందిన షయారా బానో ట్రిపుల్ తలాక్ ఆచారానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె సోషియాలజీ విభాగంలో ఎంఎ చేశారు. ఆమె తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లిన సమయంలో అక్టోబరు 15, 2015న ఆమె భర్త రిజ్వాన్ అహ్మద్ తలాక్ పదాన్ని మూడు సార్లు రాసిన ఒక లేఖను పంపి విడిపోయినట్లు ప్రకటించాడు. దాంతో ఫిబ్రవరి 23, 2016న ఆమె ట్రిపుల్ తలాక్, నిఖా హలాలా, బహుభార్యత్వ అచారాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమెకు విడాకులిచ్చిన తర్వాత అలహాబాద్‌లో ప్రాపర్టీ డీలర్‌గా పనిచేసే రిజ్వాన్ ఆమె ఇద్దరు పిల్లలు ఇర్ఫాన్ (13), మస్కన్ (11)లను తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో షయారా కొన్ని నెలల పాటు మానసిక వేదనకు గురయ్యారు. ప్రధానంగా తనను చంపేయాలన్న దురాలోచనతో తన అత్తమామలు ఆరుసార్లు అబార్షన్ చేయించుకునే విధంగా తనను బలవంతం చేశారని ఆమె ఆరోపించారు. దిక్కుతోచని షయారా స్థానికంగా ఉండే ఒక మతపెద్దను కూడా సంప్రదించి తన గోడును ఆయనకు వినిపించారు. అయితే తలాక్ చెల్లుబాటు అవుతుందని ఆయన తనకు చెప్పారని ఆమె వాపోయారు. ఈ నేపథ్యంలో తలాక్ చెల్లదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ముస్లిం మహిళలకు ఇది చారిత్రాత్మకమైన రోజుగా ఆమె అభివర్ణించారు.

ఆఫ్రీన్ రెహ్మాన్ (28)

వివాహ పోర్టల్‌లో ఎంపిక చేసిన వరుడితో జైపూర్‌కు చెందిన ఆఫ్రీన్ రెహ్మాన్‌కు 2014లో వివాహమయింది. ఆమె ఎంబిఎ చేశారు. అయితే వివాహమైన రెండు నెలలకే తన అత్తమామలు తనను అదనపు కట్నం కోసం తనను మానసికంగా వేధించడం మొదలుపెట్టారని ఆమె ఆరోపించారు. చివరకు తనను కొట్టారని కూడా ఆమె చెప్పారు. సెప్టెంబరు, 2015లో ఇల్లు విడిచిపెట్టి వెళ్లిపోవాలంటూ వారు తనను బెదిరించారని కూడా ఆమె చెప్పారు. దాంతో తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లానని ఆమె చెప్పారు. జనవరి, 2016లో తలాక్ రాయబడిన ఒక లేఖ స్పీడ్‌పోస్ట్ ద్వారా తనకు వచ్చిందని ఆమె తెలిపారు. 'దేశంలో తలాక్ ఆచార రద్దు దిశగా సుప్రీంకోర్టు తాజా తీర్పు నాంది పలుకుతుంది. తలాక్ ఆచారానికి వ్యతిరేకంగా ఒక చట్టాన్ని మేము కోరుకుంటున్నాం. ఈ దిశగానే కోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. పాదరక్షలను ఇంటి నుండి బయటకు విసిరేసినట్లుగా తలాక్ పేరిట ముస్లిం మహిళలపై జరుగుతున్న క్రూరత్వం ఇక సమాప్తం కాగలదు' అని అఫ్రీన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆతియా సబ్రి

పశ్చిమ యుపిలోని షహరన్‌పూర్‌కి చెందిన ఆతియా సబ్రి ఈ కేసులో ఆఖరి పిటిషనర్. 2012లో వజీద్ అలీతో ఆమెకు వివాహమయింది. ఆమెకు తలాక్ రాయబడిన ఒక కాగితం ముక్కను పంపి విడిపోతున్నట్లు అతను ప్రకటించాడు. నవంబరు, 2015లో దానిని ఆమె సోదరుడు పనిచేసే కార్యాలయానికి పంపారు. అయితే విడాకులను సవాలు చేస్తూ ఆమె ఈ ఏడాది జనవరిలో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ట్రిపుల్ తలాక్ ముస్లిం మహిళల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుందని ఆమె తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. వారిలో ఒకరికి నాలుగేళ్లు మరొకరికి మూడేళ్లు. తనకు రెండో కుమార్తె జన్మించిన తర్వాత తన అత్తమామలు తనపై విషప్రయోగం చేసి చంపాలని చూశారని ఆతియా ఆరోపించారు. ఈ ఘటనలో తన భర్తను పోలీసులు అరెస్టు చేశారని, ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోందని ఆమె చెప్పారు. 'నాకు తలాక్ చెప్పి విడాకులివ్వడం ధర్మం కాదు. నా పిల్లలను పెంచి పెద్దవాళ్లను చేయాల్సిన బాధ్యత నాపై పడింది. అందువల్ల నాకు న్యాయం జరగాలి' అని ఆమె పేర్కొన్నారు.

భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బిఎంఎంఎ)



ట్రిపుల్ తలాక్ కేసులో భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బిఎంఎంఎ) కూడా ఒక కక్షిదారుగా ఉంది. తలాక్ ఆచారాన్ని రద్దు చేయాలని 92 శాతం మంది ముస్లిం మహిళలు కోరుకుంటున్నారని వెల్లడించిన సర్వే ఆధారంగా బిఎంఎంఎ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. తలాక్ కేసులో అత్యున్నత న్యాయస్థానమిచ్చిన తాజా తీర్పు పట్ల జకియా సోమన్ ఆధ్వర్యంలో ముంబై కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ ఆనందం వ్యక్తం చేసింది.



ఇష్రాత్ జహాన్ (31)

పశ్చిమ్‌బెంగాల్‌లోని హౌరా పట్టణంలో నివసించే ఇష్రాత్ జహాన్‌కు దుబాయ్‌లో ఉండే ఆమె భర్త ముర్తజా ఫోన్ కాల్ ద్వారా తలాక్ చెప్పి విడాకులిచ్చాడు. 15 ఏళ్ల పాటు తనతో సంసారం చేసిన ముర్తజా ఏప్రిల్, 2015న తనకు కాల్ చేసి మూడు సార్లు తలాక్ పదాన్ని ఉచ్చరించి ఫోన్ పెట్టేశాడని ఆమె వాపోయారు. తర్వాత మరో మహిళను వివాహం చేసుకున్నాడని, తమ నలుగురు పిల్లల్ని కూడా అతను తనతోపాటే తీసుకెళ్లిపోయాడని జహాన్ ఆరోపించారు. 'సుప్రీంకోర్టు తీర్పు పట్ల నాకు చాలా ఆనందంగా ఉంది. అత్యున్నత న్యాయస్థానం సరైన తీర్పునిచ్చింది. న్యాయం జరుగుతుందని నేను ఇపుడు అనుకుంటున్నాను. రెండేళ్లుగా నేను న్యాయపోరాటం చేస్తున్నాను' అని జహాన్ చెప్పారు. తాను విడాకులకు వ్యతిరేకం కాదని, అయితే దానికి ఒక సక్రమమైన పద్ధతి ఉండాలని తాను భావిస్తున్నట్లు ఆమె అన్నారు. జహాన్, ముర్తజా ఇద్దరు బీహార్‌కు చెందినవారే. 2000లో వివాహమైన తర్వాత వారు బీహార్ నుండి హౌరా వెళ్లారు. ముగ్గురు ఆడ పిల్లలు జన్మించిన తర్వాత వారిద్దరి మధ్య సంబంధం దెబ్బతింటూ వచ్చింది. కొత్తగా వచ్చే భార్యకు కొడుకు పుట్టవచ్చన్న భావనతో ముర్తజా మరోసారి వివాహం చేసుకోవాలని భావించాడు. కానీ, 2010లో ఇష్రాత్, ముర్తజాకు మగ సంతానం కలిగినప్పటికీ, వారిద్దరి మధ్య బంధం మాత్రం బలపడలేదు.



దావూద్ ఇబ్రహీంకు 21 మారు పేర్లు : బ్రిటన్

లండన్ : ముంబయి మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంపై విధించిన ఆర్థిక పరమైన ఆంక్షలు కొనసాగించనున్నట్లు సోమవారం బ్రిటన్ ప్రకటించింది. దావూద్ ఇబ్రహీం 21 మారు పేర్ల జాబితాను బ్రిటన్ విడుదల చేసింది. 1993లో ముంబయి బాంబు పేలుళ్ల కేసుతో పాటు భారత్‌లో ఉగ్రవాద చర్యలు, పలు నేరాలకు పాల్పడ్డారు. ఉగ్రవాదం, నేరాలకు పాల్పడిన దావూద్ ఇబ్రహీం భారత్ అత్యవసరంగా అరెస్ట్ చేసే వారి జాబితాలో ఉన్నారు. దావూద్ ఇబ్రహీం తాజాగా బ్రిటన్ ఆర్థిక ఆంక్షలు విధించిన వ్యక్తుల సమాచారాన్ని ట్రెజరీ కార్యాలయ రికార్డులో చేర్చింది. భారత్, పాకిస్థాన్‌లలో పలు అడ్రస్‌లలో ఆయన తీసుకున్న పాస్‌పోర్టులను ఆయన ఖాతాకు జత చేసింది. దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లో ఉన్నాడనే ఆరోపణలు ఆ దేశం తిరస్కరిస్తోంది. నవంబర్ 2003లో బ్రిటన్ మొదటిసారిగా ఆయన ఆస్తులను స్తంభింపజేసింది. బ్రిటన్ ట్రెజరీ పద్దులో దావూద్ ఇబ్రహీం 21 మారు పేర్లను చేర్చారు. అల్ ఖైదా, ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్న 261 మంది జాబితాలో బ్రిటన్ దావూద్ ఇబ్రహీం పేరును చేర్చింది.

ఉగ్రవాదుల స్వర్గధామం పాక్

- పాక్ వైఖరిని ఎండగట్టిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఆఫ్ఘన్‌లో మరింతగా భారత్ ప్రమేయానికి పిలుపు
- దక్షిణాసియా పట్ల వ్యూహంలో అగ్రదేశం మార్పులు



వాషింగ్టన్: ఆఫ్ఘనిస్థాన్, దక్షిణాసియాపట్ల తన నూతన వ్యూహాన్ని ఆవిష్కరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం నాడు పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. టెర్రరిస్టుల ఆశ్రమంగా ఆ దేశాన్ని ఆయన కఠిన పదజాలంతో తప్పుపట్టారు. అది అరాచకాన్ని సృష్టించే శక్తుల స్వర్గధామంగా మారిందని, టెర్రరిస్టులను తరిమేయడానికి పాకిస్థాన్ ఎంతో చేయవలసి ఉందని ట్రంప్ అన్నారు. దేశాన్ని ఉద్దేశించి కమాండర్ ఇన్ చీఫ్‌గా ట్రంప్ తొలి టివి ప్రసంగం చేస్తూ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. టెర్రర్ గ్రూపులకు ఆ దేశం ఆశ్రయమిస్తోందని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. తమ దేశం పాకిస్థాన్‌కు వందల బిలియన్ల డాలర్ల సహాయాన్ని అందిస్తుంటే, మరోపక్క ఆ దేశం ఉగ్రవాదులకు ఆశ్రయం కొనసాగిస్తోందని ట్రంప్ విమర్శించారు. గతంలో పాకిస్థాన్ తమ విలువైన భాగస్వామిగా ఉందని ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా తమ సైన్యాలు కలిసి కృషి చేశాయని ఆయన అన్నారు. అయితే ఇప్పుడు టెర్రరిజం వల్ల పాక్ ప్రజలు తీవ్రంగా దెబ్బతిన్నారని చెప్పారు. అందుచేత టెర్రర్ గ్రూపుల నిలయంగా మారవద్దని పాక్‌కు సూచించారు. అరాచకం, హింస, ఉగ్రవాదం రెచ్చగొట్టే శక్తులకు స్వర్గధామంగా పాక్ మారిందని ఆయన అన్నారు. భారత్, పాకిస్థాన్‌లు రెండు అణ్వాయుధ సంపన్న దేశాలు కావడంతో వాటి మధ్య గల వైషమ్యాలు పెద్ద సంఘర్షణగా మారే ప్రమాదం ఏర్పడిందని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆ ఇరు దేశాల సంబంధాల్లో ఉద్రిక్తతలు కొనసాగడాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. సమగ్ర సమీక్ష తర్వాత ఆఫ్ఘనిస్థాన్, దక్షిణాసియాపట్ల అనుసరిస్తున్న వ్యూహంలో పెనుమార్పులకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా కీలక ప్రయోజనాలకు సంబంధించి మూడు ప్రాథమిక నిర్ధారణలకు వచ్చామని తెలిపారు. మొదటిది — ఆ వ్యూహం గౌరవప్రదమైన, నిలకడగల ఫలితాలను అందించాలని, ఈ సరికే ఎన్నో త్యాగాలకు ఓర్చి అనుసరించిన వ్యూహం అదని ఆయన చెప్పారు. రెండోది — వేగంగా ఆఫ్ఘనిస్థాన్ నుంచి వైదొలగడం మంచిది కాదని, ఆమోదయోగ్యం కాదని కూడా అన్నారు. అమిత వేగంతో సంకీర్ణ సేనలను పూర్తిగా ఉపసంహరిస్తే ఆ ఖాళీలోకి ఐఎస్‌ఐఎస్, అల్ ఖైదా తక్షణమే దూరిపోతాయన్నారు. అమెరికాపై అల్ ఖైదా భీకర టెర్రరిస్టు దాడి (9/11) కి ముందు అటువంటి ఖాళీ ఏర్పడిందని ఆయన వివరించారు. మూడవది— కొత్త వ్యూహంలో నూతన స్తంభం పాకిస్థాన్ పట్ల అమెరికా వైఖరి మారడంగా ఆయన వివరించారు. టెర్రరిస్టులకు ఆశ్రయం ఇవ్వడం కొనసాగిస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని పాకిస్థాన్‌ను కఠిన పదజాలంతో హెచ్చరించారు. ఈ సమస్యపట్ల తాము ఇక మౌనంగా ఉండజాలమని హెచ్చరించారు. తాలిబన్, ఇతర గ్రూపుల టెర్రరిస్టులకు పాకిస్థాన్ మెరుగైన ఆశ్రయం కల్పిస్తోందని నొక్కి చెప్పారు.

భారత్‌కు అమెరికా మరింత చేరువ

ఈ సందర్భంగా భారతదేశంతో మరింత సాన్నిహిత్యాన్ని ట్రంప్ ప్రకటించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రతిజ్ఞ గైకొన్నారు. యుద్ధంతో చిన్నాభిన్నమైన ఆఫ్ఘనిస్థాన్‌కు మరింతగా సహాయం అందించాలని భారత్‌ను కోరారు. భారత దేశంతో కీలక రక్షణ భాగస్వామ్యం పెంపు దక్షిణాసియా పట్ల తాము మార్చుకోనున్న వ్యూహంలో ముఖ్యమైనది వివరించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, సుస్థిరత నెలకొల్పడానికి భారత్ మరింతగా ఆర్థికపరమైన ప్రమేయం కూడా కల్పించుకోవాలని ఆయన సూచించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ తమ కీలక ఆర్థిక, భద్రతా భాగస్వామి అని ట్రంప్ పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో సుస్థిరత కోసం భారత్ కృషిని ప్రశంసించారు. తమతో వేలాది కోట్ల డాలర్ల వాణిజ్యం నెరపుతున్న భారత దేశం ఆఫ్ఘనిస్థాన్‌పట్ల తమకు మరింతగా సహాయపడాలని కోరుతున్నామని ట్రంప్ పేర్కొన్నారు. దక్షిణాసియాలో ముఖ్యంగా భారత్ — పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను సాధించడమే లక్ష్యంగా భారత్‌తో కలిసి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

సేనలను ఉపసంహరించుకోండి

అమెరికాకు తాలిబన్ల హెచ్చరిక

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్‌కు వేలాది మంది అదనపు సంకీర్ణ బలగాలను పంపడానికి ట్రంప్ మార్గం సుగమం చేయడాన్ని తాలిబన్ తీవ్రంగా ఖండించింది. అదే జరిగితే అమెరికాకు తమ దేశం సమాధిగా మారుతుందని హెచ్చరించింది. తమ దేశం నుంచి సేనలను అమెరికా ఉపసంహరించకపోతే 21వ శతాబ్దంలో అమెరికా సమాధిగా ఆఫ్ఘనిస్థాన్ మారుతుందని ఆ దేశపు తాలిబన్ ప్రతినిధి జబీయుల్లా ముజాహిద్ పేరిట వెలువడిన ప్రకటన హెచ్చరించింది. యుద్ధాన్ని కొనసాగించడం కాకుండా ఆఫ్ఘనిస్థాన్ నుంచి వెళ్లిపోవడం ఎలా అన్నది అమెరికా ఆలోచించాలని, తమ దేశం ఒక్క అమెరికా సైనికుడు ఉన్నా తమపై యుద్ధాన్ని రుద్దుతారని ఆ ప్రకటన పేర్కొంది. అటువంటి పరిస్థితిలో మరింత దీక్షతో జీహాద్ కొనసాగిస్తామని ముజాహిద్ హెచ్చరించారు.

ఉగ్రపోరులో పాక్ భేష్ : చైనా

బీజింగ్: అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా హెచ్చరించిన నేపథ్యంలో తన చిరకాల మిత్రదేశం పాకిస్థాన్ రక్షణకు చైనా మంగళవారం నాడు నడుంకట్టింది. టెర్రరిజాన్ని అరికట్టడంలో పాకిస్థాన్ ముందుందని చైనా కితాబు ఇచ్చింది.పాక్ పట్ల కఠిన పదజాలంతో ట్రంప్ చేసిన వ్యాఖ్యలను చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చునియింగ్ ప్రస్తావిస్తూ ఆ ప్రాంతంలో శాంతి సుస్థిరతలను కాపాడే విధానాన్ని అమెరికా అనుసరిస్తుందన్న ఆశాభావాన్ని ప్రకటించారు. టెర్రరిజంతో పోరాటంలో పాకిస్థాన్ ఎన్నో త్యాగాలు చేసిందని కూడా ఆయన అన్నారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో శాంతికి ఎంతో దోహదపడిందని ప్రశంసించారు.

ఇటలీలో భూకంపం : ఇద్దరి మృతి

రోమ్: ఇటలీలోని ఇస్చియా విరామ కేంద్రంలో మంగళవారం నాడు 4.0 తీవ్రతగల భూకంపం సంభవించి ఇద్దరు మరణించారు. టూరిస్టుల తాకిడి భారీగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఈ భూకంపం తీవ్రంగా విధ్వంసాన్ని మిగిల్చినట్లు అధికార్లు చెప్పారు. శిథిలాల నుంచి ఇద్దరు పిల్లలను రక్షించడానికి సహాయక సిబ్బంది రోజంతా శ్రమించారు. చిన్న టూరిస్టు దీవిలో సంభవించిన ఈ భూకంపంలో ఒక శిశువును ప్రాణాలతో రక్షించిన సిబ్బంది ఆమె తాలూకు ఇద్దరు సోదరుల కోసం గాలిస్తున్నారు. వారు జీవించే ఉన్నారని, సహాయం కోసం అర్థిస్తున్నారని తెలిసింది.

సైన్యం ఆధీనంలో మాల్దీవుల పార్లమెంట్



మాలె : మాల్దీవులలలో అనూహ్యం పరిణామం చోటుచేసుకుంది. ఆ దేశ పార్లమెంట్‌ను సైన్యం ఆక్రమించుకుంది. పార్లమెంట్‌హాల్‌లోకి సైనికులు ప్రవేశించి ప్రతిపక్ష సభ్యులను లోనికి ప్రవేశించకుండా అడ్డుకున్నారు. ప్రతిపక్ష మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండిపి) స్పీకర్ తీరుకు నిరసనగా అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ అభిశంసన తీర్మానం నేపథ్యంలో సైన్యం లోనికి ప్రవేశించి విపక్ష సభ్యులను ఈడ్చేపారిసింది. తీర్మానాన్ని అడ్డుకునేందుకు అధికార పక్షం సైన్యాన్ని వినియోగించుకుందని విపక్ష పార్టీ ఆరోపించింది. సాధారణ దుస్తుల్లో వచ్చిన సైనికులు తమను హాల్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారని తమతో దురుసుగా ప్రవర్తించారని ఎండిపి నేత ఇంతియాజ్ ఆరోపించారు. తమ సభ్యుల్లో కొందరు కష్టంగా హాల్‌లోకి ప్రవేశించారని, అయితే స్పీకర్‌కు రక్షణ వలయంగా పెద్దసంఖ్యలో సైనికులు నిల్చున్నారని చెప్పారు. తమను అడ్డుకోవడానికి అధ్యక్షుడు యమీన్ సైన్యాన్ని ప్రయోగించారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని, అక్రమమని ప్రతిపక్ష నేతలు మండిపడ్డారు.

జూ.సివిల్ జడ్జిల కేటాయింపుల కేసు విచారణ వాయిదా

మన తెలంగాణ/న్యూఢిల్లీ : తెలంగాణలో జూనియర్ సివిల్ జడ్జిల కేటాయింపునకు సంబంధించిన కేసు తదుపరి విచారణ సెప్టెంబర్5కి సుప్రీకోర్టు వాయిదా వేసింది. సోమవారం దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఉమ్మడి హైకోర్టు పరిధిలో విభజన సమయానికి ఉన్న జూనియర్ సివిల్ జడ్జిల పోస్టుల ఖాళీలు, తదితర వివరాలను వచ్చే బుధవారం కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు పరిధిలో జూనియర్ సివిల్ జడ్జిల నియామకాలకు సంబంధించిన మార్గదర్శకాలపై కేంద్ర ప్రభుత్వం ఆఫడవిట్ సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం సమర్పించిన మార్గదర్శకాలపైననే దాదాపు 45నిమిషాల పాటు వాదనలు జరిగాయి. జస్టిస్ చలమేశ్వర్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గంటసేపు వాదనలు విని కేసు తదుపరి విచారణను వాయిదా వేసింది. గతంలో ఉమ్మడి హైకోర్టు పరిధిలో జూనియర్ సివిల్ జడ్జిల దాదాపు నియామకానికి సంబంధించి మార్గదర్శకాల తయారీకి కేంద్రం మరింత గడువు కావాలని కోరడంతో తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 22కి వాయిదా వేసింది. క్యాడ ర్ విభజనపై ఉమ్మడి హైకోర్టు రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలను వ్యతిరేకిస్తూ తెలంగాణ సబార్డినేట్ కోర్టుల న్యాయమూర్తుల సం ఘం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం జూన్ 17లోగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎంత మంది సబార్డినేట్ జ్యుడీషియల్ అధికారులు ఉండా లో ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించి సమర్పిస్తే సుప్రీంకోర్టే తుది మార్గదర్శకాలను తయారు చేస్తుందని గత విచారణలో స్పష్టంచేసింది.

పోలింగ్ ఏజెంట్ల విధులకు ఆటంకం కలిగించొద్దు : హైకోర్టు


మన తెలంగాణ/హైదరాబాద్ : నంద్యాల ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి తరపు పోలింగ్ ఏజెంట్ల విధులకు ఆటంకం కలిగించవద్దని, విధులు నిర్వర్తించకుండా నిరోధించరాదని ఎపి పోలీసులకు హైకోర్టు ఆదేశించారు. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే వారిపై చట్టానికి అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చునని స్పష్టం చేసింది. పోలింగ్ ఏజెంట్లుగా తమ పేర్లు ఇచ్చిన వెంటనే పోలీసులు తమ ఇళ్లకు వచ్చి వేధింపులకు గురిచేస్తున్నారంటూ వైసిపి పోలింగ్ ఏజెంట్లు ఎం. విజయశేఖర్‌రెడ్డి మరో 44 మంది వేసిన రిట్లను మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి చల్లా కోదండరామ్ విచారించారు. పిటిషనర్లు ఏజెంట్లుగా పేరు ఇచ్చిన తర్వాత పోలీసులు వాళ్ల ఇళ్లకు వచ్చి వేధింపులకు పాల్పడ్డారని వారి తరపు న్యాయవాది జి. వెంకటేశ్వరరావు వాదించారు. వైసిపికి పోలింగ్ ఏజెంట్లు లేకుండా చేయడమే పోలీసుల లక్ష్యంగా ఉందన్నారు. పిటిషనర్లుగా ఉన్న వారిపై పోలీసు కేసులున్నాయని, చట్ట ప్రకారం పోలీసులు చర్యలు తీసుకోవచ్చునని హోం శాఖ న్యాయవాది విద్యావతి ప్రతివాదన చేశారు. పలువురిపై కేసులు ఉన్నాయన్నారు. కేసులుంటే పోలింగ్ ఏజెంట్లుగా ఉండకూడదా అని పిటిషనర్ లాయర్ ప్రశ్నించారు. వాదనల అనంతరం న్యాయమూర్తి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినప్పుడు మాత్రమే చర్యలు తీసుకుకోవాలని, పోలింగ్ ఏజెంట్ల విధులను అడ్డుకోరాదని పోలీసులకు తేల్చి చెప్పారు.

మేం చొచ్చుకొస్తే విధ్వంసమే

- భారత్‌కు చైనా మరోసారి హెచ్చరిక

బీజింగ్: డోక్లామ్ వివాదం నేపథ్యంలో చైనా మరోసారి భారత్‌ను గట్టిగా హెచ్చరించింది. 'మా సైన్యం అక్రమంగా ప్రవేశించిందనే సాకుతో భారత్ మా భూభాగంలోకి ప్రవేశించాలని చూస్తే పరిస్థితులు మరింత దారుణంగా మారతాయి' అని బెదిరింపులకు దిగింది. మా ఓపిక నశిస్తోందని, మేం భారత్ భూభాగంలోకి చొచ్చుకొని వెళితే విధ్వంసమే జరుగుతుందని అని హెచ్చరించింది. డోక్లామ్ సరిహద్దులో చైనా రహదారి నిర్మాణ పనులను చేపడితే అది తమకు ప్రమాదకరం అని భారత్ చేస్తున్న వాదన హాస్యాస్పదంగా, దుర్మారంగా ఉందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి హు చునియింగ్ హెచ్చరించారు. అదే సమయంలో వేరే దేశం మా భూభాగంలోకి ప్రవేశించడాన్ని ఎంతమాత్రం సహించబోమన్నారు. డోక్లామ్ సరిహద్దు అంశంపై భారత్‌చైనా మధ్య రెండున్నర నెలలుగా ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. అక్కడ చైనా చేపట్టిన రహదారి నిర్మాణ పనులను భారత్ అడ్డుకోవడంతో వివాదం రాజుకుంది. సరిహద్దు నుంచి భారత సైన్యం వెనుదిరిగితే తప్ప ఈ వివాదంపై ద్వైపాక్షిక చర్చలు జరగవని చైనా తేల్చి చెబుతోంది.

బంగ్లాలో15 మందికి మరణ శిక్ష



ఢాకా: మూడేళ్ల క్రితం ఏడుగురిని హత్యచేసి భారత్‌కు పారిపోయిన 15 మంది దుండగు లకు బంగ్లాదేశ్ హైకోర్టు మంగళవారం నాడు మరణ శిక్ష ఖరారు చేసింది. కింది కోర్టు ఈ విషయంలో ఇచ్చిన తీర్పును హైకోర్టు బలపరిచింది. శిక్ష పడిన వారిలో ముగ్గురు సైనిక అధికారులు, ఒక ముఖ్య నేరస్థుడు కూడా ఉన్నారు. ఆ హత్య తర్వాత వారు భారత్‌కు పారిపోయారు. వారు చంపిన వారిలో కౌన్సిలర్ నజ్రుల్ ఇస్లాం, న్యాయవాది చందన్ కుమార్ సర్కార్ కూడా ఉన్నారు. నారాయణ గంజ్ రేవు పట్టణంలో జరిగిన ఈ హత్యలు దేశాన్ని కుదిపాయి. ఈ కేసులో మరి 11 మందికి దిగువ కోర్టు విధించిన మరణ శిక్షను యావజ్జీవ ఖైదుగా హైకోర్టు మార్చింది.

హామీలు గాలికి.. ప్రజా హక్కులపై దాడి

- తెలంగాణలో మూడేళ్ల పాలనపై ఢిల్లీ సెమినార్‌లో సురవరం


మన తెలంగాణ/న్యూఢిల్లీ: పేర్లలో సారుప్యత ఉన్న తెలుగు రాష్ట్రాల సిఎంలు ప్రజలను అణచివేయడంలో కవల పిల్లల లాగా వ్యవహరిస్తున్నారని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ఆరోపించారు. కెసిఆర్ కి సంస్కారం నేర్పించాలని సూచించిన ఆయన, బూతులు మాట్లాడే సిఎంగా ఏదైనా అవార్డు ఉంటే దేశంలో కెసిఆరే దానికి అర్హుడు అని సూచించారు. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో కెసిఆర్ మూడేళ్ళ తెలంగాణ పాలన పై సోమవారం సాయంత్రం ఢిల్లీలోని కానిస్టూషన్ క్లబ్ లో సెమినార్ జరిగింది. ఈ సెమినార్ కి టిజెఎసి చైర్మన్ కోదండరాం, తెలంగాణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట రెడ్డి, సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్, ప్రశాంత్ భూషణ్, బిజెపి నాయకుడు కృష్ణ సాగర్ రావు, ప్రముఖ నీటి పారుదల రంగం నిపుణుడు వెదిరె శ్రీరామ్, ఇప్టు ప్రెసిడెంట్ డాక్టర్ అపర్ణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, కెసిఆర్ మూడు సంవత్సరాల పాలనలో తెలంగాణ గురించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన సందర్భంగా సమస్యలన్నీ ఏడాది, రెండేళ్లలో పరిష్కారం అవుతాయని అనుకున్నాం, కానీ ఇచ్చిన హామీల్లో కొన్ని కూడా నెరవేర్చలేదనేది స్పష్టం అయ్యిందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఇప్పుడు వెళ్తున్న వేగంతో వెళితే 300 ఏళ్ళు పడుతుందని ఎద్దేవా వేశారు. తెలంగాణలో ప్రాజెక్టుల విలువ పెంచి కాంట్రాక్టర్లకు మేలు చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందంటూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఎవ్వరూ ఊహించని దాడి ప్రజా హక్కులపై తెలంగాణ ప్రభుత్వం చేస్తోందని, ఉద్యమాల ద్వారా, నిరసనల ద్వారా తెచ్చుకున్న తెలంగాణలో అణిచివేత ధోరణితో వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ లో పోలీస్ రాజ్యం కొనసాగుతోందనిపిస్తోందని ఆరోపించిన సురవరం సుధాకర్ రెడ్డి, నిజాం నిరంకుశ పాలన మళ్ళీ తెలంగాణ లో కనిపిస్తోందన్నారు. చంద్రశేఖర్ రావు గారి రాజ్యంలో ఇసుకకి, ఇసుక లారీలకు ఉన్న విలువ ప్రజలకు, ప్రజల ప్రాణాలకు ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యలు, పార్టీల సమస్యలు తెలుసుకోని ముఖ్యమంత్రి పరిపాలనకి అనర్హుడంటూ విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. తెలంగాణలో ఉపాధికల్పన లేదు, రైతుల ఆత్మహత్యలు ఆగడంలేదు, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం అవుతుంది. మహిళలకు రక్షణ కరువైంది, మీడియా ప్రకటనల బడ్జెట్ 500కోట్లు పెంచి పత్రికలపైనా నియంత్రణ, పత్రికలపై అప్రకటిత సెన్సార్ షిప్ తో పాటు విపరీతమైన ఆంక్షలు ఉన్నాయని టిజెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. ప్రముఖ సామాజిక వేత్త స్వామి అగ్నివేష్ మాట్లాడుతూ.. కెసిఆర్ పాలనపై తెలంగాణలో ప్రజలు తొందరగా మేల్కొన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మొదట ఇందిరా పార్కు దగ్గర ధర్నా చౌక్ సాధించుకోవడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినప్పుడే అవినీతి రహిత పాలన సాధ్యం అవుతుందని నమ్ముతున్నానని అన్నారు. సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాదిప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ తెలంగాణ రాకముందు ఎలా వుందో దానికంటే పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రలో ఇప్పటివరకు జరిగిన సంఘటనల్లో ఒకరికి అధికారం ఇస్తే దుర్వినియోగం చేయకుండా ఉన్న వాళ్ళు చాలా తక్కువ అని కెసిఆర్ విషయంలో అలానే జరిగిందని అన్నారు. ప్రస్తుతం మనం ఆందోళన చేపట్టాల్సిన సమయం వచ్చేసిందని తెలంగాణ ప్రజలకు సూచించిన ఆయన, ఒక నాయకుడికి అధికారం ఇచ్చి వాళ్ళ కుటుంబానికి అధికారం అంటగట్టాల్సిన అవసరం లేదని అన్నారు. తెలంగాణలో ప్రజల పరిస్థితి పెనంలో నుండి పొయ్యిలో పడ్డట్లుగా తయారైందని, దేశంలో అత్యంత అవినీతి ప్రభుత్వాల్లో తెలంగాణ ప్రభుత్వం అందరితో పోటీపడుతోందంటూ విమర్శనాస్త్రాలు సంధించారు.



సిడిపి నిధులపై ఆడిట్ ఆగదు

మన తెలంగాణ/హైదరాబాద్ : నియోజకవర్గ అభివృద్ధి ప్రోగ్రాం (సిడిపి) కింద ప్రభుత్వం ఏటా ఇచ్చే నిధుల వినియోగంపై ఆడిట్ జరుగుతోందని తెలంగాణ సర్కార్ హైకోర్టుకు తెలిపింది. గత రెండేళ్లు ఆడిట్ జరిగిందని , ఈ ఏడాది కూడా నిర్వహిస్తామని చెప్పింది. అయితే వీటికి చెందిన పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 700 కోట్లకుపైగా వెచ్చించిందని, చేసే పనులపై తనిఖీలుగానీ, వ్యయంపై ఆడిట్‌గానీ లేదని పేర్కొంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి వేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని మంగళవారం బెంచ్ విచారించింది. రెండేళ్లుగా ఆడిట్ జరిగిందని, ఈ ఏడాది కూడా ఆడిట్ కొనసాగుతుందని అడ్వకేట్ జనరల్ డి. ప్రకాశ్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. వివరాలు సమర్పించాలన్న హైకోర్టు తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

ఎపిపి నియామకాల కేసులో సర్కారు తీరుపై కోర్టు ఆగ్రహం



మన తెలంగాణ/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఎపిపి) నియామకాల కేసులో ప్రభుత్వ వాదనతో కౌంటర్ పిటిషన్ సమర్పించకపోవడంపై తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కౌంటర్ దాఖలు చేయని పక్షంలో వచ్చే వారం జరిగే విచారణకు స్వయంగా హాజరుకావాలని ఆయనను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో అదనపు పిపిల భర్తీ చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతోందని పేర్కొంటూ దాఖలైన రిట్లను బెంచ్ మంగళవారం విచారించింది.కోర్టులంటే జోక్‌గా మార్చవద్దంటూ తీవ్ర స్వరం తో బెంచ్ హెచ్చరించింది. గత విచారణ సమయంలో ఎపిపిల నియామకాలపై హైకోర్టు స్టే ఆదేశాలిస్తూ కౌంటర్ వేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శికి ఉత్తర్వులిచ్చింది. నేటి విచారణ సమయంలో వ్యవధి కావాలని కోరడంతో హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేయడంతో ఆఖరి అవకాశం ఇవ్వాలన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను బెంచ్ అంగీకరించి విచారణ వారానికి వాయిదా వేసింది.

చెరువును ఆక్రమించుకుంటే సర్కారుకు పట్టదా? హైకోర్టు

మన తెలంగాణ/హైదరాబాద్ : పర్చూర్ మండలం దేవరపల్లి గ్రామంలోని కృష్ణం రాజు చెరువు అనే పెద్ద చెరువు ఆక్రమణల వివరాలు, చెరువు రక్షణకు తీసుకున్న చర్యలను తెలపాలని ప్రకాశం జిల్లా కలెక్టర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులను హైకోర్టు ఆదేశించింది. 39 ఎకరాలకు పైగా ఉన్న భూమిలో ఉన్న చెరువును కొందరు ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటే అధికారులు తమకేమి పట్టనట్లుగా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని, చెరువును కాపాడేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఎంపిటిసి గుండు సుబ్బారావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిని మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. చెరువును రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ అధికారులను, గ్రామ పంచాయతీ కార్యదర్శిలకు బెంచ్ ఉత్తర్వులిచ్చింది. విచారణ రెండు వారాలకు వాయిదా పడింది. చెరువు ఆక్రమణలు కళ్ల ముందు కనబడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పిటిషనర్ లాయర్ ఎన్. శ్రీధర్ రెడ్డి వాదించారు. చెరువు గట్టు, చెరువులోకి నీరు వచ్చే ప్రాంతాలన ప్రజాధనంతో తహసీల్దార్ బాగు చేస్తే ఆక్రమణదారులు తిరిగి సాగు ప్రారంభించారని చెప్పారు. గ్రామస్తుల వినతి మేరకు జరిగిన పనులపై ఆక్రమణదారులు హైకోర్టుకు వచ్చారని తెలిపారు.

నేడు నంద్యాల ఉప ఎన్నిక





నంద్యాల: ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా నంద్యాల నియోజకవర్గ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని కేంద్రాలకు పోలింగ్ సామాగ్రి తరలివెళ్లింది. పోలింగ్ సిబ్బంది సహా దాదాపు 6వేల మంది ఎన్నికల విధుల్లో పాలు పంచుకుంటున్నారు. బుధవారం ఉదయం 7 గంటలను నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాల్లో 144 కేంద్రాలను అత్యంత సమస్మాత్మకంగా, 71 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. నియోజకవర్గం మొత్తం దాదాపు సమస్యాత్మకంగా ఉండటంతో ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పారామిలటరీ బలగాలకు అప్పగించనున్నారు. ఇప్పటికే 6 కంపెనీల కేంద్ర పోలీస్ బలగాలు నంద్యాలకు చేరుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వెబ్‌క్యాస్టింగ్ సిబ్బంది సహా మొత్తం 10మంది విధులు నిర్వహించనున్నారు మొదటిసారిగా నంద్యాల ఉప ఎన్నికలో వివిపిఎటిని ఏర్పాటు చేశారు. మొత్తం 2.19 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే ప్రధానంగా టిడిపి, వైఎస్ఆర్‌సిపిల మధ్యే పోటీ నెలకొని ఉంది.

కొత్త అమర వీరుల స్థూప నిర్మాణానికి భూమి

ప్రభుత్వానికి ఆర్ అండ్ బి శాఖ వినతి

మన తెలంగాణ / హైదరాబాద్ : ట్యాంక్ బండ్ నుండి చూసినా కనిపించేలా అతిపెద్ద అమర వీరుల స్మారక స్థూప నిర్మాణానికి భూమిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్లు భవనాలశాఖ లేఖ రాసింది. ప్రభుత్వం చూపించిన విధంగా స్థూపాన్ని డిజైన్ చేసి నిర్మాణం చేసేందుకు కన్సల్టెన్సీ సంస్థను కూడా నియమించిన ఆర్ అండ్ బి శాఖ ప్రభుత్వం చూపించే భూమి కోసం నిరీక్షిస్తోంది. ట్యాంక్ బండ్‌కు కొత్త అందాలను తెచ్చేందుకు ఇటీవల ఎత్తైన జాతీయ పతాకాన్ని ఆవిష్కరింపజేసిన ప్రభుత్వం అమర వీరుల స్మారక స్థూపం కూడా అదే స్థాయిలో ట్యాంక్‌బండ్‌కు అట్రాక్షన్ తేవాలని భావిస్తోంది. ఇప్పటికే ట్యాంక్ బండ్ పై విగ్రహాలు మరో వైపు భారీ ఎత్తైన జాతీయ జెండా నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే.

భారత మహిళలకు నా అవార్డు అంకితం : బెంబెం దేవి

న్యూఢిల్లీ: గత ఏడాది షిల్లాంగ్‌లో జరిగిన దక్షిణ ఆసియా గేమ్స్ సమయంలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైర్‌మెంట్ ప్రకటించిన భారత మహిళల ఫుట్‌బాల్ క్రీడాకారిణి ఓయినమ్ బెంబెం దేవి తనకు లభించిన అర్జున అవార్డును భారతీయ మహిళలకు అంకితం చేస్తున్నట్టు ప్రకటించింది. రెండు దశబ్దాలుగా భారత మహిళల ఫుట్‌బాల్ జట్టుకు సేవలందించిన బెంబెం భారత్ తరపున 85 గేమ్‌లు ఆడగా, 32 గోల్స్ సాధించింది. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బెంబెంను అర్జున అవార్డుకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా స్పందించిన ఆమె.. 'ఫుట్‌బాల్ క్రీడలో రాణించేందుకు సహాయ సహకారాలు అందించి ప్రోత్సహించిన నా తల్లికి ఎంతో రుణపడి ఉంటాను. అలాగే ఫుట్‌బాల్ క్రీడను ప్రోత్సహించేలా నాకు సహకారాన్ని అందించిన సహచర జట్టు సభ్యులు, కోచ్‌లు, ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఎఐఎఫ్‌ఎఫ్) ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రతిఒక్కరూ తమపై నమ్మకం ఉంచి కలలను సాకారం చేసుకునే దిశగా కొనసాగాలి. కష్టపడి పనిచేయడానికి మరో దారి లేదు. ఆకాశమే లక్ష్యంగా వెళ్లాలి. అప్పుడే విజయం మనల్ని వరిస్తుంది' అని పేర్కొంది. 1995 లో అంతర్జాతీ ఫుట్‌బాల్‌లో ప్రవేశించిన బెంబెం ఎఐఎఫ్‌ఎఫ్‌తో భారత్‌లో మహిళల ఫుట్‌బాల్‌పై అవగాహన తేవడంలో ఎంతో కృషి చేసింది.



ఖేల్‌రత్నాలు వీరే..

- పుజారా, హర్మన్‌ప్రీత్ సహా 17 మందికి అర్జున అవార్డులు
- ఏడుగురికి ద్రోణాచార్య, ముగ్గురికి ధ్యాన్‌చంద్
- కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ప్రకటన





ఢిల్లీ: 2017 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మకమైన రాజీవ్ గాంధీ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య, ద్యాన్‌చంద్ అవార్డులను మంగళవారం కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ప్రకటించింది. క్రీడారంగంలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చే క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ప్రతి ఏటా ఇచ్చే దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన రాజీవ్ ఖేల్‌రత్నకు ఇద్దరు, అర్జున అవార్డులు 17 మంది క్రీడాకారులకు, కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ఏడుగురికి, ద్యాన్‌చంద్ అవార్డులను ముగ్గురికి ప్రకటించింది. రాజీవ్ ఖేల్‌రత్న అవార్డుకు పారాంలిపియన్ భారత స్టార్ దేవేంద్ర జజారియా, భారత హాకీ మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్ ఎంపికయ్యారు. రిటైర్డ్ జడ్జీ సికె. తక్కర్ అధ్యక్షతన సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు రియో ఒలింపిక్స్‌లో పురుషుల ఎఫ్46లో జావెలెన్ త్రోయర్‌గా రెండు బంగారు పతకాలను సాధించిన తొలి భారతీయుడిగా దేవంద్ర జజారియాను ఖేల్‌రత్న అవార్డుకు ఎంపికచేశారు. దేవేంద్రతో పాటు హాకీ మాజీ కెప్టెన్ 31 ఏళ్ల సర్దార్‌ను కూడా ఖేల్‌రత్నకు రెండో అభ్యర్థిగా సెలెక్షన్ కమిటీ ఎంపిక చేయడంతో వీరద్దరూ సంయుక్తంగా ఈ అవార్డును అందుకోనున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సర్దార్ రెండు ఆసియా గేమ్స్ పతకాలు సాధించగా, 2014 లో ఇంచియాన్‌లో బంగారు పతకం, 2010 లో గ్వంగ్స్యూలో కాంస్య పతకాన్ని సాధించాడు. రెండు కామన్వెల్త్ గేమ్స్‌లో కూడా రజత పతకాలను సర్దార్ సింగ్ సాధించాడు. గత ఏడాది తొలిసారి నలుగురు క్రీడాకారులకు రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న అవార్డులు దక్కగా, వారిలో భారత షట్లర్ పివి సింధు, రెజ్లర్ సాక్షి మాలిక్, జిమ్నాస్ట్ దీపా కర్మకర్, భారత షూటర్ జితూ రాయ్‌లు ఉన్నారు.

పురస్కార గ్రహీతలకు నగదు బహుమతి

పురస్కారాలు, ప్రశంస పత్రాలు మాత్రమే కాకుండా రాజీవ్ ఖేల్‌రత్న పురస్కార గ్రహీతలకు రూ. 7.5లక్షల నగదు బహుమతి అందజేయనున్నారు. అలాగే అర్జున, ద్యాన్‌చంద్, ద్రోణాచార్య అవార్డుల గ్రహీతలకు విగ్రహాలు, సర్టిపికేట్లతో పాటు ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున నగదు బహుమతి అందజేయనున్నారు. ఈ నెల 29న రాష్ట్రపతిభవన్‌లో ఏర్పాటు చేయనున్న ఓ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా వీరంతా ఈ అవార్డులను అందుకోనున్నారు.



ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు

1.	ఆర్ గాంధీ(మరణానంతరం)	అథ్లెటిక్స్
2.	హీరానంద్ కటారియా	కబడ్డీ
3.	జిఎస్‌ఎస్‌వి ప్రసాద్	బ్యాడ్మింటన్ లైఫ్‌టైమ్
4.	బ్రిజ్ భూషన్ మహంతి	బాక్సింగ్ లైఫ్‌టైమ్
5.	పిఎ రాఫెల్	హాకీ లైఫ్‌టైమ్
6.	సంజయ్ చక్రవర్తి	షూటింగ్
7.	రోషన్ లాల్	రెజ్లింగ్ లైఫ్‌టైమ్

ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీతలు

1.	భూపేందర్	అథ్లెట్
2.	షాహిద్ హకిన్	ఫుట్‌బాల్
3.	సుమరై టెటె	హాకీ

అర్జున అవార్డు గ్రహీతలు

1.	వి. జ్యోతిసురేఖ(**తెలుగు**)విలువిద్య	
2.	కుష్బీర్ కౌర్	అథ్లెటిక్స్
3.	అరోకియారాజీవ్	అథ్లెటిక్స్
4.	ప్రశాంతి సింగ్	బాస్కెట్‌బాల్
5.	లైశారాందేబెంద్రో సింగ్	బాక్సింగ్
6.	చతేశ్వర పుజారా	క్రికెటర్
7.	హర్మన్‌ప్రీత్ కౌర్	మహిళా క్రికెటర్
8.	ఓయినమ్‌బెంబెం దేవి	ఫుట్‌బాల్
9.	ఎస్‌ఎస్‌పి చౌరాసియా	గోల్ఫ్
10.	ఎస్‌వి సునీల్	హాకీ
11.	జస్వీర్ సింగ్	కబడ్డీ
12.	పిఎన్ ప్రకాశ్	షూటింగ్
13.	అమల్‌రాజ్	టేబుల్ టెన్నీస్
14.	సాకేత్ మైనేని(**తెలుగు**)	టెన్నిస్
15.	సత్యవత్ కడియన్	కబడ్డీ
16.	మరియప్పన్	పారా అథ్లెట్
17.	వరుణ్ సింగ్ భాటీ	పారా అథ్లెట్




బిడబ్ల్యుఎఫ్ ప్రీక్వార్టర్ ఫైనల్లో సింధు

- ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

గాస్గో (స్కాట్లండ్): రియో ఒలింపిక్ రజత పతక విజేత, భారత అగ్రశ్రేణి షట్లర్ పివి సింధు బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రిక్వార్టర్స్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ విభాగంలో మంగళవారం 49 నిమిషాల పాటు సాగిన రెండో రౌండ్‌లో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన తెలుగుతేజం సింధు 42 వ ర్యాంకర్ దక్షిణ కొరియా క్రీడాకారిణి కిమ్ హ్యోమిన్‌పై 21–16, 21–14 తేడాతో విజయం సాధించింది. తొలిగేమ్‌లో వరుసగా 8 గేమ్ పాయింట్లతో దూసుకెళ్లిన సింధు 8–0 తో ఆధిక్యాన్ని కనబర్చింది. ప్రత్యర్థి కిమ్ తరువాతి రెండు పాయింట్లను దక్కించుకుంది. కానీ, తొలి బ్రేక్‌లో సింధు 11–5 తో అధిక్యాన్ని కనబర్చింది. ప్రత్యర్థి కిమ్‌ను కోలుకోనికుండా తన పోరాటాన్ని సాగించి సింధు 21–16 తో దూసుకెళ్లింది. దీంతో రెండో గేమ్‌లో కిమ్ 3–7 తేడాతో పుంజుకోని రెండుపాయింట్లకు సమం చేసింది. కానీ, సింధు 11–8 తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో రెండోగేమ్‌లో కిమ్ చేసిన అనవసర తప్పిదాలు సింధుకు అనుకూలించాయి. తద్వారా రెండోగేమ్‌లో సింధు 21–14 తో కిమ్‌పై గెలుపు సాధించింది.

సాయి ప్రణీత్, జయరాం శుభారంభం

సింగపూర్ ఓపెన్ ఛాంపియన్ సాయి ప్రణీత్, అజయ్ జయరాం శుభారంభం చేశారు. పురుషుల సింగిల్స్ విభాగంలో వీ నాన్ (హాంకాంగ్)పై 21–18, 21–17 తేడాతో గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 15వ సీడ్‌గా బరిలోకి దిగిన ప్రణీత్‌కు ప్రత్యర్థి నాన్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. 48 నిమిషాల పాటు నువ్వానేనా అంటూ సాగిన మ్యాచ్‌లో చివరికి సాయి హాంకాంగ్ క్రీడాకారుడిపై విజయం సాధించాడు. హైదరాబాద్‌కు చెందిన 25 ఏళ్ల ప్రణీత్ రెండో రౌండ్‌లో ఇండోనేషియా క్రీడాకారుడు అంథోనీ సినిసుక గిన్‌టింగ్‌తో తలపడనున్నాడు. అదేవిధంగా పురుషుల సింగిల్స్ విభాగంలో తొలి రౌండ్ మ్యాచ్‌లో 13వ సీడ్‌గా బరిలోకి దిగిన అజయ్ జయరాం 114వ ర్యాంకర్ ఆస్ట్రియా క్రీడాకారుడు లుకా వ్రాబర్‌ను మట్టికరిపించాడు. దాదాపు 31 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలిరౌండ్‌లో 21–14, 21–10 తేడాతో వ్రాబర్‌పై జయరాం గెలిచాడు. ఇక మిక్సడ్ డబుల్స్‌లో సుమీత్‌రెడ్డి, అశ్విని పొన్నప్ప జోడీ 18–21, 21–17, 21–5 తేడాతో చైనా ద్వయం వాంగ్ యిలియు, హాంగ్ డాంగ్‌పింగ్‌ల చేతిలో పరాజయం పాలయ్యారు.





నైక్ కిట్ల పంపిణీపై కోహ్లిసేన, బిసిసిఐ అసంతృప్తి

ముంబయి: భారత క్రికెట్ జట్టుకు సంబంధించిన కిట్లను పంపణీ చేసే నైక్ స్పాన్సర్‌షిప్‌పై, కోహ్లిసేన, బిసిసిఐ (భారత క్రికెట్ నియంత్రణ బోర్డు) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి జట్టులోని ఆటగాళ్లంతా కిట్ల పంపిణీ సమస్యను బిసిసిఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో బిసిసిఐ కూడా ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. అయితే గత కొన్నేళ్లుగా భారత క్రికెట్ జట్టుకు నైక్ సంస్థ కిట్లను పంపిణీ చేస్తోంది. ఈ సమస్యపై ఇటీవల సిఓఎ సమావేశంలో చర్చకు రాగా, సిఓఎ ఛైర్మన్ వినోద్ రాయ్ చాలా సీరియస్‌గా తీసుకున్నారు. నైక్ కిట్ల పంపిణీ సమస్యను పరిష్కరించే దిశగా చర్చలు జరిపేందుకు వచ్చేవారం మరోసారి సమావేశం నిర్వహించనున్నట్టు బిసిసిఐ సిఇఓ రాహుల్ జోహ్రీ తెలిపారు. 2006 నుంచి బిసిసిఐతో నైక్ సంస్థ ఒప్పందం కొనసాగుతోంది. గత ఏడాది రూ. 370 కోట్లతో కిట్ల పంపిణీకి నాలుగేళ్ల పాటు స్పాన్సర్‌షిప్ హక్కులను నైక్ సొంతం చేసుకుంది. ఈ ఒప్పందం 2020 వరకు పునరుద్ధరించడం జరిగింది. కాగా, ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా శ్రీలంకలో కోహ్లిసేన పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. తొలివన్డేలో లంకపై 9 వికెట్ల తేడాతో విజయం సాధించిన భారత్ 10 తో ఆధిక్యంలో ఉంది. లంకతో రెండో వన్డే ఈ నెల 24న పల్లెకెలె వేదికగా జరుగనుంది.



పుణెరిపై గుజరాత్ ఘన విజయం



లక్నో: గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. ప్రో కబడ్డీ సీజన్–5లో భాగంగా మంగళవారం పుణెరి పల్టాన్‌తో జరిగిన జోన్–ఎ మ్యాచ్‌లో గుజరాత్ 35–21 తేడాతో ఓడించింది. గుజరాత్ స్టార్ డిఫెండర్ ఫజల్ అత్రాఛలీ 10 ప్రయత్నాల్లో 9 మంది రైడర్లను పట్టేసి ట్యాకిల్ పాయింట్లు సాధించాడు. టాప్ రైడర్ సుకేశ్ హెగ్డే 14 రైడ్ ప్రయత్నాల్లో 4 ట్యాకిల్ పాయింట్లు సాధించాడు. పుణెరి జట్టులో టాప్ రైడర్ దీపక్ హుడా 15 ప్రయత్నాల్లో 5 పాయింట్లు సాధించగా, సందీప్ నా ర్వేల్ 7 ప్రయత్నాల్లో 4 పాయింట్లు సాధించాడు. గుజరాత్ మిగతా రైడర్లలో సచిన్ 4 పాయింట్లు, ప్రవేశ్ 2 పాయింట్లు, రోహిత్ 2 పాయింట్లు, అబ్జార్ మిఘానీ, పవన్ 4 పాయింట్లు సాధించారు. పుణెరి పల్టాన్‌లో మిగ తా రైడర్లలో మోర్ మూడు పాయింట్లు, గిరీ ష్ నాలుగు పాయింట్లు సాధించారు. టోర్నీలో 10 మ్యాచ్‌లు ఆడిన గుజరాత్ 7 మ్యాచ్‌లు విజయా లు సాధించి, 2 టైలు, 1 ఓటమితో మొత్తం 41 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రెండో స్థానంలో ఉన్న పుణెరి పల్టాన్ 6 మ్యా చ్‌ల్లో 4 విజయాలు, రెండు ఓటమితో 21 పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో యూపి యోధాకు మరో పరాజయం పలకరించింది. బెంగాల్ వారియర్స్‌తో జరిగిన జోన్–బి మ్యాచ్‌లో యూపి 32–31 తో పోరాడి ఓడింది. ఆట ఆరంభమైనప్పటి నుంచి రెండు జట్లు హో రాహోరీగా తలపడ్డాయి. కానీ, చివరికి వారయర్స్ అధిక్యం దిశగా కొనసాగడంతో యో ధాకు కష్టాల్లో పడింది. బెంగాల్ వారియర్స్‌లో దీపక్ నర్వాల్ 10 పాయింట్లు, సుర్జీత్ సింగ్ 3 పాయింట్లు సాధించగా, యూపి యోధాలో నితిన్ తోమర్ 8 రైడ్ పాయింట్లు, సంతోష్ మూడు పాయింట్లు సాధించాడు.

భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు కోచ్‌గా జుడ్ ఫెలెక్స్

న్యూఢిల్లీ: భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు కోచ్‌గా జుడ్ ఫెలెక్స్‌ను మంగళవారం హాకీ ఇండియా నియమించింది. యూరప్‌లో జరిగిన టోర్నీలో జూనియర్ హాకీ జట్టు అద్భుత ప్రదర్శనతో మెరిసింది. గత ఏడాది ప్రపంచ కప్‌లో కూడా తొమ్మిది ఆటగాళ్లతో విజయం సాధించింది. ఐదు ఆరు సంవత్సరాలుగా సీనియర్ హాకీ జట్టు స్థాయిలో జూనియర హాకీ ఆటగాళ్లు అద్భుతంగా రాణిస్తు విజయాలను సొంతం చేసుకుంటున్నారని హాకీ ఇండియా డైరెక్టర్ ఆఫ్ ఇండియా డేవిడ్ జాన్ పేర్కొన్నారు. దీంతో 33 సభ్యులు గల జూనియర్ హాకీ జట్టుకు కొత్త కోచ్‌గా ఫెలెక్స్ సేవలందించనున్నాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ సాధించేలా ఫెలెక్స్ వారికి శిక్షణ ఇవ్వనున్నాడు. 1995 లో ఫెలెక్స్‌కు అర్జున అవార్డు లభించింది. హాకీ జట్టుగా కెప్టెన్‌గా 1993 ప్రపంచ కప్, 1994 ఆసియన్ గేమ్స్‌లో సారథి బాధ్యతలు వహించాడు. తన కెరీర్‌లో మొత్తం 250 మ్యాచ్‌లు ఆడిన జుడ్.. 1990, 1994 లో భారత తరపున రెండు ప్రపంచ కప్‌లు, రెండు ఆసియన్ గేమ్స్‌లు ఆడాడు. అదేవిధంగా 1985, 1987, 1989 సంవత్సరాల్లో మూడు ఛాంపియన్స్ ట్రోఫీలకు కూడా ప్రాతినిథ్యం వహించాడు. 1997 లో నెదర్లాండ్స్ అండర్ 18 జట్టుకు ఫెలెక్స్ కోచ్‌గా కూడా పనిచేశాడు. జాతీయ హాకీ జట్టుకు 2014 లో ప్రధాన సహాయ కోచ్‌గా పనిచేశాడు. ఈ ఏడాది జరుగబోయే తొలి అంతర్జాతీయ టోర్నమెంట్ సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్‌కు 18 మంది సభ్యుల గల జూనియర్ హాకీ జట్టుకు ఫెలెక్స్ కోచ్‌గా సేవలందించనున్నాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.